సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 12 వెల: ₹ 5.00
సంపుటి: 13 సంచిక: 15
మంగళవారం 7-4-2020
SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'


**నా శైలిని మార్చుకోను...**
దూకుడుగా ఆడటమే ఇష్టమంటున్న భారత టీనేజ్ క్రికెటర్ షఫాలీ వర్మ
- స్పోర్ట్స్‌లో


**అయ్యో.. ఆతిథ్యం!**
73% తగ్గిపోయిన ఆదాయం..మూసివేత రిస్కుల్లో చిన్న హోటళ్లు
– బిజినెస్‌లో

## 'హాట్ స్పాట్స్' కాని ప్రాంతాల్లో..



- ఏప్రిల్ 14 తరువాత లాక్‌డౌన్‌ను దశలవారీగా ఎత్తివేసే దిశగా ప్రధాని మోదీ సంకేతాలిచ్చారు. దేశవ్యాప్తంగా వైరస్ హాట్‌స్పాట్స్ కాని ప్రాంతాల్లో లాక్‌డౌన్‌ను ఉపసంహరించేలా ప్రణాళిక రూపొందించాలని కేంద్ర మంత్రులకు సూచించారు. ఈ సంక్షోభ సమయాన్ని 'మేక్ ఇన్ ఇండియా'ను ప్రోత్సహించేందుకు, విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు లభించిన ఒక అవకాశంగా భావించాలన్నారు.

- వివరాలు 8లో

## ఎంపీల వేతనాల్లో 30% కోత

- ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సహా ఎంపీల వేతనంలో సంవత్సరం పాటు 30% కోత విధిస్తూ రూపొందించిన ఆర్డినెన్స్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే ఎంపీల్యాడ్ ఫండ్ పథకాన్ని తాత్కాలికంగా నిలిపివేసేందుకు కూడా మంత్రి మండలి గ్రీన్ సిగ్నలిచ్చింది. రెండేళ్లకు గానూ ఎంపీ ల్యాడ్ మొత్తం దాదాపు రూ.7,880 కోట్లు అవుతుంది. ఈ మొత్తాన్ని కరోనాపై పోరాటానికి వినియోగించనున్నారు.

- వివరాలు 8లో

**ఇది సుదీర్ఘ పోరాటం..**

" కరోనాపై సుదీర్ఘకాలం పోరాటం చేయాల్సి ఉంది. బయటకు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ ఫేస్ మాస్కు ధరించడం చాలా అవసరం. లాక్‌డౌన్ సమయంలో సమస్య తీవ్రతను గ్రహించి ప్రజలు చూపిన పరిణతి అపూర్వం. భారత్ వంటి పెద్ద దేశంలో ప్రజలు ఇలా క్రమశిక్షణ, సేవాభావం చూపుతారని ఎవరూ ఊహించి ఉండరు. ఆదివారం సాయంత్రం దేశవ్యాప్తంగా దీపాలు వెలిగించి దేశ ప్రజలు సమైక్యతను ప్రదర్శించారు. ధనిక, పేద, అక్షరాస్యులు, నిరక్షరాస్యులు, అన్ని వయసుల వారు, ఇలా సమాజంలోని అందరూ 130 కోట్ల ప్రజల ఉమ్మడి శక్తిని చూపేందుకు చేతులు కలిపారు.

- ప్రధాని మోదీ

# లాక్‌డౌన్ పొడిగించాలి

## ఏప్రిల్ 15 తర్వాత కొనసాగించాలని ప్రధానిని కోరుతున్నా..

## కేంద్రం నో అంటే రాష్ట్రంలో పొడిగించాలని అనుకుంటున్నా: కేసీఆర్



సోమవారం ప్రగతిభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ నివేదికను చూపిస్తున్న సీఎం కేసీఆర్

- ప్రస్తుత సదుపాయాలు, సిబ్బందితో వైరస్‌ను ఎదుర్కోలేం
- ఆర్థికంగా పుంజుకోవచ్చు.. కానీ పోయిన ప్రాణాలు తీసుకుని రాలేం
- నిజాముద్దీన్ ఘటన లేకుంటే తెలంగాణ ఆరామ్‌గా ఉండేది
- మరో వంద మందికి వైరస్ వచ్చే అవకాశం
- ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న వైద్య సిబ్బందికి పాదాభివందనం
- విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్

'ఏప్రిల్ 15 తర్వాత దేశం లాక్‌డౌన్ పొడిగించడానికే నా మద్దతు. కోవిడ్–19తో జరిగే ఆర్థిక నష్టం నుంచి మనం కోలుకోగలం కానీ పోయిన ప్రాణాలను వెనక్కి తీసుకుని రాలేం. భారతదేశంలోని దుర్భర సదుపాయాలు, వైద్యులు, సిబ్బంది కొరత ఉన్న ప్రస్తుత పరిస్థితిలో మనం ఈ వైరస్‌ను ఎదుర్కోలేం. కేవలం లాక్‌డౌన్ ఒక్కటే ఆయుధం. మనం యూకే, సింగపూర్ కన్నా ఎక్కువ కాదు. మనం ఆర్థికంగా మెరుగ్గా ఉండే. దురదృష్టవశాత్తు ఈ విపత్తు వచ్చిపడింది. ఎలాంటి సంశయం లేకుండా లాక్‌డౌన్‌ను పొడిగించాలని నేను ప్రధానమంత్రి, కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్న. ప్రతి రాష్ట్ర సీఎంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంప్రదింపులు జరిపి అత్యంత జాగ్రత్తతో నిర్ణయం తీసుకోవాలి. ఈ ప్రాణాంతక వైరస్‌ను ఎదుర్కోవడానికి మన వద్ద మరో గత్యంతరం లేదు. ఆర్థికంగా పుంజుకోవడానికి ఆరేడు నెలలు పట్టవచ్చు. లాక్‌డౌన్ పొడిగించడం ఒక్కటే ఆయుధం అని నా అనుభవం, విజ్ఞానంతో చెబుతున్న'అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పేర్కొన్నారు. కేంద్రం లాక్‌డౌన్ పొడిగించకపోతే రాష్ట్రంలో పొడిగించాలని అనుకుంటున్నానని చెప్పారు. సమాజానికి ఇదే మేలు చేస్తుందని, దీనిపై తెలంగాణ సమాజాన్ని అడగాలనుకుంటున్నానని తెలిపారు. కరోనా వైరస్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సోమవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ విలేకరులతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

### ఎత్తేస్తే నియంత్రించలేం...

కరోనా ప్రపంచానికి వచ్చిన పెద్ద పీడ. ఇది వ్యక్తికో, కుటుంబానికో, ఊరికో వచ్చింది కాదు. యావత్తు మానవజాతి ఎదుర్కొంటున్న సంక్షోభం. లాక్‌డౌన్ వల్లే సమాజాన్ని బతికించుకున్నాం. అమెరికాకు చెందిన ప్రముఖ సర్వే సంస్థ బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) భారత్‌లో జూన్ 3 వరకు లాక్‌డౌన్ కొనసాగించాల్సి ఉంటుందని చెబుతోంది. నా వ్యక్తిగత అభిప్రాయం కూడా ఇదే. లాక్‌డౌన్ ఎత్తేసి, వదిలేస్తే ఎవరిని వదలాలి. ఎవరిని వద్దు. ఒక్కసారిగా అన్ని మార్కెట్లు తెరుచుకుంటాయి. మళ్లీ బస్సులు, రైళ్లు, విమానాలు స్టార్ట్ చేస్తమా? ఎక్కడ ఆగుతం. ఒకసారి గేట్ తీసి నువ్వు ఆగు, నువ్వు ఉండు అంటే చాలా ఇబ్బంది

మిగతా 2వ పేజీలో ▶

" రేషన్ కార్డులు లేని పేదలకూ బియ్యం, ఆర్థిక సహాయం తప్పనిసరిగా ఇస్తం. ఒక్క మనిషి కూడా ఉపవాసం ఉండొద్దు. ఎవరైనా ఆకలికి గురైతే ఆ గ్రామ సర్పంచ్‌లు, కౌన్సిలర్లు అధికారులకు రిపోర్టు చేయాలి. పేదలకు కేంద్రం ఇచ్చే సాయాన్ని రాష్ట్రం సహాయానికి కలుపుకుని ఇస్తున్నం. కేంద్రం, రాష్ట్రం వేర్వేరు కాదు. ప్రభుత్వానికి 6 రోజుల్లో రూ.2,400 కోట్లు వచ్చే చోట రూ.6 కోట్లు వస్తే ఏం చేయాలి? ఉన్నంతలో ఆహార కొరత రాకుండా, నిత్యావసర వస్తువులు, పాల కొరత రాకుండా చూసుకోవాలి. ప్రతి ఒక్కరి పొట్టనింపాలి. ఇది ఒకటే దారి.

విద్యా సంస్థలు ఎప్పుడు తెరుస్తరో ఎవరికీ తెలియదు. ముందు బతికి ఉంటే కదా అకడమిక్ ఇయర్. హైదరాబాద్ సంస్థానం ఇండియాలో విలీనమైనప్పుడు ఆనాడు హెచ్ఎల్‌సీ(ఇంటర్)లో ఉన్న వారందరినీ పాస్ చేశారు. దీంతో అప్పటికే ఎనిమిది తొమ్మిదిసార్లు డుమ్మీలు కొట్టిన వారు పాసయ్యారు. అలా పాస్ అయినవారు కొందరు జడ్జీలు, ఐఏఎస్ అధికారులు అయ్యారు. తర్వాత కష్టపడి చదువుకుని పైకొచ్చారు. మా ఊరికి చెందిన ఒకాయన పెద్ద న్యాయకోవిదుడు అయిండు. పేరు చెప్పను.

## ఏపీలో మరో 51 పాజిటివ్‌లు

సాక్షి, అమరావతి

ఏపీలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 303కు చేరింది. ఆదివారం సా. 6 గంటల నుంచి సోమవారం సా. 6 గంటల వరకు రాష్ట్రంలో 51 కేసులు నమోదైనట్లు ఏపీ ప్రభుత్వం బులెటిన్ విడుదల చేసింది. ఇందులో కర్నూలు జిల్లాలోనే 21 కేసులు నమోదయ్యాయి. దీంతో కర్నూలు జిల్లాలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 74కు చేరింది. రాష్ట్రం మొత్తం మీద కేసుల్లో 25 శాతం ఈ జిల్లాలోవే కావడంతో హైఅలర్ట్ ప్రకటించారు. ఇక సోమవారం నెల్లూరు జిల్లాలో 8 కేసులు, పశ్చిమగోదావరిలో 6, విశాఖలో 5, కడపలో 4, అనంతపురంలో 3, గుంటూరులో 2, కృష్ణా, ప్రకాశంలో ఒక్కో కేసు నమోదయ్యాయి. రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన 303 కేసుల్లో 280 కేసులు ఢిల్లీ వెళ్లివచ్చిన వారితో సంబంధాలున్నవేనని అధికారులు తెలిపారు.

# కొత్తగా 30 కరోనా కేసులు



- అత్యధికంగా హైదరాబాద్‌లోనే..
- గద్వాల, సూర్యాపేట, నిజామాబాద్‌లో పెరుగుదల
- 25 జిల్లాలకు పాకిన కరోనా
- ఇప్పటివరకు 45 మంది డిశ్చార్జి

**364**
మొత్తం కరోనా పాజిటివ్ కేసులు

సాక్షి, హైదరాబాద్

కరోనా కేసులు ఇంకా నమోదవుతూనే ఉన్నాయి. రోజురోజుకూ కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది. సోమవారం మళ్లీ 30 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో ఇప్పటివరకు నమోదైన కరోనా కేసుల సంఖ్య 364కు చేరుకుంది. అందులో ఎక్కువ మంది ఢిల్లీ మర్కజ్‌తో సంబంధం ఉన్నవారే కావడం ఆందోళన కలిగిస్తోంది. మిగిలినవారు వివిధ దేశాల నుంచి వచ్చిన వారు, వారి కుటుంబీకులు, స్థానికంగా ఎలాంటి కాంటాక్ట్‌తో సంబంధం లేకుండా సోకిన వారూ ఉన్నారు. నమోదైన అన్ని కేసుల్లో ఇప్పటివరకు 11 మంది చనిపోయారు. మరో 45 మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారు. వారిలో సోమవారం 12 మంది ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ డిశ్చార్జి అయినట్లు వైద్య, ఆరోగ్య శాఖ తెలిపింది. ఇప్పటివరకు అత్యధికంగా హైదరాబాద్ నుంచే 161 మందికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయినట్లు వైద్య ఆరోగ్య శాఖ విడుదల చేసిన బులెటిన్‌లో తెలిపింది. ఆ తర్వాత నిజామాబాద్ జిల్లాలో 27 కేసులు నమోదు కావడం గమనార్హం. వరంగల్ అర్బన్ జిల్లాలో 24 కేసులు నమోదయ్యాయి. సోమవారం గద్వాలలో ఏకంగా 13కు కరోనా కేసుల సంఖ్య పెరిగింది. సూర్యాపేటలో 8కి చేరుకుంది. కాగా, రాష్ట్రంలో కరోనా కేసుల నివారణ, నియంత్రణపై

మిగతా 3వ పేజీలో ▶

**ప్రపంచ వ్యాప్తంగా..**

**13,29,305**
ఇప్పటివరకు నమోదైన కేసులు

**73,831**
కరోనాతో మృతి చెందినవారు

**2,77,327**
కోలుకున్న వైరస్ బాధితులు..

**అమెరికాలో..**

**3,56,414**
కరోనా బాధితుల సంఖ్య

**10,490**
మృతి చెందినవారు..



**4,281**
దేశ వ్యాప్తంగా కరోనా కేసులు

**111**
మొత్తం మృతుల సంఖ్య..

**రాష్ట్రాల వారీగా కేసులు..**

| రాష్ట్రం | కేసులు | మరణాలు |
|---|---|---|
| మహారాష్ట్ర | 748 | 45 |
| ఢిల్లీ | 523 | 7 |
| తమిళనాడు | 571 | 5 |
| కేరళ | 314 | 2 |
| ఉత్తరప్రదేశ్ | 305 | 3 |
| రాజస్తాన్ | 274 | 0 |
| మధ్యప్రదేశ్ | 165 | 9 |
| కర్ణాటక | 151 | 4 |
| గుజరాత్ | 144 | 12 |
| జమ్మూకశ్మీర్ | 109 | 2 |
| పశ్చిమ బెంగాల్ | 80 | 3 |
| హరియాణా | 84 | 1 |
| పంజాబ్ | 76 | 6 |
| బిహార్ | 32 | 1 |
| అస్సాం | 26 | 0 |
| ఉత్తరాఖండ్ | 26 | 0 |
| ఒడిశా | 21 | 0 |
| చండీగఢ్ | 18 | 0 |
| లదాఖ్ | 14 | 0 |
| అండమాన్ దీవులు | 10 | 0 |
| ఛత్తీస్‌గఢ్ | 10 | 0 |
| గోవా | 7 | 0 |
| హిమాచల్‌ప్రదేశ్ | 6 | 1 |
| పుదుచ్చేరి | 5 | 0 |
| జార్ఖండ్ | 4 | 0 |
| మణిపూర్ | 2 | 0 |
| మిజోరం | 1 | 0 |
| అరుణాచల్ ప్రదేశ్ | 1 | 0 |






# ఐటీ రంగానికి కరోనా కాటు



**190**
గ్రేటర్‌లో మొత్తం ఐటీ కంపెనీలు..

**6,00,000**
ఈ కంపెనీల్లో ఉపాధి పొందుతున్న ఉద్యోగుల సంఖ్య..

- నష్టంపై నాస్కామ్ ఆధ్వర్యంలో ఐటీ శాఖ అధ్యయనం
- త్వరలో ప్రభుత్వానికి నివేదిక
- పలు సంస్థల క్లయింట్ల సమావేశాలు వాయిదా
- ఆన్‌సైట్ ప్రయాణాల రద్దు
- నూతన ప్రాజెక్టులు చేపట్టే అంశంపై డోలాయమానం

**1,07,000 కోట్లు**
గడిచిన ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఐటీ ఎగుమతుల అంచనా మొత్తం..

సాక్షి, హైదరాబాద్: కరోనా మహమ్మారి ఐటీ రంగానికి శాపంగా మారింది. ఏటా సుమారు లక్ష కోట్లకుపైగా ఐటీ ఎగుమతులు సాధిస్తున్న పలు సంస్థలకు తాము పూర్తి చేయాల్సిన ఒప్పందాలకు సంబంధించిన క్లయింట్లతో సమావేశాలు వాయిదాపడ్డాయి. ఆయా దేశాల్లో తమ కంపెనీలు చేజిక్కించుకున్న ప్రాజెక్టుల పూర్తికి పలు ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడి నుంచి తమ సంస్థల టెకీలను ఆయా దేశాలకు పంపించేందుకు బ్రేకులు పడ్డాయి. లాక్‌డౌన్ నేపథ్యంలో మహానగరం పరిధిలోని ఐటీ కంపెనీలు తమ ఉద్యోగులను వర్క్ ఫ్రం హోంకే పరిమితం చేశాయి. దీంతో ఉత్పాదకత గతంతో పోలిస్తే మొస్తరుగా తగ్గిందని ఐటీ రంగ నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితి కారణంగా ఇప్పటికే తమ సంస్థలు చేపట్టిన ప్రాజెక్టులు పూర్తిచేయడం మరింత ఆలస్యమవుతాయని పలు సంస్థల నిపుణులు చెబుతున్నారు. లాక్‌డౌన్ అనంతరం దాదాపు అన్ని కంపెనీలు ఉద్యోగులను ఇంటికే పరిమితం చేసి వర్క్ ఫ్రం హోంకు

మిగతా 3వ పేజీలో ▶

## కరోనా హీట్ ముందు దిగదుడుపే!

- వేసవి వచ్చినా.. ఏసీ, కూలర్ వినియోగం అంతంతే
- గృహ, వాణిజ్య కేటగిరీల్లో తగ్గిన విద్యుత్ డిమాండ్

- 3లో

## మిస్సింగ్ కాదు.. వార్డు మారాడంతే!

- గాంధీలో కరోనా అనుమానితుడి మాయంపై కలకలం
- పొరపాటున మరో అంతస్తులోకి వెళ్లి పడుకున్న వైనం

- 12లో

epaper.sakshi.com

# కార్డు లేకున్నా రేషన్

- రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో 3 లక్షల రేషన్ దరఖాస్తులు
- వీరికి బియ్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశం
- పేద కుటుంబాల వారికి పెద్ద ఊరట

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ఏ ఒక్కరూ ఆకలి బాధ పడకూడదని.. రేషన్ కార్డు ఉన్నా, లేకున్నా బియ్యం పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చేసిన ప్రకటన రేషన్ కార్డులు లేని కుటుంబాలకు ఉపశమనం కలిగించింది. కొత్త కార్డు కోసం ప్రభుత్వానికి విన్నవించుకుని నెలలు గడుస్తున్నా.. అవి మంజూరు కాక, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఇస్తున్న ఉచిత బియ్యానికి నోచుకోని వారంతా సీఎం ప్రకటనతో ఊపిరి పీల్చుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3 లక్షల మందికి పైగా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీళ్లందరికీ ఇప్పుడు బియ్యం అందనుంది. రాష్ట్రంలో చాలా నెలలుగా కొత్త రేషన్ కార్డుల జారీ నిలిచిపోయింది. ప్రతి జిల్లాలో కుప్పలు తెప్పలుగా రేషన్‌కార్డుల



కోసం దరఖాస్తులు రాగా, వీటిల్లో కొన్ని క్షేత్ర స్థాయి పరిశీలనలోనే నిలిచిపోగా, మరికొన్ని మంజూరు కాకుండా ఆగాయి. మీ–సేవ ద్వారా ఆహార భద్రతా కార్డు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా కొత్త కార్డులు, రద్దైన కార్డుల పునరుద్ధరణ, కార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకునేందుకు భారీగా దరఖాస్తులు వచ్చినా, చాలా వరకు పరిష్కారం దొరకలేదు. గత జూన్, జూలైలో పెండింగ్ దరఖాస్తుల క్లియరెన్స్‌కు ప్రత్యేక బృందాలను నియమించి ఏడు రోజుల్లో కార్డులు జారీ చేయాలని ఆదేశించినా ఈ ప్రక్రియ నామమాత్రంగానే సాగింది.

### గ్రేటర్‌లోనే అత్యధికం...

గత డిసెంబర్ నాటికి కొత్త దరఖాస్తుల సంఖ్య 4.44 లక్షలుగా ఉండగా, ఇందులో 1.62 లక్షల మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. మరో 2.82 లక్షల మందికి కార్డులు జారీ చేయాల్సి ఉంది. ఈ మూడు నెలల కాలంలో మరో 20 వేల దరఖాస్తులు వచ్చినా కొత్త కార్డు దరఖాస్తులు 3 లక్షలకు చేరినట్లు సమాచారం. ఇందులో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 1.65 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా యంత్రాంగాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా తెలుస్తోంది. అత్యధికంగా హైదరాబాద్‌లో 80వేల దరఖాస్తులు, రంగారెడ్డి పరిధిలో 60వేలు, మేడ్చల్ పరిధిలో 25వేల కార్డులు పెండింగ్‌లో ఉన్నట్లు అంచనా. పూర్వ నల్లగొండ జిల్లా మొత్తంగా 40 నుంచి 50వేలు, పూర్వ ఆదిలాబాద్ జిల్లాలో మరో 30వేల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం. అయితే పెండింగ్ దరఖాస్తుదారులకు బియ్యం పంపిణీ చేయడం లేదన్న అంశాన్ని విలేకరులు సోమవారం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కేసీఆర్, రాష్ట్రంలోని వలస కార్మికులకే రేషన్ బియ్యం ఇస్తున్నప్పుడు రాష్ట్ర ప్రజలకు బియ్యం అందడం లేదన్న అంశమే తలెత్తరాదన్నారు. బియ్యం అందని వారెవరైనా ఉంటే, దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి బియ్యం ఇప్పించాలని సూచించారు. ఈ విషయంలో ప్రభుత్వం ఉదారంగా ఉంటుందని తెలిపారు. రేషన్ దరఖాస్తుదారులకు ఈ ప్రకటన పెద్ద ఉపశమనం కలిగించింది.

# ప్రభుత్వం అలర్ట్

- గచ్చిబౌలి స్టేడియం సహా 13 ఆస్పత్రుల్లో కరోనా సేవలు
- 5,113 పడకలను సిద్ధం చేస్తున్న ప్రభుత్వం
- వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలోనూ బెడ్లు రెడీ

**సాక్షి, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా కరోనా విరుచుకుపడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమైంది. కేసుల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతుండటంతో యుద్ధ ప్రాతిపదికన వైద్య సేవలందించేందుకు సన్నద్ధమైంది. ప్రస్తుతం కరోనా అనుమానితులకు పరీక్షలు, వైద్య సేవలను కేవలం గాంధీ ఆస్పత్రిలోనే అందజేస్తున్నారు. తాజాగా పాజిటివ్ కేసుల సంఖ్య అమాంతం పెరిగిపోతుండటంతో దానికి తగ్గట్టుగా ఆస్పత్రులను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా గాంధీతోపాటు మరో 11 ఆస్పత్రులను కరోనా చికిత్సల కోసం విస్తరించాలని నిర్ణయించింది. దీనిలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ఉండగా.. మిగతా ఆస్పత్రులు జంట నగరాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులు కావడం గమనార్హం. మరో విశేషమేమిటంటే



గచ్చిబౌలి స్టేడియాన్ని కూడా కరోనా పాజిటివ్ కేసులు, అనుమానితుల పరీక్షల కోసం ఆస్పత్రిగా మార్చాలని ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించింది. దీంట్లో1,200 పడకలను సిద్ధం చేస్తోంది. ఈ ఆస్పత్రుల్లో 5,113 బెడ్‌లను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే 4,091 బెడ్‌లను సిద్ధం చేసిన వైద్య,ఆరోగ్య శాఖ రెండు, మూడు రోజుల్లో మరో 1,022 బెడ్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు వేగిరం చేసింది.

### వెంటిలేటర్లు 255..

వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స ఇచ్చేలా వ్యూహాత్మక చర్యలు తీసుకుంటున్న వైద్య, ఆరోగ్య శాఖ.. మూడు పద్ధతుల్లో బెడ్‌లను సిద్ధం చేస్తోంది. ఐసోలేషన్ బెడ్‌లు, ఐసీయూ బెడ్‌లు, వెంటిలేటర్లతో కూడగట్టిన ఐసీయూ బెడ్‌లుగా విభజించి ఏర్పాటు చేసింది. ప్రస్తుతం 5,113 బెడ్‌లను సిద్ధం చేస్తుండగా ఇందులో ఐసోలేషన్ బెడ్‌లు 4,497, మిగతా పడకలు ఐసీయూ కేటగిరీలోకి వస్తాయి. మొత్తం ఐసీయూ బెడ్‌లు 616 ఏర్పాటు చేయగా... వీటిలో 255 ఐసీయూ పడకలకు వెంటిలేటర్ సౌకర్యాన్ని కూడా కల్పించారు. మిగతా 361 బెడ్‌లు కేవలం ఐసీయూ సేవలందిస్తాయి.

| ఆస్పత్రి | మొత్తం బెడ్లు |
|---|---|
| గాంధీ | 1,500 |
| జిల్లా ఆస్పత్రి–కింగ్‌కోఠి | 350 |
| నేచర్‌క్యూర్–బేగంపేట్ | 345 |
| నిజామియా–చార్మినార్ | 350 |
| ఆయుర్వేద ఆస్పత్రి–ఎర్రగడ్డ | 220 |
| ఆయుర్వేద టీచింగ్ | 100 |
| హోమియో–రామంతాపూర్ | 145 |
| గచ్చిబౌలి | 1200 |
| ఛాతీ వైద్యశాల | 121 |
| సరోజినీదేవి నేత్ర వైద్యశాల | 200 |
| ఫీవర్ హాస్పిటల్ | 82 |
| ఎంజీఎం–వరంగల్ | 200 |
| ఈఎస్ఐసీ–సనత్‌నగర్ | 300 |

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి సంబంధించి అమెరికాకు చెందిన బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) వేర్వేరు స్థితులను పరిగణనలోకి తీసుకుని ఓ నివేదిక రూపొందించింది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో కరోనా నియంత్రణకు లాక్‌డౌన్ ఎప్పుడు ప్రకటించారు? ఆయా దేశాల్లో రోజుకు ఎన్ని కొత్త కేసులు నమోదవుతున్నాయి? యాక్టివ్ కేసులు ఎన్ని? వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నివేదికను రూపొం దించింది. వీటన్నింటి ఆధారంగా ఆయా దేశాల్లో కేసుల సంఖ్య పతాక స్థాయికి ఎప్పుడు చేరుకుంటాయి? లాక్‌డౌన్ నిబంధనలు ఏ తేదీ నుంచి ఎత్తేయొచ్చు? అన్న అంశాలపై అంచనాలను సిద్ధం చేసింది. గత నెల 25 వరకు నమోదైన గణాంకాల ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్లు స్పష్టం చేసింది. కరోనా పరిస్థితులు రోజు రోజుకూ మారిపో తున్న నేపథ్యంలో తమ నివేదికను వైద్యం, భద్రతలకు సంబంధించిన సలహా సూచనలుగా పరిగణించరాదని, ప్రత్యామ్నాయాలుగానూ చూడరాదని తెలిపింది.

## 'బోస్టన్' చెప్పిందేంటి?

- పలు దేశాల్లో కరోనా కేసులపై అధ్యయనం
- ఎప్పుడు లాక్‌డౌన్ ఎత్తివేయొచ్చనే దానిపై విశ్లేషణ
- నివేదిక విడుదల చేసిన బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్

### 10వ మరణంతో లాక్‌డౌన్..

భారత్‌లో కరోనా కేసులు జూన్ మూడో వారంలో పతాక స్థాయికి చేరతాయని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ అంచనా కట్టింది. నివేదికలో సూచించిన గ్రాఫ్ ప్రకారం జూన్ మూడో వారం నాటికి రోజూ 10 వేల కంటే ఎక్కువ కొత్త కేసులు నమోదవుతాయి. చైనాలో మాదిరిగా కరోనా కారణంగా పదో మరణం సంభవించిన రోజున భారత్ లాక్‌డౌన్ ప్రకటించిందని, చైనాతో పాటు, బెల్జియం, పోలండ్ వంటి దేశాల్లోనూ దాదాపు ఇదే స్థితిలో లాక్‌డౌన్ ప్రకటించాయని తెలిపింది. లాక్‌డౌన్‌ను ఎత్తివేసే సమయం గురించి ప్రస్తావిస్తూ.. ఇందు కోసం తాము చైనాలోని హుబే, వూహాన్ ప్రాంతాల్లో ఏ సమయంలో లాక్‌డౌన్ ఎత్తి వేశారన్నదానికి ఆయా దేశాల్లోని ఆరోగ్య వ్యవస్థకు, ప్రభుత్వ సామర్థ్యం, నిర్దిష్ట జనాభాకు అందుబాటులో ఉన్న ఆసుపత్రి పడకల సంఖ్య వంటివి పరిగణనలోకి తీసుకున్నామని వివరించింది. దీంతో పాటు వైరస్ బారిన పడ్డ వారిని సమర్థంగా ఐసోలేషన్‌లో ఉంచగల సామర్థ్యం కూడా ముఖ్యమేనని చెప్పింది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే భారత్‌లో జూన్ ఆఖరు నుంచి సెప్టెంబర్ రెండో వారం మధ్యలో లాక్‌డౌన్‌ను ఎత్తేసేందుకు అవకాశముందని అంచనా కట్టింది. భారత్‌లో ప్రజారోగ్య వ్యవస్థ సన్నద్ధతను దృష్టిలో ఉంచుకుంటే లాక్‌డౌన్‌ను కొంచెం ఎక్కువ కాలం కొనసాగించాల్సిన అవసరమున్నట్లు బీసీజీ భావించింది. సీఎం కేసీఆర్ నివేదిక ఆధారంగానే విలేకరుల సమావేశంలో లాక్‌డౌన్ పొడిగింపునకు తన మద్దతు ప్రకటించారు.



సమావేశానికి ముందు శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకుంటున్న సీఎం కేసీఆర్

# లాక్‌డౌన్ పొడిగించాలి

▶ మొదటి పేజీ తరువాయి

అవుతది. వాళ్లు ఎక్కువనా, నేను తక్కువనా అని భేదభావాలు వస్తయి. లాక్‌డౌన్ పొడిగించాలని నా సూచనను దేశం ముందు పెడుతున్న. దీనిపై ప్రధాని కూడా ఆలోచిస్తున్నరు. అందరితో సంప్రదింపులు జరుపుతామన్నరు. పేదలకు రేషన్, వారి ఖర్చులు ఆలోచించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో దాదాపు 6 లక్షల మంది వలస కూలీలకు మేమే తినిపిస్తున్నం. అన్ని వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాలు, ఆలయాల భిక్షగాళ్లు, ట్రాన్స్‌జెండర్లకు ఏర్పాట్లు చేస్తున్నం. కనీసం ఒకటి రెండు వారాలు లాక్‌డౌన్ పొడిగించాలి. తర్వాత పరిస్థితిని సమీక్షించాలి. 22 దేశాలు మొత్తం లాక్‌డౌన్ చేయడం చిన్న విషయం కాదు. సింగపూర్ లాక్‌డౌన్ ఎత్తేసి పోజులు కొట్టి తర్వాత కంట్రోల్ చేయలేక మళ్లీ విధించింది. చైనా కూడా మళ్లీ లాక్‌డౌన్ చేస్తోంది.

### అప్పులు చేయక తప్పదు..

గత ఆరు రోజుల్లో రాష్ట్రానికి రూ.2,400 కోట్ల ఆదాయం వచ్చేకాడ రూ.6 కోట్లు వస్తుంటే ప్రజలను ఎట్ల సాదుకోవాలి. ఉద్యోగులకు జీతాలు అప్పులు తెచ్చి ఇవ్వాలి. ఎంపీ ల్యాడ్స్ నిధులు ఇవ్వద్దనుకుంటున్నం. ఎంపీల జీతాలను 30శాతం కోత బెట్టాలనుకుంటున్నం అని ప్రధాని నన్ను అడిగిన్రు. మేము ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు 75 శాతం కోతబెట్టినం. ఎంపీలకు కూడా 50శాతం కోత పెట్టమని చెప్పిన. దీనికి మద్దతు ఇవ్వాలని మా పార్లమెంటరీ పార్టీ నేతలకు చెప్పిన. ప్రధానితో అనేక విషయాల మీద అవసరమైతే రోజుకు రెండు మూడు పర్యాయాలు కూడా మాట్లాడుతున్నాం. ఆర్థిక పరిస్థితి, రిజర్వు బ్యాంకు, ఆహార నిల్వలు తదితరాలపై ఎలా ముందుకు వెళ్లాలి. ఈ ప్రతిష్టంభన ఎంత వరకు కొనసాగించాలనే దానిపై చర్చిస్తున్నాం. ప్రధాని అడిగితే లాక్‌డౌన్ కొనసాగించడం మినహా మరోమార్గం లేదని చెప్పా. ఎకానమీ ఎలాగైనా రివైవ్ చేయొచ్చు. సతీ సావిత్రి కథ మినహా పురాణాల్లోనూ చనిపోయిన వాళ్లను వాపస్ తేలేదు. చనిపోయిన మనుషులను ఏం చేసినా తిరిగి తేలేం.

### లాక్‌డౌనే బండ సూత్రం

బీసీజీ చాలా పెద్ద సంస్థ. మన ఒక్క దేశం మీద కాకుండా మొత్తం ప్రపంచం అంతా కరోనా ప్రభావం ఎలా ఉంటదన్న అంశంపై గణిత శాస్త్రం ఆధారంగా పరిశోధన చేశారు. భారతదేశంలో ప్రస్తుతం వేసవి కావడంతో 40–48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత పోతుంది. వీరికి తక్కువ ప్రభావం ఉండే అవకాశముందని బీసీజీ చెప్పింది. లాక్‌డౌన్ వంటి కఠిన నిర్ణయాలు లేకపోతే జూన్ 3 వరకు వ్యాధి తీవ్రత పరాకాష్టకు చేరుకుంటుందని.. ఇప్పుడు అమెరికా, ఇటలీ, స్పెయిన్‌లో ఉన్న పరిస్థితి మన దేశంలో ఉత్పన్నం అవుతుందని చెప్పింది. కష్టమో నష్టమో ఇప్పటికే 21 రోజులు లాక్‌డౌన్ పెట్టుకున్నం. వైరస్ ప్రభావం మొత్తం పోలేదు.

ఏదైన ఓచోట జరిగే కార్యక్రమంలో ప్రజలు గూమికూడడం వల్ల అక్కడి నుంచి 10 మందికో 15 మందికో వైరస్ అంటుకుంటే కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్ లేదా వ్యాధి మూడో దశ అంటరు. మన దగ్గర

### కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్ లేదు..

కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్ అస్సలు జరగలేదు. దేశంలో కూడా లేదు. మన దగ్గర తొలుత విదేశాల నుంచి వచ్చిన వారికి, తర్వాత మర్కజ్ నుంచి వచ్చిన వారికి మాత్రమే వైరస్ సోకింది. వీరు తప్ప వైరస్ ఎవరి నుంచి సోకిందో (సోర్సు) తెలియని కేసు ఒక్కటీ ఇప్పటి వరకు రాలేదు. రేపు చెప్పలేం. భగవంతుడి దయ.

వ్యాప్తి చెందుతూ ఉంది. ఒక్కసారిగా లాక్‌డౌన్ ఎత్తేస్తే 21 రోజుల తపస్సు గంగలో కలిసినట్టే. వైకుంఠపాళిలో పెద్దపాము తరహాలో ఉంటది. ఇంకో వారమో 10 రోజులో 15 రోజులో పొడిగించుకుంటే ఇబ్బంది ఉండదు. నిజాముద్దీన్ ఘటన లేకుంటే తెలంగాణ ఆరామ్‌గా ఉండేది. ఆడ ఒకటి ఈడ ఒకటి కేసులు వచ్చేదేమో గాని ఇంత భయం ఉండేది కాదు. మర్కజ్‌కి వెళ్లినవారితో పాటు వారి కుటుంబ సభ్యులను కలిపి 3 వేల మందిని గుర్తించినం. ఈ సంఖ్య ఇంకో వెయ్యికి పోతదా తెలియదు. మన చేతిలో ఉంది లింక్ కట్ చేయడమే. లాక్‌డౌనే బండ సూత్రం.

### కంట్రోల్ చేసే పరిస్థితిలోనే ఉన్నాం

దేశం మొత్తం నిరవధిక లాక్‌డౌన్ ఫలితంగా మన రాష్ట్రం, దేశం అద్భుత ఘన విజయం సాధించిందనడంలో సందేహం లేదు. మన దేశ జనాభా నిష్పత్తి ప్రకారం చూస్తే కరోనా సోకిన వారి సంఖ్య ఈ నిమిషానికి 4,314 కాగా మరణించిన వారి సంఖ్య 122. దేశవ్యాప్తంగా చూస్తే మనం సురక్షిత విధానాలను పాటిస్తున్నామని అంతర్జాతీయ జర్నల్స్ చెప్తున్నాయి. లేదంటే మనం చాలా భయంకర పరిస్థితిలో ఉండేవాళ్లం. అమెరికా వంటి దేశాల్లో చాలా భయంకర పరిస్థితి. ఆర్థిక రాజధానిగా చెప్పుకునే న్యూయార్క్‌లో శవాల గుట్టలను ఐస్ నింపిన ట్రక్కుల్లో పంపిస్తున్నట్లు అక్కడ కథనాలు వస్తున్నాయి. శవాలను తగలబెడుతున్నారో ఏం చేస్తున్నారో తెలియదు. కొడుకులు, బిడ్డలు ఎవరూ చూసే పరిస్థితి లేదు. మౌలిక వసతులు, బలమైన ఆర్మీఉన్నా అమెరికాది అసహాయ పరిస్థితి. అక్కడ రెండు లక్షల మంది చనిపోతారని ఆ దేశ అధ్యక్షుడు చెప్తున్నాడు. ఆ నిష్పత్తిలో మనకు వస్తే కోట్లాది మంది చనిపోయే వాళ్లు. ఒకరకంగా కంట్రోల్ చేసే పరిస్థితిలోనే మనం ఉన్నాం.

### మొదటి దశలో 25,937 మంది క్వారంటైన్‌కు

మొదటి దశలో రాష్ట్రానికి విదేశాల నుంచి తిరిగివచ్చిన వారి ద్వారా కొంత మందికి వైరస్ ట్రాన్స్‌మిట్ అయింది. ఇప్పటి వరకు 25,937 మందిని క్వారంటైన్ చేశాం. మొదటి దశలో 50 మందికి జబ్బు సోకగా, ఇందులో విదేశాల నుంచి వచ్చిన వారు 30 మంది. వాళ్లు ఇక్కడ వాళ్ల కుటుంబ సభ్యుల్లో మరో 20 మందికి అంటించారు. అదృష్టం కొద్దీ వీరిలో ఒక్కరూ చనిపోలేదు. ఇప్పటివరకు 35 మంది డిశ్చార్జి చేశాం. మరో 15 మందిని ఎల్లుండిలోగా పంపించి వేస్తాం. మొదటిదశలో క్వారంటైన్‌కు తీసుకున్న 25,937 మందిలో ప్రస్తుతం 258 మంది మాత్రమే పర్యవేక్షణలో ఉన్నారు. వీరిని రేపు సాయంత్రానికి పంపించి వేస్తాం. మొత్తంగా ఈ నెల 9 వరకు అందరూ సంతోషంగా ఇంటికి వెళ్తారు.

### 'నిజాముద్దీన్'తో అతలాకుతలం

రాష్ట్రంలో ఇప్పటి వరకు 364 మందికి కరోనా సోకగా, ఇండోనేషియన్లు పది మందిని కలుపుకుని మొత్తం 45 మందిని డిశ్చార్జి చేశాం. 11 మంది ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో మరణించారు. నిజాముద్దీన్ ఘటనతో దేశమంతా అతలాకుతలమైంది. నిజాముద్దీన్ పర్యటనకు సంబంధించి 1,089 మంది రాష్ట్రానికి తిరిగి రాగా, మరో 30 నుంచి 35 మంది ఢిల్లీలోనే ఉన్నారు. అక్కడ నుంచి తిరిగి వచ్చిన వారిలో 172 మందికి వైరస్ సోకగా వీరిలో 11 మంది మరణించారు. ఈ 172 మంది నుంచి మరో 93 మందికి వైరస్ సోకింది. నిజాముద్దీన్‌కు సంబంధించి సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన 3,015 మంది దాకా వివరాలు తీసుకున్నాం. వీరందరికీ పరీక్షలు చేస్తుండగా, ఇప్పటి వరకు సుమారు వేయి మందికి నెగటివ్ వచ్చింది. ఈ రోజు 600 మందికి పరీక్షలు నిర్వహించాం. ఎల్లుండి లోగా పరీక్షలు పూర్తి చేస్తాం. ఇప్పటి వరకు జరిపిన పరీక్షల ప్రకారం చూస్తే వారిలో 10 నుంచి 12 శాతం మందికి వైరస్ సోకే అవకాశం ఉంది. అంటే మరో వంద మందికి వైరస్ సోకే అవకాశం ఉంది. వీరి ద్వారా ఎవరికైనా వైరస్ సోకితే పరిస్థితి చెప్పలేని విధంగా ఉంటుంది. నిజాముద్దీన్ వెళ్లినవారిలో ఎవరైనా మిగిలి ఉంటే రిపోర్టు చేయాలని కోరుతున్నా.

### కరోనా వస్తే కోటీశ్వరులైనా గాంధీలో ఉండాల్సిందే

కోవిడ్ పాజిటివ్ వచ్చినవారు కోటీశ్వరులైనా, లక్షాధికారులైనా గాంధీలో ఉండాల్సిందే. అక్కడ ఐసీయూ, వెంటిలేటర్లు, ఆక్సిజన్, ఐసోలేషన్ వార్డులు అందుబాటులో ఉంటాయి. కోవిడ్ చికిత్స కోసం ప్రత్యేకంగా ఎనిమిది ఆసుపత్రులను నోటిఫై చేస్తున్నాం. వాటి వివరాలను అధికారికంగా వెల్లడిస్తారు.

### బతికుంటే బలుసాకు తినొచ్చు

ఆర్థిక పరిస్థితి దెబ్బతింటుందనే వితండ వాదం కూడా ఉంది. తెలంగాణకు సగటున రోజుకు రూ.400 కోట్ల నుంచి రూ.440 కోట్ల వరకు ఆదాయం రావాలి. కానీ మార్చి మొదటి వారంలో 15 రోజులు ఆదాయం వచ్చింది. మిగతా 15 రోజులు హళ్లికి హళ్లి సున్నకు సున్న. ఇది చాలా బాధాకరమైన పరిస్థితి. దేశం గతి కూడా ఇలానే ఉంది. కానీ మరణాల పరంగా చూస్తే మన వద్ద తక్కువ ఉండటం సంతోషం. బతికుంటే బలుసాకు తిన్నట్లు కలోగంజో తాగి ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టుకుందాం.

### ప్రధాని మీద జోకులు, సెటైర్లా?

సోషల్ మీడియా యాంటీ సోషల్ మీడియాగా మారింది. విపత్తులు ఉన్న సమయంలో ప్రధాని జ్యోతి వెలిగిస్తే ఇదేం వెకిలి సంస్కారం. పీఎం పిలుపు మీద జోకులు, సెటైర్లా. జ్యోతి వెలిగించడం వంటి వాటిని సంఘీభావ సంకేతం అంటాం. కష్ట సమయంలో ఒకటిగా ఉన్నామని జాతి ఐక్యతను చాటేందుకు ఇలాంటి చర్యలు ఉపయోగపడతాయి. తెలంగాణ ఉద్యమంలోనూ ఊరూరా జేగంటలు మోగించాలని పిలుపునిచ్చాం. అప్పుడు కూడా కొందరు వెధవలు విమర్శ చేసినా, తెలంగాణ కోసం ఇలా వంద ప్రక్రియలు చేశాం. సమస్య మీద ఉద్యమిస్తున్నపుడు సంఘీభావం, మనిషికి మనిషి ధైర్యం చెప్పే సందర్భాలు అవసరం. ప్రధాని ఒక వ్యక్తి కాదు వ్యవస్థ. ఆయన పిలుపులో సమాజ, దేశ శ్రేయస్సు ఉంటుంది. ప్రస్తుత సమయంలో తమ ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న వైద్య సిబ్బంది, అధికారులకు నా తరపున పాదాభివందనం. కుటుంబాలను త్యాగం చేసి వారు చేస్తున్న సేవలను ప్రోత్సహించాలి.

### అప్పులు కట్టలేం..

ప్రైవేటు కంపెనీలు ఉద్యోగులకు జీతాలు ఇస్తలేరని చర్చ జరుగుతోంది. దీనిపై సమీక్ష చేయమని పరిశ్రమల శాఖ మంత్రిని కోరుతున్న. లాక్‌డౌన్‌తో నష్టపోయిన పరిశ్రమలకు కేంద్రం కొన్ని రాయితీలు ఇవ్వాల్సి ఉంటుంది. మన రాష్ట్రాన్నే తీసుకుంటే రూ.30వేల కోట్ల రుణాలు చెల్లిస్తుంది ప్రతి ఏటా. మాకు డబ్బే వస్త లేదు, యాడ నుంచి కట్టాలి బాకీ. దాన్ని వాయిదా వేయాలని కోరుతం. అప్పులను టోటల్ రికాస్ట్ చేస్తరు. మారటోరియం సరిపోదు. ఆర్థిక శాఖ మంత్రులు, ముఖ్యమంత్రులందరూ కూర్చొని అప్పులపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కోవడానికి కొన్ని ప్రత్యేక విధానాలు, ఫార్ములాలను కేంద్రం అమలు చేయాల్సి ఉంటుంది. భారతదేశంలో వైరస్ ప్రభావం మరో రెండు మూడు నెలల్లో తగ్గుతుందని, కానీ లాక్‌డౌన్ ప్రభావం ఆర్థికంగా చాలా తీవ్రంగా ఉంటుందని, దీన్ని ఎదుర్కోవడానికి ఇప్పటి నుంచే ఆలోచన చేయాలని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ ఓ పత్రికలో చక్కగా రాశారు. ప్రధాని ఆ మేరకు ముందస్తు చర్యల విషయంలో నిపుణులతో సమాలోచనలు చేయాలి.

### అవన్నీ బోగస్ రాతలు..

అత్యవసర ఔషధాల కొరత లేదు. దీనిపై సీరియస్‌గా రివ్యూ చేయాలని సీఎస్‌కు కోరుతున్న. ఎక్కడన్న కొరత ఉంటే సీఎస్‌ను, ఆరోగ్య మంత్రికి ఫోన్ చేసి చెప్పండి. చైనా లేకుంటే మనం లేం.. బతకలేం అని కొన్ని పత్రికల్లో (సాక్షి కాదు) మకిలిరాతలు రాసిన్రు. 100 శాతం తప్పు. అంతా బక్వాస్ బోగస్.

# సఫాయి అన్నా నీకు సలామ్..

### పారిశుధ్య సిబ్బందికి కోత విధించిన వేతనాలు చెల్లిస్తాం

- సీఎం ప్రోత్సాహకం కింద 95వేల మందికి రూ.7500, రూ.5000 ఇస్తాం
- వైద్య సిబ్బందికి మూలవేతనంలో 10 శాతం ప్రోత్సాహకం
- చిల్లరగాళ్ల ప్రచారాలను పట్టించుకోవద్దు.. పిచ్చి రాతలు రాస్తే శిక్ష తప్పదు
- ఈసారి 40 లక్షల ఎకరాల్లో వరి పంట వస్తోంది
- ఈ కరోనా రాకుంటే డ్యాన్స్ చేసి సంబరపడేవాడిని: కేసీఆర్




**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని పారిశుధ్య సిబ్బందికి కోత విధించిన వేతనాలను తిరిగి చెల్లిస్తామని సీఎం కేసీఆర్ తెలిపారు. వారికి అదనంగా నగదు ప్రోత్సాహకం కూడా అందజేస్తామన్నారు. అలాగే కరోనా నియంత్రణ పోరులో కీలకంగా పనిచేస్తున్న వైద్య సిబ్బందికి వారి మూలవేతనంలో 10 శాతాన్ని సీఎం ప్రోత్సాహకంగా ఇస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ సోమవారం ప్రగతి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆయన ఇంకా ఏమన్నారంటే...

### ఒకట్రెండు రోజుల్లో ఇస్తాం..

'వైద్యులు, పోలీసు సిబ్బందితో పాటు కొంత మంది కరోనా నియంత్రణ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు భుజాన రసాయనాలు తగిలించుకుని స్ప్రే చేస్తూ నగరాలు, పట్టణాలను అద్దంలా పెడుతున్నారు. వీరు రాష్ట్రవ్యాప్తంగా 95,392 మంది ఉన్నారని గుర్తించాం. అందులో 43,661 మంది గ్రామ పంచాయతీ కార్మికులు, 21,531 మంది మున్సిపాలిటీల సిబ్బంది, 2,510 మంది హెచ్ఎండబ్ల్యూఎస్ సిబ్బంది, 27,690 మంది జీహెచ్ఎంసీలో పనిచేస్తున్నారు. వీరికి ఈ నెల వేతనం ఇచ్చే విషయంలో కొంత పొరపాటు జరిగింది. 10శాతం వేతనం కట్ అయింది. ఆ వేతనాన్ని ఒకట్రెండు రోజుల్లో జమ చేస్తం. దీంతోపాటు ముఖ్యమంత్రి ప్రోత్సాహకం కింద జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ సిబ్బందికి రూ.7,500 అదనంగా ఇస్తాం. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో పని చేసే పారిశుధ్య సిబ్బంది రూ.5,000 ఇస్తాం. నేను గతంలో కూడా చెప్పాను. సఫాయి అన్నా నీకు సలామ్ అన్నా అని.. ఇప్పుడు కూడా చెబుతున్నా సఫాయి అన్నా నీకు సలామ్ అన్నా. తల్లిదండ్రుల తర్వాత మీరే గొప్ప వారు. కనిపించే దేవుళ్లు. మా సైనికులు మీరు. మేమిచ్చే డబ్బు తక్కువే. మిమ్మల్ని ప్రభుత్వం గుండెల్లో పెట్టుకుని చూసుకుంటుంది.

### భారతదేశ ధాన్యాగారంగా రాష్ట్రం

బెంగాల్ నుంచి గన్నీ బ్యాగుల దిగుమతి కోసం ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీతో మాట్లాడిన. అక్కడి కేబినెట్ కార్యదర్శి మన సీఎస్‌తో మాట్లాడినరు. మనం సేకరించిన ధాన్యంలో 50–60 శాతాన్ని గన్నీ బ్యాగుల్లోనే ఇవ్వాలని ఎఫ్‌సీఐ నిబంధన ఉంది. వీటిని బెంగాల్‌లో తయారు చేయించి పంపిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. మనకు ఏడు కోట్ల గన్నీ సంచులు కావాలని అడిగిన. సాధ్యం కాకుంటే ఎఫ్‌సీఐ వాళ్లు 100 శాతం ప్లాస్టిక్ బ్యాగులు తీసుకోవాల్సి ఉంటుంది. 40లక్షల ఎకరాల వరి పంట తెలంగాణలో తొలిసారిగా వస్తోంది. ఈ కరోనా లేకుంటే నేను డ్యాన్స్ చేసి సంబరపడేవాడిని. డబ్బులు లేకున్నా ధాన్యం, మక్కల కొనుగోళ్లకు రూ.30వేల కోట్లు సమీకరించినం. 7వేల సెంటర్లు పెట్టినం. తెలంగాణ ఇప్పుడు భారతదేశ ధాన్యాగారం అయిపోయింది. ఇంకా రెండడుగులు ముందుకుపోతే దేవాదుల, సీతారామ, పాలమూరు, కాళేశ్వరం పూర్తి అయితే ఒక కోటీ 30లక్షల ఎకరాల దాకా వరి సాగుకు తెలంగాణ చేరుకుంటది. ఈ గన్నీ బ్యాగుల పంచాయతీ ఎందుకని మన దగ్గరే రెండు మూడు కంపెనీలు పెట్టించండని మంత్రికి చెప్పిన. వారికి రాయితీలు, భూములు ఇచ్చి ఒకటి రెండు జ్యూట్ మిల్స్ పెట్టించమన్న.

## రాజకీయాలకు నాలుగేళ్ల టైం ఉంది

ఈ సమయంలో చిల్లరగాళ్లు చేసే ప్రచారాలను పట్టించుకోకుండా సమాజం జాగ్రత్తగా ముందుకెళ్లాలి. కొన్ని పత్రికలు కూడా పిచ్చి రాతలు రాస్తున్నయ్. వైద్యులకు రక్షణేదీ.. అని రాస్తున్నయ్. పీపీఈ కిట్లు లేవా? 40వేలున్నయ్ మీకు తెలుసా? అవసరమనుకుంటే కేసులు కూడా పెడతం. ఎంతో చిత్తశుద్ధితో, ధైర్యంగా పనిచేస్తున్న వైద్యుల మనోధైర్యం కోల్పోయేలా వెకిలి వార్తలు రాస్తరా? ఈ సమయంలో ప్రభుత్వానికి, సమాజానికి ఉపయోగపడే వార్తలు రాయాలి. వారికి శిక్ష తప్పదు. మీరు రాసేదాంట్లో వాస్తవం లేదు. మీకే ఉందా బాధ్యత.. మాకు లేదా? ఈ సమయంలో కూడా 5లక్షల కిట్లు, లక్షలాది మాస్కులకు ఆర్డర్ ఇచ్చినం. మా హెల్త్ మినిష్టర్ కానీ మేం కానీ పడుకుంటున్నామా? నిద్ర లేని రాత్రులు గడుపుతున్నం. వైద్యం ఒక్కటే కాదు కదా? రాష్ట్రంలో అన్నీ చూసుకోవాలి. ఈ సమయంలో భుజానికి భుజం తోడయి ముందుకెళ్లాలి. ఇప్పటికైనా విజ్ఞప్తి చేస్తున్నా. వక్రబుద్ధి ఉన్నవాళ్లు సక్రమంగా మారాలి. తర్వాత మీ ఇష్టం. అది మీ ఖర్మ. మీకు కరోనా తగలాలని శాపం పెడుతున్నా. రాజకీయాలకు ఇంకా నాలుగేళ్లు టైం ఉంది. హైరానా ఎందుకు? ఇప్పటికైనా క్లీన్‌మైండ్ ఉండాలి. వీరికి సరైన సమయంలో సరైన శిక్ష ఉంటుంది. ఆ శిక్షలు చాలా భయంకరంగా ఉంటాయి. ఎందుకంటే వీళ్లు ప్రజాద్రోహులు, దేశద్రోహులు. మీకు విజ్ఞప్తి చేస్తున్నా ఇప్పటికైనా ఆగాలి. కేసీఆర్ చెబితే ఖతర్నాక్ ఉంటది. మామూలుగా చెప్పడు. ఒళ్లు దగ్గర పెట్టుకుని ఉండాలి. ఇప్పుడు నేను చెపుతున్నవన్నీ కుత్సిత, చిల్లర బుద్ధితో అసత్యాలు ప్రచారం చేస్తున్న వారికి మాత్రమే. దీన్ని మీడియా కూడా సహించవద్దు. దేశ ఐక్యత కోసం పనిచేసే వాళ్లు ఈ సమయంలో గొప్పవాళ్లు కానీ వెకిలి మకిలి ప్రయత్నాలు చేసే వారు కాదు. ఆ త్యాగధనుల కాళ్లు కడిగి నెత్తిన పోసుకోవాలి. మీడియాలో కూడా మంచి వార్తలు రాసే వాళ్లున్నరు. వాళ్లకు దండం పెడతం, రెండు కాళ్లు కడిగి నెత్తిన పోసుకుంటం. పెద్దలు, బుద్ధిజీవులు, కవులు మంచి సాహిత్యం వెలువరించాలి. ప్రస్తుతం మానవ సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే వైతాళికులు కావాలి.



చిల్లర రాజకీయం, చిల్లర ప్రచారం, చిల్లర పేపర్లు కాదు. అల్పులు, గొప్పవాళ్లు ఇలాంటి సందర్భంలోనే బయట పడతారు. బీడీలు చుట్టే ఓ మహిళ, రేషన్ బియ్యాన్ని పంచిన మరో మహిళ.. ఇలాంటి వాళ్లకు పాద పూజ చేసి, రాష్ట్ర అవతరణ సమయంలో అవార్డులు కూడా ఇవ్వాలి. జిల్లాల్లో కష్టపడి పనిచేస్తున్న వారికి ప్రోత్సాహకంగా కొంత నగదు ఇస్తాం. 24 గంటలు కష్టపడే వాళ్లకు కొంత నగదు ఇచ్చేందుకు కలెక్టర్లకు నిధులిస్తాం.

# ముఖ్యమంత్రి సహాయనిధికి భారీ విరాళాలు

## ముందుకొచ్చిన వివిధరంగాలకు చెందిన ప్రముఖులు, వ్యాపార సంస్థలు

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వ్యాప్తి నిరోధానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి సంఘీభావంగా, చేపడుతున్న చర్యలకు ఉపయోగపడేలా పలువురు ప్రముఖులు, సంస్థలు సోమవారం ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు అందించారు.

- తెలంగాణ ఐకేపీ వీఓఏలు 1,72,61,000 రూపాయలను విరాళంగా అందించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో ఐకేపీ వీఓఏల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎల్.రూప్ సింగ్, రాష్ట్ర అధ్యక్షుడు మంచికట్ల కోటేశ్వర్, ప్రధాన కార్యదర్శి మారిపెల్లి మాధవి, కోశాధికారి తిరుపతిలు ఈ విరాళాన్ని సీఎం కేసీఆర్‌కు అందించారు.
- రాష్ట్ర మహిళా సమాఖ్యలకు చెందిన స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ తరుపున స్త్రీనిధి అధ్యక్షురాలు ఎస్.అనిత కోటి రూపాయల చెక్కును సీఎం కేసీఆర్‌కు అందించారు.
- తెలంగాణ పౌల్ట్రీ అసోసియేషన్ కోటి రూపాయల విరాళం అందించింది. దీనికి సంబంధించిన చెక్కును అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, మాజీ అధ్యక్షుడు కసిరెడ్డి నారాయణ రెడ్డి సీఎంకు అందించారు.
- తెలంగాణ బ్రీడర్స్ అసోసియేషన్ కోటి రూపాయల విరాళం అందించింది. దీనికి సంబంధించిన చెక్కును అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ జి.రంజిత్ రెడ్డి ముఖ్యమంత్రికి అందించారు.
- యూనిక్ ట్రీస్ రూ.25 లక్షల విరాళం అందించింది. యూనిక్ ట్రీస్ అధ్యక్షుడు రామ్ దేవ్ చెక్కును సీఎంకు అందించారు
- తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంకు (టెస్కాబ్) కోటి రూపాయల విరాళం అందించింది. దీనికి సంబంధించిన చెక్కును టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవిందర్ రావు, వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి ముఖ్యమంత్రికి అందించారు. ఈ కోటి రూపాయల్లో 88 లక్షల రూపాయలు బ్యాంకు విరాళం కాగా, 8.5 లక్షలు బ్యాంకు ఉద్యోగులు, 3.5 లక్షల రూపాయలు రవిందర్ రావు అందించారు.
- డీసీసీబీలు, సింగిల్ విండోలు కలిపి 76 లక్షల రూపాయలు అందించాయి. డీసీసీబీ చైర్మన్లు ఒక్కొక్కరు రూ. లక్ష చొప్పున, సింగిల్ విండో చైర్మన్లు 5వేల రూపాయల చొప్పున, ఉద్యోగులు ఒక రోజు వేతనం చొప్పున అందించారు.
- రెడ్డీస్ ల్యాబ్స్ 5 కోట్ల రూపాయల విలువైన మందులు, ఎన్ 95 మాస్కులు అందించడానికి ముందుకొచ్చింది. దీనికి సంబంధించిన కాన్సెంట్ లెటర్ ను రెడ్డీస్ ల్యాబ్స్ చైర్మన్ సతీశ్, ఎండీ జీవీ ప్రసాద్ ముఖ్యమంత్రికి అందించారు.
- ఎమ్ఎస్ఎన్ ల్యాబ్స్ 5 కోట్ల రూపాయల మందులు, ఇతర మెడికల్ సామగ్రి అందించడానికి ముందుకొచ్చింది. దీనికి సంబంధించిన కాన్సెంట్ లెటర్‌ను ల్యాబ్స్ చైర్మన్ ఎమ్.సత్యనారాయణ రెడ్డి ముఖ్యమంత్రికి అందించారు.
- ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలోని దాతలు 'గుడ్ సమరిటాన్స్ ఆఫ్ ఖమ్మం'పేరిటి ఏర్పడి రూ. రెండు కోట్ల విరాళాలు సేకరించారు. ఇందులో రూ. కోటి 75 లక్షలు విరాళాలు రాగా, రూ. 25 లక్షలను మమత వైద్య విద్యా సంస్థలు అందించారు. రెండు కోట్ల రూపాయల చెక్కును మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సీఎంకు అందించారు.
- అనూష ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ ఎ.జలంధర్ రెడ్డి రూ.50 లక్షలు, డీఈసీ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఎండీ అనిరుధ్ గుప్తా 50 లక్షల రూపాయల చెక్కును సీఎంకు అందించారు
- కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ ఎండీ కె.అనిల్ కుమార్ 50 లక్షల రూపాయల చెక్కును ముఖ్యమంత్రికి అందించారు.
- ఎస్ఎల్ఎంఐ ఇన్ ఫ్రా ప్రాజెక్ట్స్ ఎండీ బి.వెంకటరెడ్డి రూ.25 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రికి అందించారు.
- శ్రీ వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్స్ ఎండీ ఎం.రవీందర్ రెడ్డి రూ.25 లక్షల చెక్కును సీఎం కేసీఆర్‌కు అందించారు.
- సీల్ వెల్ కార్పొరేషన్ ఎండీ బంగారు సుబ్బారావు రూ. 25 లక్షల చెక్కును ముఖ్యమంత్రికి అందించారు.
- జీవీకే బయో తరపున కంపెనీ వైస్ చైర్మన్ సంజయ్‌రెడ్డి రూ.5 కోట్లు, సాగర్ సిమెంట్స్, వెల్జన్ డెనిజన్స్, రహేజా కార్పొరేట్ సర్వీసెస్ లిమిటెడ్ కోటి రూపాయల చొప్పున చెక్కులను మంత్రి కేటీఆర్‌కు అందజేశారు.
- శ్రీ ఆదిత్య హోమ్స్, తెలంగాణ స్టేట్ ఆయిల్ ఫెడరేషన్ లిమిటెడ్, హైదరాబాద్ అర్చ్ డైకోసిస్ ఎడ్యుకేషన్ సొసైటీ, కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్, తెలంగాణ స్పిన్నింగ్ అండ్ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ రూ.50 లక్షల చొప్పున విరాళాన్ని మంత్రి కేటీఆర్‌కు అందజేశాయి.
- పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, యూనిక్ ఇన్‌ప్లేటబుల్స్ లిమిటెడ్, జీఎస్‌జీ బిల్డర్స్, కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, సప్తగిరి కాంఫర్ ప్రైవేట్ లిమిటెడ్, సరళ ప్రాజెక్ట్ వర్క్స్ లిమిటెడ్, వెలిజన్ హైడ్రాయిర్ లిమిటెడ్, దివ్య శక్తి పేపర్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ట్రెండ్ సెట్ బిల్డర్స్, ఎలగన్స్ డెవలపర్స్ రూ.25 లక్షల చొప్పున విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంత్రి కేటీఆర్‌కు అందజేశాయి.
- ఆదిత్య మ్యూజిక్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.31 లక్షలు సీఎంఆర్ఎఫ్‌కు ప్రకటించగా, గ్రీన్ సిటీ ఎస్టేట్, సూర్య శంకర రెడ్డి గుండేటి, నిజాం క్లబ్ రూ.15 లక్షల చొప్పున విరాళాన్ని కేటీఆర్‌కు అందజేశారు.
- సాకేత్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ వెంకటేష్ గ్రానైట్ ప్రైవేట్ లిమిటెడ్, ధనలక్ష్మీ ఐరన్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, కేఎంవీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్, హారిక, హాసిని క్రియేషన్స్, ఏ.శ్రీనివాస్, జై రాజ్ ఇస్పాత్ లిమిటెడ్, దేవ శ్రీ ఇస్పాత్ లిమిటెడ్, హైదరాబాద్ జింఖానా క్లబ్, నవ తేజ్ ఇన్ ఫ్రా లిమిటెడ్, ఆర్ బీవీ ఆర్ రెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ, వీరమణి బిస్కెట్ ప్రైవేట్ లిమిటెడ్, డాల్ఫిన్ పుడ్స్, సంజీవని చారిటబుల్ ట్రస్ట్ రూ.10 లక్షల చొప్పున విరాళాలకు సంబంధించిన చెక్కులను మంత్రి కేటీఆర్ కి అందించారు.



ఇది హైదరాబాద్ పాత నగరంలోని జహనుమా రోడ్డుపై సోమవారం ఉన్న పరిస్థితి. లాక్‌డౌన్ అమలవుతోన్న తరుణంలో జనం ఇలా బాధ్యతారహితంగా రోడ్డెక్కారు. కరోనా బాధితుల సంఖ్య పాత నగరంలో పెరుగుతోన్న తరుణంలో అక్కడ మరింత జాగ్రత్తగా ఉండాల్సి ఉండగా, లాక్‌డౌన్ ఇలా అపహాస్యం పాలవుతోంది.



లాక్‌డౌన్‌లో భాగంగా ఆటోలు రోడ్డెక్కడంపై నిషేధం ఉంది. కానీ హైదరాబాద్ పాతనగరం పరిధిలో ఇలా దొంగచాటుగా ఆటోవాలాలు అధిక మొత్తం వసూలు చేయాలనే దురాశతో ప్రయాణికులను తరలిస్తున్నారు.

# చప్పట్లు కొట్టారు.. దీపాలు వెలిగించారు..
# లాక్‌డౌన్ మరిచారు

- బలాదూర్‌గా వ్యవహరిస్తున్న 25% మంది..
- పరిస్థితిని ప్రమాదకరంగా మారుస్తున్న తీరు
- మారాలంటే ఇలా చేయాలంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్:

రెండు వారాల క్రితం జనతాకర్ఫ్యూ, రెండు రోజుల క్రితం ఐక్యతకు నిదర్శనంగా దీపాలు వెలిగించాలన్న ప్రధాని పిలుపునకు ప్రజల నుంచి అద్భుత స్పందన వచ్చింది. చప్పట్లు చరచడం, దీపాలు వెలిగించడంలో చొరవ చూపిన జనం లాక్‌డౌన్‌ను అమలు చేసే విషయంలో మాత్రం బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 75 శాతం ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. పాలు, కూరలు లాంటి అత్యవసరాలు కొనేందుకు రోడ్డెక్కి ఆ తర్వాత ఇళ్లకే పరిమితమవుతున్నారు. కానీ మరో 25 శాతం మంది లాక్‌డౌన్‌ను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అవసరం ఉన్నా లేకున్నా అదేపనిగా రోడ్డెక్కుతున్నారు. కనిపించిన పరిచయస్తులతో కబుర్లు చెబుతూ అకారణంగా జనసమూహాలకు కారణమవుతున్నారు. లాక్‌డౌన్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. మర్కజ్ వ్యవహారం వెలుగు చూసిన తర్వాత ఒక్కసారిగా వందల సంఖ్యలో కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతున్న తరుణంలో పరిస్థితి చేయిదాటకుండా లాక్‌డౌన్‌ను అత్యంత పకడ్బందీగా ప్రభుత్వం అమలు చేస్తోంది. ఏప్రిల్ 14తో లాక్‌డౌన్ గడువు పూర్తవుతున్నందున, దాన్ని మరికొన్ని వారాలు కొనసాగించాలని స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధాని మోదీని కోరారు. అభివృద్ధి చెందుతున్న స్థితిలో ఉన్న మన దేశానికి కరోనాను నియంత్రించాలంటే లాక్‌డౌన్ తప్ప మరో గత్యంతరం లేదని సీఎం స్పష్టంగా చెబుతోన్న సమయంలో, బాధ్యత లేని కొంతమంది లాక్‌డౌన్‌ను బేఖాతరు చేస్తూ తీవ్ర ఆందోళన కలిగిస్తున్నారు. ఇలాంటి వ్యక్తుల నిర్లక్ష్యం వల్ల పెను విపత్తుకు అవకాశం కలిగే ప్రమాదం ఉంటుందన్న హెచ్చరికలను వీరే మాత్రం పట్టించుకోవటం లేదు. లాక్‌డౌన్ విధించిన తొలిరోజు జనం ఇలాగే రోడ్లపైకి వచ్చారు. దేశవ్యాప్తంగా ఇలాంటి దృశ్యాలే కనిపించడంతో అప్పట్లో ప్రధాని మోదీ తీవ్రంగా పరిగణించి అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేశారు. వెంటనే మన పోలీసు శాఖ స్పందించి కట్టడి చేసింది. దీంతో కొన్ని రోజుల పాటు పరిస్థితి అదుపులో ఉంది. కానీ మళ్లీ కొన్ని ప్రాంతాల్లో అదుపు తప్పింది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణాల్లో క్రమంగా పరిస్థితి మెరుగవుతోన్న తరుణంలో హైదరాబాద్‌లోని యావత్తు పాతనగరం సహా యూసుఫ్‌గూడ, సనత్‌నగర్, చింతల్ బస్తీ, ముషీరాబాద్, జమిస్తాన్‌పూర్, మెహిదీపట్నం, నార్సింగి... ఇలా పలు ప్రాంతాల్లో జనం విచ్చలవిడిగా లాక్‌డౌన్‌ను ఉల్లంఘిస్తున్నారు. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్ విషయంలో కొన్ని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**నిపుణుల సూచనలు..**

- కూరగాయలు అమ్మేవారిపై ఆంక్షలు లేవు. ఫలితంగా సాధారణ రోజుల కంటే ఎక్కువ మంది విక్రేతలు కాలనీలు, మార్కెట్ల లో కూరగాయలు అమ్ముతున్నారు. కాలనీల్లో కూరలమ్మే వారి మధ్య కనీస దూరం ఉండేలా చూడాలి. ప్రజలు కూడా వందల సంఖ్యలో మార్కెట్లకు చేరుతున్నారు. అలా రాకుండా చర్యలు తీసుకోవాలి. మార్కెట్లకు సాధారణ ప్రజలను అనుమతించొద్దు.
- లాక్‌డౌన్ అమలులోకి రాగానే పోలీసు సిబ్బంది దుకాణాల వద్ద మీటరు దూరం చొప్పున నేలపై వృత్తాకారంలో గీతలు గీయించారు. ఒక్కో కొనుగోలుదారు ఆ వృత్తంలో ఉంటూ ముందుకు సాగి వస్తువులు కొనాలి. కానీ అది ఇప్పుడు అమలవ్వడం లేదు. జనం ఆ వృత్తాల్లోనే ఉండేలా చూసే బాధ్యతను దుకాణదారులకే అప్పగించాలి. ఎక్కడైనా గుంపుగా ఉంటే దుకాణదారులపై చర్యలు తీసుకోవాలి.
- మైకుల ద్వారా పోలీసులు హెచ్చరిస్తూ పహారాగా తిరుగుతుంటే జనంలో మార్పు వస్తుంది. అవసరమైతే గుంపులుగా ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలి. చాలాచోట్ల యువకులు రోడ్లపై అనవసరంగా తిరుగుతున్నారు. అలాంటి వారి వాహనాలను జప్తు చేయాలి. అవసరమైతే లైసెన్సు కూడా రద్దు చేయాలి.
- దుకాణాలు తెరిచి ఉన్నంత సేపు జన సంచారం ఉంటోంది. అందుకే దుకాణాలను సాయంత్రం 6 వరకు కాకుండా మధ్యాహ్నమే మూతపడేలా చూడాలి. మందుల షాపులు మాత్రమే ఉండేలా చూడాలి.
- చాలా చోట్ల కేఫ్‌ల షట్టర్లు మూసి లోపల టీ తయారు చేసి ఫ్లాస్కోల ద్వారా బయట అమ్ముతున్నారు. పాన్‌షాపులదీ ఇదే తీరు. ఇలా అక్రమంగా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటే అవి మూతపడతాయి.

## సాధారణ స్థాయికి ఎల్పీజీ డిమాండ్

### కొరత లేకపోవడంతో తగ్గిన బుకింగ్‌లు



**సాక్షి, హైదరాబాద్:** దేశీయంగా, రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ నిల్వలకు ఎలాంటి కొరత లేదంటూ ఇండియన్ ఆయిల్ కంపెనీల ప్రకటనల నేపథ్యంలో డిమాండ్ సాధారణ స్థాయికి చేరింది. గత కొన్ని రోజులుగా వంట గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌లు విపరీతంగా పెరగ్గా, ప్రస్తుతం అవి తగ్గుముఖం పట్టాయి. ఎక్కడా కొరత లేకపోవడం, ఆయిల్ కంపెనీలు సైతం బుకింగ్ చేసిన రెండు, మూడు రోజుల్లోనే సరఫరా చేస్తుండటంతో అటు వినియోగదారులు, ఇటు కంపెనీలు ఊపిరి పీల్చుకుంటున్నాయి. రాష్ట్రంలో గత ఫిబ్రవరి నెలతో పోలిస్తే మార్చి 21 నుంచి గ్యాస్ బుకింగ్‌లు విపరీతంగా పెరిగిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిరోజూ బుకింగ్‌లు 1.75లక్షల నుంచి 1.85లక్షల వరకు ఉంటుండగా, మార్చి నెలాఖరులో అవి ఏకంగా రోజుకు 3లక్షల వరకు పెరిగాయి. వినియోగదారులు అవసరం లేకున్నా అదనపు బుకింగ్‌లు చేస్తుండటంతో అప్రమత్తమైన ఆయిల్ కంపెనీలు ఒక్కో సిలిండర్ బుకింగ్‌కు మధ్య గడువును 14 రోజులకు పెంచాయి. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్‌తో పాటే ఎల్పీజీ నిల్వలు సరిపడేంతగా ఉన్నాయని ఆయిల్ కంపెనీలు ప్రకటించాయి. ఎల్పీజీ సిలిండర్ పూర్తిగా అందుబాటులో ఉండటంతో సోమవారం బుకింగ్‌లు కేవలం 1.08లక్షలు మాత్రమే ఉన్నాయని ఆయిల్ కంపెనీలు తెలిపాయి.

## ఐటీ రంగానికి కరోనా కాటు

మొదటి పేజీ తరువాయి

అనుమతించిన విషయం విదితమే. అయితే, ప్రస్తుత తరుణంలో ఐటీ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, జరిగిన నష్టంపై నాస్కామ్ (నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్ వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్) ఆధ్వర్యంలో అధ్యయనం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ 'సాక్షి'కి తెలిపారు. త్వరలో ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఐటీ రంగానికి కొంగు బంగారంగా నిలిచిన హైదరాబాద్‌లో ఈ రంగం నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఐటీ, హార్డ్‌వేర్ పాలసీ రాకతో ఈ రంగం గణనీయంగా పురోగమిస్తుందని తెలిపారు. కొన్నిరోజుల పాటు అనిశ్చితి నెలకొన్నప్పటికీ త్వరలో పరిస్థితులు చక్కబడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, గడిచిన ఆర్థిక సంవత్సరంలో 2019–2020 మార్చిలో సుమారు రూ.1.07 లక్షల కోట్లు ఐటీ ఎగుమతులు జరిగినట్లు అంచనా వేస్తున్నట్లు చెప్పారు.

**ఐటీ రంగ సమస్యలివే..**

గ్రేటర్ పరిధిలో సుమారు 900 ఐటీ కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వీటిలో సుమారు 6 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. ఈ కంపెనీల్లో సుమారు వంద వరకు మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి బహుళజాతి కంపెనీలున్నాయి. ప్రస్తుతం కరోనా కలకలం, లాక్‌డౌన్ నేపథ్యంలో తాము చేపట్టిన ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయలేకపోతున్నట్లు మెజారిటీ ఐటీ కంపెనీలు చెబుతున్నాయి. దీంతో తమకు మోస్తరుగా నష్టాలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. త్వరలో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని భావిస్తున్నట్లు తెలిపాయి. నష్టాలను ఇప్పుడే అంచనా వేయలేమని, ఇందుకు రెండు వారాల సమయం పడుతుందని పేర్కొంటున్నాయి.

**ఔట్‌సోర్సింగ్ ప్రాజెక్టులు పెరుగుతాయి**

'అమెరికాలో లక్షల మంది మంది ఐటీ ఉద్యోగులను తొలగించే ప్రక్రియ మొదలుకావడం, హెచ్1బీ వీసాల రద్దుపై అమెరికా ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకోనున్న నేపథ్యంలో.. పలు అమెరికా బహుళ జాతి కంపెనీలు మన నగరంలోని ఐటీ కంపెనీలతో పాటు పలు దేశీయ కంపెనీలకు ఔట్ సోర్సింగ్ విధానంలో భారీగా ఐటీ ప్రాజెక్టుల కాంట్రాక్టులు అప్పజెప్పే అవకాశాలున్నాయి. ఇప్పటికే అమెరికాలో చిన్న కంపెనీలు ఉద్యోగుల తొలగింపు ప్రక్రియను భారీగా చేపట్టాయి. ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్ తదితర కంపెనీలదీ ఇదే ప్రక్రియకు శ్రీకారం చుడతాయని ఆశిస్తున్నాం. ఇలా జరిగితే ఇక్కడ ఉపాధి కల్పన మరింత పెరగనుంది. లాక్‌డౌన్ నేపథ్యంలో ఈ రంగం స్వల్ప ఒడిదొడుకులు ఎదుర్కొన్నా ఐటీ రంగం నిలకడ గల వృద్ధిని తప్పక సాధిస్తుంది. ఈ విషయంలో త్వరలో స్పష్టత రానుంది'

– మురళి, హైసియా అధ్యక్షుడు

## కరోనాపై పరిశోధన చేస్తున్నారా?

- వర్సిటీ రిజిస్ట్రార్లతో గవర్నర్ తమిళిసై వీడియో కాన్ఫరెన్స్
- ఉన్నతవిద్య సిలబస్ ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలని సూచన



**సాక్షి, హైదరాబాద్:** యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థల్లో పూర్తి కాని సిలబస్‌ను ఆన్‌లైన్‌లో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని యూనివర్సిటీల రిజిస్ట్రార్లను గవర్నర్, యూనివర్సిటీల చాన్స్‌లర్ తమిళిసై సౌందరరాజన్ ఆదేశించారు. ఇందుకోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ పోర్టల్స్, స్వయం మూక్స్ వంటి దూరవిద్య పోర్టల్స్, యూనివర్సిటీల పోర్టల్స్ సహకారంతో సిలబస్ పూర్తి చేయాలని సూచించారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి, యూనివర్సిటీల రిజిస్ట్రార్లతో తమిళిసై సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థల్లో సిలబస్ ఎంతవరకు వచ్చిందనే దానిపై సమీక్షించారు. తమ సొంత ఆన్‌లైన్ సర్వీసులతోపాటు ఏఐసీటీఈ, యూజీసీ పోర్టల్స్ ద్వారా సిలబస్‌ను పూర్తి చేస్తామని రిజిస్ట్రార్లు ఆమెకు తెలిపారు. మరోవైపు వర్సిటీల్లో కోవిడ్ సంబంధిత పరిశోధనలు, అధ్యయనాలేమైనా జరుగుతున్నాయా అని గవర్నర్ ఆరా తీశారు. తాము దీనిపై విశ్లేషిస్తున్నామని, శాంపిల్స్ సేకరించి పరిశీలిస్తున్నామని కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అధికారులు చెప్పినట్టు తెలిసింది. కరోనా కట్టడి చర్యలు, సహాయక కార్యక్రమాల్లో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలను ఉపయోగించుకోవాలని గవర్నర్ సూచించారు.

## పీఎం కేర్స్ ఫండ్‌కు గవర్నర్ విరాళాలు

**సాక్షి, హైదరాబాద్:** కరోనా నివారణకు విరాళాల సేకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'పీఎం కేర్స్ ఫండ్'కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సోమవారం రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. సాధారణ స్థితి నెలకొనే వరకు తన వేతనం నుంచి ప్రతి నెలా 30 శాతాన్ని పీఎం కేర్స్ ఫండ్‌కు విరాళంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ ఫండ్ ఏర్పాటు చేసినందుకు ఆమె ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం మహావీర్ జయంతి సందర్భంగా రాజ్‌భవన్‌లో ఆయన విగ్రహానికి గవర్నర్ ఘన నివాళులర్పించారు.

## పూర్తి వేతనం ఇవ్వండి

### సీఎస్‌కు పంచాయతీ కార్యదర్శుల సంఘం వినతిపత్రం

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ నియంత్రణలో రాత్రి, పగలు పనిచేస్తున్న పంచాయతీరాజ్ ఉద్యోగులకు పూర్తి వేతనం ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి కోరారు. పోలీసు, వైద్య, ఆరోగ్య శాఖకు మొత్తం వేతనం ఇస్తూ పంచాయతీరాజ్‌ను పక్కన పెట్టడం దురదృష్టకరమన్నారు.

## ఆపన్నహస్తం అందించాలి: సీపీఐ

**సాక్షి, హైదరాబాద్:** ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలందరికీ బియ్యం, డబ్బులు అందించి ఆపన్నహస్తాన్ని అందించాలని సీపీఐ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్రంలో కోవిడ్ కేసులు పెరుగుతుండడం ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని ఒక ప్రకటనలో తెలిపింది. వలసల కూలీలను ఆదుకుని, వారిని సొంత ప్రాంతాలకు పంపడంతో పాటు తెల్లరేషన్ కార్డులు లేనివారిని ఆదుకోవాలని సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి విజ్ఞప్తిచేశారు.

# కరోనా హీట్ ముందు దిగదుడుపే..!

- వేసవి వచ్చినా.. ఏసీ, కూలర్ వినియోగం అంతంతే
- గృహ, వాణిజ్య కేటగిరీల్లో భారీగా తగ్గిన విద్యుత్ డిమాండ్



**సాక్షి, హైదరాబాద్:** కరోనా భయం ఇంటింటిని తాకింది. బయటకు వెళ్తే వైరస్ వస్తుందన్న భయానికి తోడు ఇంటి పట్టునే ఉంటున్నా.. ఇంట్లో సైతం వైరస్ బారిన పడకుండా నగరవాసులు అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఓ వైపు ఎండలు ముదిరి ఉక్కపోతలు మొదలైనా.. ఏసీలు, కూలర్ల వాడకానికి మెజారిటీ ప్రజలు దూరంగానే ఉంటున్నారు. రిఫ్రిజిరేటర్లలోనూ సాధారణ ఉష్ణోగ్రతలే మెయింటైన్ చేస్తున్నారు. దీంతో నగరంలో గృహ, వాణిజ్య కేటగిరీల్లో విద్యుత్ వినియోగం అమాంతం పడిపోయింది. గడిచిన ఏడాది (2019) ఏప్రిల్ 5న హైదరాబాద్‌లో 2,763 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరిగితే, 2020 ఏప్రిల్ 5 వచ్చే సరికి 1826 మెగావాట్లకు పడిపోయింది. ఇలా తగ్గిన డిమాండ్‌లో అత్యధికంగా గృహ, వాణిజ్య (కేటగిరీ)దే కావటం విశేషం.

**డిస్కం అంచనాలు తారుమారు**

సాధారణంగా మార్చి మూడో వారం నుంచి హైదరాబాద్‌లో రోజుకు 2,550 మెగావాట్ల నుంచి 2,800 మెగావాట్ల వరకు విద్యుత్ వినియోగం జరగాల్సి ఉంది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) కూడా అదే అంచనాలతో ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటుంది. కానీ, గతానికి భిన్నంగా ఈసారి ప్రస్తుతం రోజువారీ సగటు విద్యుత్ వినియోగం భారీగా పడిపోవటంతో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఇది నెలవారీ రెవెన్యూపై తీవ్ర ప్రభావం చూపనుండటంతో భవిష్యత్తులో భారీ నష్టాలు చవి చూడాల్సి వస్తుందని చెబుతున్నారు.

**లాక్‌డౌన్‌కు ముందు 2,500 మెగావాట్లు..**

గ్రేటర్ హైదరాబాద్‌లో 55 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 45 వేలకు పైగా చిన్న, పెద్ద, భారీ పారిశ్రామిక సంస్థలు ఉన్నాయి. మరో 7 లక్షల వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. 48 లక్షలకు పైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. లాక్‌డౌన్‌కు ముందు మార్చి మొదటి వారంలో నగరంలో రోజు సగటు వినియోగం 2,500 నుంచి 2,800 మెగావాట్లుగా ఉంది. గతేడాది అయితే ఏకంగా 3 వేల మెగావాట్ల వరకు వెళ్లింది. ప్రస్తుతం చిన్న, మధ్య తరహా, భారీ పరిశ్రమల్లో చాలా వరకు మూతపడ్డాయి. ఐటీ, దాని అనుబంధ సంస్థలు సహా భారీ షాపింగ్ మాళ్లు, హోటళ్లు, ఇతర వాణిజ్య సంస్థలూ పని చేయట్లేదు. ఫలితంగా రోజువారీ సగటు వినియోగం 2,500 నుంచి 1,800 మెగావాట్లకు పడిపోయింది.

**ఏప్రిల్5న హైదరాబాద్‌లో విద్యుత్ డిమాండ్ ఇలా..**

| కేటగిరీ | 2019 | 2020 |
|---|---|---|
| గృహ వినియోగం | 1,050 (మెగావాట్లు) | 600 (మెగావాట్లు) |
| కమర్షియల్ (కేటగిరీ2) | 400 | 175 |
| కమర్షియల్ (హెచ్‌టీ) | 1,100 | 750 |
| స్ట్రీట్ లైటింగ్, వాటర్ లైన్స్ | 213 | 301 |
| మొత్తం | 2,763 | 1,826 |

**సమ్మర్ మార్కెట్ ఢమాల్..**

వేసవి వచ్చిందంటే చాలు హైదరాబాద్‌లోని ప్రముఖ ఎలక్ట్రానిక్ దుకాణాలన్నీ ఏసీ, కూలర్ల కొనుగోలుదారులతో నిండిపోయేవి. అబిడ్స్‌లోని ఎలక్ట్రానిక్ దుకాణాలన్నీ కూలర్లతో సందడిగా కన్పించేవి. కానీ, ప్రస్తుతం లాక్‌డౌన్‌తో ఆయా షాపులు మూతపడ్డాయి. ఇంట్లో ఏసీ ఆన్ చేస్తే.. చలి గాలికి వైరస్ ఎక్కడ విస్తరిస్తుందో అని గ్రేటర్‌వాసులు భయపడుతున్నారు. ఏసీలను కొనుగోలు చేయాలనే ఆలోచన కూడా చేయట్లేదు. దీంతో ఆయా ఎలక్ట్రానిక్ కంపెనీలు సహా డీలర్లు కూడా భారీ నష్టాలను చవిచూడాల్సి వస్తోంది.

## కొత్తగా 30 కరోనా కేసులు

మొదటి పేజీ తరువాయి

తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఏ జిల్లాలో పాజిటివ్ కేసులు వచ్చినా గాంధీ ఆసుపత్రిలోనే చికిత్స చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారని బులెటిన్ తెలిపింది.

**రాష్ట్రవ్యాప్తంగా నమోదైన కేసులు, డిశ్చార్జి, మృతులు**

| | సోమవారం | మొత్తం |
|---|---|---|
| చికిత్స పొందుతున్నవారు | 30 | 308 |
| డిశ్చార్జి అయినవారు | 12 | 45 |
| చనిపోయినవారు | 0 | 11 |
| రాష్ట్రంలో మొత్తం కేసులు | | 364 |

## అఖిలపక్ష భేటీ నిర్వహించండి

### ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సీపీఎం లేఖ

**సాక్షి,హైదరాబాద్:** రాష్ట్రంలో కరోనా మహమ్మారి విస్తృతి చెందడం ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో సహాయచర్యలు, ఇతరత్రా అంశాలపై చర్చకు వెంటనే అఖిలపక్ష భేటీని ఏర్పాటుచేయాలని సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖలో సీపీఎం విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, ప్రజలకు కల్పిస్తున్న సహాయ కార్యక్రమాల్లో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పౌరవేదికలు, మేధావులను భాగస్వాములను చేయాలని లేఖలో సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు, కొన్ని రాష్ట్రాలు అఖిలపక్షాలను ఏర్పాటుచేయగా, బుధవారం కేంద్రం ఆల్‌పార్టీ భేటీని నిర్వహిస్తున్నందున రాష్ట్రంలో కూడా భేటీని నిర్వహించి అందరి అభిప్రాయాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు.

**జిల్లాల వారీగా నమోదైన కేసులు, డిశ్చార్జి అయినవారు**

| జిల్లా పేరు | పాజిటివ్ కేసులు | డిశ్చార్జి |
|---|---|---|
| ఆదిలాబాద్ | 10 | – |
| భద్రాద్రి కొత్తగూడెం | 02 | 02 |
| హైదరాబాద్ | 133 | 21 |
| జగిత్యాల | 03 | – |
| జనగాం | 02 | – |
| భూపాలపల్లి | 01 | – |
| గద్వాల | 13 | – |
| కామారెడ్డి | 08 | – |
| కరీంనగర్ | 07 | 11 |
| మహబూబాబాద్ | 01 | – |
| మహబూబ్‌నగర్ | 06 | 01 |
| మెదక్ | 05 | – |
| మేడ్చల్ | 15 | 02 |
| ములుగు | 02 | – |
| నాగర్‌కర్నూలు | 02 | – |
| నల్లగొండ | 13 | – |
| నిర్మల్ | 04 | – |
| నిజామాబాద్ | 26 | – |
| పెద్దపల్లి | 02 | – |
| రంగారెడ్డి | 10 | 07 |
| సంగారెడ్డి | 07 | – |
| సిద్దిపేట | 01 | – |
| సూర్యాపేట | 08 | – |
| వికారాబాద్ | 04 | – |
| వరంగల్ అర్బన్ | 23 | 01 |
| మొత్తం | 308 | 45 |

సాక్షి
మంగళవారం, ఏప్రిల్, 7

# సముచిత నిర్ణయమేగానీ...

అసాధారణ పరిస్థితులు ఏర్పడినప్పుడు అసాధారణ నిర్ణయాలు తీసుకోక తప్పదు. కరోనా వైరస్ మహమ్మారి విరుచుకుపడిన వర్తమానంలో ఎంపీల జీతభత్యాల్లో 30 శాతం కోత విధిస్తూ రూపొందించిన ఆర్డినెన్స్‌ను కేంద్ర మంత్రివర్గం సోమవారం ఆమోదించడం కూడా ఇటువంటిదే. దీంతోపాటు రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రాష్ట్రాల గవర్నర్లు కూడా ఇదే తరహాలో తమ జీతాలు తగ్గించుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. మాజీ ఎంపీలకిచ్చే పింఛన్‌లకు కూడా ఈ కోత వర్తిస్తుంది. ఇదంతా ఏడాదిపాటు అమల్లోవుంటుంది. ప్రధాని, కేంద్రమంత్రులు, సహాయమంత్రులు అందరూ దీని పరిధిలోకొస్తారు. ఇప్పటికే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రజాప్రతినిధులకూ, ప్రభుత్వ సిబ్బందికి ఇచ్చే జీతభత్యాల్లో కొంత శాతం కోత విధించాయి. ఈ మొత్తాన్ని అనంతరకాలంలో చెల్లిస్తామని ప్రకటించాయి. ఇప్పుడు కరోనా వైరస్ సృష్టిస్తున్న విలయాన్ని గమనిస్తే, సర్వశక్తులూ కేంద్రీకరించి పనిచేస్తే తప్ప దీన్ని దుంపనాశనం చేయడం అసాధ్యం. కనుక ఆ దిశగా రాగలకాలంలో మరిన్ని చర్యలు తప్పకపోవచ్చు.

వ్యాధిగ్రస్తులను గుర్తించడం, వారి కోసం ఆసుపత్రులను, సిబ్బందిని సిద్ధంగా వుంచడం, చికిత్స చేయడం, అందుకు అవసరమైన ఔషధాలు, చికిత్సకు అవసరమైన ఉపకరణాలు సమీకరించడం భారీ యజ్ఞంవంటిది. పన్నుల రూపంలో, సుంకాల రూపంలో వివిధ పద్దులకింద ప్రభుత్వాలకు సమకూరే ఆదాయం కూడా వీటన్నిటికీ ఎక్కడా సరిపోదు. ఇందువల్లే స్తోమత వున్నవారు విరివిగా విరాళాలివ్వాలని పిలుపునిస్తున్నాయి. ఇప్పుడు ప్రజాప్రతినిధుల జీతభత్యాల్లో కోత దీనంతటికీ కొనసాగింపే. దేశం ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్నదో మీడియాలో నిత్యం వచ్చే వార్తా కథనాలు వెల్లడిస్తూనే వున్నాయి. లాక్‌డౌన్ కారణంగా అన్ని రంగాలూ మూతబడి ఉత్పాదక కార్యకలాపాలన్నీ నిలిచిపోయాయి. ఆర్థిక, వాణిజ్య లావాదేవీలు కూడా ఆగిపోక తప్పలేదు. సామాన్యులంతా ఈ పర్యవసానాలు అనుభవిస్తున్నారు. పూట గడవడం ఎలాగో తెలియక మహానగరాలను నమ్ముకుని ఇన్నాళ్లూ బతుకు బండి ఈడుస్తున్న నిరుపేద వర్గాల ప్రజలు గత్యంతరం లేని స్థితిలో స్వస్థలాలకు తిరుగుముఖం పట్టడం మీడియాలో అందరూ చూశారు. ఇప్పుడొచ్చిన ఈ విపత్తు ఇంతక్రితం మానవాళి ఎదుర్కొన్న ఉత్పాతాలన్నిటినీ తలదన్నేంత తీవ్ర స్థాయిలో వుంది. ఈ వైరస్ సృష్టిస్తున్న జీవన విధ్వంసం సాధారణమైనది కాదు. అందరూ తమకు చేతనైనంతగా సాయం చేస్తేనే, తమకు తారసపడిన నిస్సహాయులకు ఏదో రూపంలో చేయూతనందిస్తేనే ఈ విషాద దశను దాటడం సాధ్యమవుతుంది. వ్యక్తులుగా కొందరు, అనేక స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి కృషిలో పాలుపంచుకుంటున్నాయి కూడా. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సీఎం సహాయనిధులకు విరాళాలు భారీగా అందుతున్నాయి. కేంద్రం కొత్తగా ఏర్పాటు చేసిన పీఎం కేర్స్‌కు ఇంతవరకూ దాదాపు రూ. 6,500 కోట్ల మేర విరాళాలు వచ్చాయంటున్నారు.

ప్రజాప్రతినిధుల జీతభత్యాల్లో కోత విధించడంతోపాటు ఎంపీల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం(ఎంపీలాడ్స్) నిధులను రెండేళ్లపాటు నిలిపివేయాలన్నది కేంద్ర ప్రభుత్వం తీసుకున్న మరో నిర్ణయం. ఈ కారణంగా ప్రభుత్వానికి రూ. 7,900 కోట్లు సమకూరుతాయి. ఎంపీల జీతభత్యాలకు విధించే కోతలవల్ల వచ్చే నిధులతోపాటు ఈ నిధులు కూడా ప్రభుత్వ సంచితనిధికి తరలుతాయి. 1993లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు సర్కారు ఎంపీలాడ్స్ పథకాన్ని అమల్లోకి తెచ్చి ప్రతి ఎంపీ ఏడాదికి అయిదు లక్షల రూపాయల పనులు మంజూరు చేసేందుకు అవకాశమిచ్చింది. ఆ మొత్తాన్ని మరుసటి సంవత్సరం కోటి రూపాయలకు పెంచింది. అది క్రమేపీ పెరుగుతూ వచ్చి ఇప్పుడు పది కోట్ల రూపాయలకు చేరుకుంది. ఈ నిధుల్ని సమర్థవంతంగా వినియోగించి తమ తమ పరిధుల్లో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ఆ పథకాన్ని మెరుగ్గా వినియోగించనివారూ, అసలు దాని జోలికే పోనివారు కూడా వుంటున్నారు. కరోనా వైరస్‌పై పోరుకు అవసరమైన నిధులు సమీకరించడం కోసం ఈ ఎంపీలాడ్స్‌ను కూడా రెండేళ్లపాటు ఆపేయాలనుకోవడం కంటే, ఆ నిధుల్ని మరో పద్ధతిలో వినియోగించడానికి వీలు కల్పిస్తే బాగుండేది. వాటిని సంచితనిధికి తరలించడం కాక ఆ ఎంపీలు ప్రాతినిధ్యం వహించే రాష్ట్రాలకు కేటాయిస్తే కరోనా వైరస్‌తో పోరాడుతున్న ప్రభుత్వాలకు చేయూతనిచ్చినట్టు అయ్యేది. పన్నులు, సుంకాల ద్వారా వచ్చే ఆదాయంలో రాష్ట్రాల వాటా గతంతో పోలిస్తే తగ్గింది. పైగా కేంద్రంనుంచి రావాల్సిన బకాయిలు కొన్ని పెండింగ్ వున్నాయని రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నాయి. ఇలాంటి అననుకూల పరిస్థితుల్లో పలు రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు ఒంటిచేత్తో ఈ మహమ్మారిపై పోరాడుతున్నాయి. అటు మహమ్మారిని ఎదుర్కొనడానికి, ఇటు నిరుపేద వర్గాలకు చేయూతనీయడానికి అవసరమైన నిధులు అందుబాటులో వుంటేనే రాష్ట్రాలు ఈ సంక్షోభం నుంచి గట్టెక్కుతాయి. సంచిత నిధికి వెళ్లే వివిధ రకాల మొత్తాలన్నీ ఎటూ రాష్ట్రాల్లో వ్యయం చేస్తారు. దాన్నెవరూ కాదనరు. కానీ చాలాచోట్ల రాష్ట్ర ప్రభుత్వాలకు ఇప్పటికిప్పుడు నిధుల అవసరం ఎంతోవుంది. ఆ అవసరాన్ని తీర్చడానికి ఎంపీలాడ్స్ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయి. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించి దాదాపు రెండు వారాలు కావస్తోంది. పౌరుల కదలికలపై తప్ప సరుకు రవాణాకు ఎలాంటి అడ్డంకులూ వుండబోవని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా రాష్ట్రాల మధ్యా, కొన్ని రాష్ట్రాల్లో వివిధ జిల్లాల మధ్యా ఇంకా సరుకు రవాణాకు, ముఖ్యంగా ఔషధాలకు ఆటంకాలు ఎదురవుతూనే వున్నాయి. పర్యవసానంగా కొన్ని సరుకులు మార్కెట్ల నుంచి మాయమైతే, మరికొన్నిటి ధరలు చుక్కలంటుతున్నాయి. ఇప్పుడెదురవుతున్న ఇబ్బందులతోపాటు, ముందుందు ఎదురుకాబోయే సమస్యలేమిటో అంచనా వేసుకుని, రాష్ట్రాల సహకారంతో వీటన్నిటినీ చక్కదిద్దాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి వుంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ శార్వరి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు చైత్ర మాసం, తిథి శు.చతుర్దశి ఉ.11.20 వరకు, తదుపరి పౌర్ణమి నక్షత్రం ఉత్తర ఉ.8.30 వరకు, తదుపరి హస్త, వర్జ్యం సా.4.20 నుంచి 5.48 వరకు, దుర్ముహూర్తం ఉ.8.20 నుంచి 9.11 వరకు తదుపరి రా.10.50 నుంచి 11.38 వరకు, అమృతఘడియలు... రా.1.14 నుంచి 2.55 వరకు.

**సూర్యోదయం :** 5.54
**సూర్యాస్తమయం :** 6.10
**రాహుకాలం :** ప. 3.00 నుంచి 4.30 వరకు
**యమగండం :** ఉ.9.00 నుంచి 10.30 వరకు

# ఆశకు దీపం, ఆరోగ్యానికి సైన్స్



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

'ఢిల్లీ ఆధ్యాత్మిక సమావేశంలో జరిగిన దానికి మతాన్ని ఆపాదించవద్దు. ఇది ఐక్యంగా నిలబడాల్సిన సమయం. కరోనా వ్యాధి మనం దరికీ ప్రత్యర్థి మహమ్మారి. ఆ సమావేశంలో పాల్గొన్నవారిలో విదేశాలనుంచి వచ్చిన ఆధ్యాత్మిక ప్రతినిధులతో మన దేశంలోని పలు ప్రాంతాలనుంచి వెళ్లినవారూ ఉన్నారు. ఈ విషయంలో మనవాళ్లనే మనం వేరుగా చూడనక్కర్లేదు. ఇందుకు పలానా మతం వారిమీద మన వారిమీద ముద్రవేయడానికి ఎవరూ ఒక మతాన్ని వాడుకోవద్దు. ఇది ఎవరికైనా సంభవించే సంఘటన. మన దేశంలోనే అనేకమంది ఆధ్యాత్మిక వేత్తలున్నారు. విదేశాల్లోనూ వేలు, లక్షల సంఖ్యలో భక్తులున్న అనేకమంది పెద్దలు అన్ని మతాల్లోనూ ఉన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఉద్యమ కర్త రవిశంకర్, జగ్గీవాసుదేవ్ ఈషా ఫౌండేషన్, జాన్ వెస్లీ దినకరన్ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో గానీ, మాతా అమృతానందమయ సభల్లో గానీ ఎవరైనా పాల్గొనవచ్చు, ఎవరికైనా ఈ పరిస్థితి రావొచ్చు. ఎక్కడైనా జరగవచ్చు. కరోనా కాటుకు మందులేదు, మతాల్లేవు, కరోనా కాటుకు ధనిక, పేద అనే తేడా కూడా లేదు. ఈ యుద్ధంలో మన ఏకైక ప్రత్యర్థి కంటికి కనిపించని కరోనా వైరస్'

*– ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి (4-4-2020)*

మానవజాతి ప్రగతిపథంవైపు సాగించిన ప్రతీ అడుగూ రక్తతర్పణతోనే సాగింది. నర రక్తం ఇంతగా ప్రవహించడానికి అన్ని మతాల ధర్మాచార్యులే కారణం, వారే బాధ్యులు, ఏ ఒక్క మతమూ, మతాచార్యులు గర్వించవలసింది ఏమీ లేదు

*– మహాపండిత రాహుల్ సాంకృత్యాయన్*

మానవుడు ప్రస్తుత ఆశాజీవి. ఆ ఆశతోనే అతని బతుకు, వ్యాపకాలు ఆధారపడి ఉంటాయి. అలాగే రోగాలూ, రొష్టులూ, నలతలు, కలతలూ ఉంటాయి. జీవితం కోసం జరిగే ఆరాటాలు, పోరాటాలు, దుష్టశక్తులను పరిమార్చడానికి కొట్లాటలు, కుమ్ములాటలు, ఇంటా బయటా సామ్రాజ్యవాద శక్తులనుంచి, దోపిడీ వర్గాల నుంచి ఎదురయ్యే కష్టనష్టాలను యుద్ధాలను ఎదిరించి ప్రాణాలొడ్డి జీవశక్తిగా ప్రజలు మనుగడ సాగిస్తూ వచ్చారు. సామాజిక, రాజకీయ రంగాలలో నవచైతన్యం కోసం ప్రజలకు సంక్షేమ రాజ్యం, సమసమాజ వ్యవస్థ స్థాపన కోసం జరిగే విప్లవాలూ మానవుడి చైతన్యం ఫలితమే. అలాంటి మానవుడు పూర్వయుగాలలోనూ, అపూర్వ శకాలలోనూ అంటువ్యాధికారకాలైన వైరస్ క్రిముల్ని, మహమ్మారిగా పరివ్యాప్తమవుతూ వస్తున్న విషక్రిముల్ని ఎదుర్కొంటూ నష్టాలమధ్యనే గర్వించదగిన విజయాలు సాధిస్తూ వస్తున్నాడు మానవుడు. అణువునుంచి పరమాణువు నుంచి ప్రాణస్పందన పొందిన మానవుడు విశ్వాంతరాళాలకు, నక్షత్ర మండలాలకు ఎగబాకడమే కాదు, పసిగుడ్డుగా తల్లి ఒడిలో జాబిల్లి రావే, గోగుపూలు తేవే, అంటూ గోరుముద్దలు తిన్న దశనుదాటి.. మానవ చరిత్రలో తొలిసారిగా చంద్రమండలాధినేత కాగల్గిన దశకు ఎదిగి నిరంతరం ప్రకృతిని జయించే పరిశోధనలో మానవుడున్నాడు. ఈ పరిణామం అంతా మానవుడు ఆశాజీవి, తన ఉనికి సార్థకతను నిరంతరం నిరూపించుకుని విజయాలు సాధిస్తున్నాడు. అలాంటి ఆశాజీవిలో వ్యాధి నిరోధక శక్తిని, మంచి చెడుల నిర్ణయానికి, చెడును ఎదుర్కొని మంచిని పెంచే వైజ్ఞానిక దృష్టిని కలిగించేవి అంధయుగాలలో మానవుణ్ణి నడిపించిన గుడ్డి నమ్మకాలు కావు. కేవలం మానవ నిర్మిత పరిశోధనాగారాలలో శాస్త్ర సాంకేతిక పరిశోధనాలయాల నుంచి అందివస్తున్న నిగ్గుతేలిన ఔషధాలే, మందులూ, మాకులేనని మరవరాదు. 'ఆత్మ అనే దీపం వెలిగేందుకు, ఆశ అనే తైలం ముఖ్యం' అన్నాడొక క్రాంతదర్శి. అందుకే ఉపనిషత్తు కూడా మనసులోని చీకటిని పారదోలే మార్గాన్ని ఉపమాలంకారంలో 'జ్యోతి'తో పోల్చింది కాంతిని. అంతేగానీ ఉన్న కాంతినిగానీ, సహజమైన వెలుగునుగానీ ఆర్పేసుకుని కొవ్వొత్తిని ఆశ్రయించమన్న దాఖలాలెక్కడా లేవు. అందుకే బుద్ధిని, సంఘాన్ని, ధర్మాన్ని (త్రికరణాలు) మాత్రమే నమ్ముకోమన్న బౌద్ధాన్ని దేశంలోని మౌఢ్య శిఖామణులు భారతదేశం సరిహద్దులు దాటించినప్పుడే దేశం ఆత్మహత్య చేసుకొందని మహాకవి గురజాడ నేటికి వందేళ్లనాడు చాటవలసి వచ్చింది.

మనం శాస్త్రవేత్తల పరిశోధనా ఫలితాల్ని మర్చిపోతున్నాం. అసలు వివిధ రంగాల్లో మానవుడు సాధించిన అగణితమైన విజయాలనే విస్మరిస్తున్నాం. ఆశను పోగొట్టుకోకూడదు. కానీ దాని వెలుగులోనే

### రెండో మాట



మూఢ విశ్వాసాల్ని పెంచి సైన్స్, సాంకేతిక పరిజ్ఞానం మానవాళి సుఖం కోరి పెంచుకు వస్తున్న విజయాలను తక్కువచేసి, మూఢ విశ్వాసాలకి 'చాపకింద నీరులా' కొందరు పరిచి పాకించే అశాస్త్రీయ మందుల్ని మాకుల్ని ప్రోత్సహించే అధికారిక, అనధికారిక ప్రయత్నాల్ని అడ్డుకొనక తప్పదు.

ఇందుకు తాజా ఉదాహరణగా– కేంద్ర ప్రభుత్వ 'ఆయుష్' మంత్రిత్వ శాఖ నేటి కరోనా వ్యాధి వ్యాప్తి సందర్భంగా విడుదల చేసిన ప్రకటన. ఆయుర్వేద, యోగ, ప్రకృతి వైద్యం, యునానీ, సిద్ధ, హోమియోపతి వైద్యం పేరిట 'ఆయుష్' శాఖ మంత్రి శ్రీపాదనాయక్ 'ఆయుర్వేద, హోమియోపతి మందుల్ని కోవిడ్–19 వ్యాధికి గురైన బ్రిటిష్ రాకుమారుడు ప్రిన్స్ చార్లెస్ వాడినందువల్ల రాకుమారుడు వ్యాధి బారి నుంచి కోలుకున్నాడని ప్రకటించారు. అంతేగాదు, పైగా వేలకొలది సంవత్సరాలుగా ఆచరణలో ఉన్న ఈ వైద్యం వల్లనే రాకుమారుడు కోలుకున్నాడని రుజువైందన్న మంత్రి ప్రకటనను బ్రిటిష్ క్లియరెన్స్‌హౌస్ ప్రతినిధి అబద్ధంగా తోసిపుచ్చి ఖండించాల్సి వచ్చింది.

దీనికితోడు, భారతదేశంలోని ప్రెస్‌కౌన్సిల్ కూడా ఒక ప్రకటన చేస్తూ, 'ఆయుష్ మంత్రిత్వ శాఖ కోవిడ్–19 కరోనా వ్యాధి నివారణకు సంబంధించి విడుదల చేసే ప్రచారాన్నిగానీ, తప్పుదోవ పట్టించే ఆయుష్ ప్రకటనలనుగానీ దేశీయ పత్రికలు నిలుపు చేయాలని కోరింది. ఐక్యరాజ్యసమితి విద్యా, సాంస్కృతిక శాఖ కూడా ఏం చెబుతోంది? 'పత్రికా స్వేచ్ఛ, సుపరిపాలనా వ్యవస్థ పరస్పర ఆధారాలు'గా ఉండాలనీ, దేశ ఆర్థిక, మానవ వికాసానికి దోహదం చేయవలసిన బాధ్యత ఈ సంస్థలకు ఉందని ఆదేశిస్తోంది యునెస్కో. అందుచేత మానవుడి చేతనా శక్తిని కాపాడుకుంటూనే, ఇలాంటి మహమ్మారి వ్యాధులు వ్యాప్తిలోకి వచ్చినప్పుడు (రావన్న ఆశ కూడా తప్పే) దాని తాలూకు ప్రభావాన్ని మన మనస్సులపై బాధతో కూడిన ఒత్తిడిని తట్టుకోగల శక్తిని పుంజుకోవడం కోసం మనలోని ఆశకు ప్రతిరూపంగా ఆశాదీపం సర్వదా వెలుగుతూనే ఉండాలి. మంచి జరగాలన్న కోరికే మనసుకు ఒక వెలుగు. కానీ, ఆ వెలుగులో దేశంలోని 130 కోట్ల మంది ప్రజల్లో 80 కోట్లమంది పేదలకు 'పొయ్యిలోని పిల్లి' లేవలేదు, నిలువ నీడకూ ముఖాలు వాసిపోతున్నాయన్న ఇంగితం, స్పృహ పాలకులకు, రాజకీయులకు అనవసరం.

మనది 'సెక్యులర్ భారతం' అని మురిసిపోతున్న దశ అంతరించి 'పెక్యులియర్' (వింత) భారతాన్ని 'జంతరపెట్టె'లో మాత్రమే చూడగలుగుతున్నాం. మౌలిక సౌకర్యాల కల్పనకు, వాటి పటిష్టతకు మారుగా చిట్కాలకు దిగుతున్నారు. అశాస్త్రీయ మౌఢ్య ధోరణుల్ని (సూడో సైన్స్) ప్రసిద్ధ అంతర్జాతీయ సంబంధాల పరిశోధకుడు, శివ నాడార్ యునివర్సిటీ ప్రొఫెసర్ అతుల్ మిశ్రా ఖండిస్తూ ప్రకటన చేశారు. ప్రజలంతా కలిసి మూకుమ్మడిగా 'కరోనా గో బ్యాక్' అంటూ నినదిస్తే అది 'క్వాంటమ్ సూత్రం' (మూక సూత్రం/సంఖ్యాబలం) అవుతుందిగానీ అది తోక ముడవదని చెప్పారు. మూకసూత్రానికి సైన్స్‌కి సంబంధం ఏమిటో 'గోబ్యాక్' సూత్రకారులు వివరించి ప్రజల జ్ఞాన తృష్ణను తీర్చలేకపోయారు. ఇలాంటి అశాస్త్రీయ మూఢ విశ్వాసాలు 'ఈ క్లిష్ట కాలంలో భారతదేశ ప్రజారోగ్య విధానానికి అత్యంత ప్రమాదకర పరిణామం'గా ప్రొఫెసర్ మిశ్రా పేర్కొన్నారు. అంతేగాదు, 'దేశ ప్రధానమంత్రి అనే వ్యక్తి జాతీయ సమస్యలపై మాట్లాడినప్పుడు ఆ మాటలకు విలువుండాలి. వైరస్ మహమ్మారిని ఎదుర్కోడానికి సైన్స్ పరిజ్ఞానానికి మించిన విశ్వసనీయమైన ఆయుధం లేదని ప్రధాని ప్రజలకు చెప్పి జ్ఞానోదయం కలిగించాల్సిన సమయంలో మనం పక్కదారులు తొక్కకూడదని' మిశ్రా బోధ. ఈ పక్కదారులు పట్టినందుకే రాజ్యాంగంలోని 'పౌర బాధ్యతల' అధ్యాయానికి కూడా 'కరోనా'అంటుకుంది.

ఈ మానసిక కరోనా వల్లనే 'లోకాస్సమస్తా సుఖినోభవంతు' (సర్వదా సుఖంగా ఉండాలి) అన్న సార్వజనీన లక్ష్యం కూడా మనకు దూరమవుతోందని గుర్తించాలి. కనుకనే దీపాలు దీపాలుగానే ఉన్నాయి. పాలనా వ్యవస్థల కానరాని దుర్మార్గాలే దీపాలను కొడిగట్టించే శాపాలుగా రూపాంతరం చెందాయి. మన ఆర్థిక వ్యవస్థ దీపమూ కొడిగట్టిపోయింది. దాని సరసనే నూటికి 80 మంది సామాన్య ప్రజల జీవితాలూ ఆరోగ్యభాగ్యానికి దూరమై కొడిగట్టిపోతున్నాయి.

ప్రస్తుత దేశ పరిస్థితుల్లో ఆర్థిక, పారిశ్రామిక రంగం బడా బాబులకు వాళ్ల ప్రయోజనాల రక్షణ కోసం జాతీయ బ్యాంకుల గోళ్లు ఊడగొట్టి వాటి విలీనం పేరిట తిరిగి అలవికాని బడా వర్గాల ప్రయోజనాల కోసమే పనిచేయబోతున్నాయి. ఇదంతా కల్తీ ఎరగని దీపకాంతిలోనే సుమా! రుగ్వేదకాలంలోనే 23 రోగాలు పేర్కొని శ్రద్ధతో నివారణమందులు కనిపెట్టి వాడారు. రోగాన్ని రుగ్వేదార్యులు 'యక్ష్మ' అన్నారు. క్షయను 'రాజయక్ష్మ' (రాచపుండు) అన్నారు ప్రాచీనులు. శక్తివంతమైన మందుల్ని వాడితేనే రోగాలు నయమవుతాయని అథర్వణ వేద రుషి వాక్కు. పైగా ఎలాంటి జ్వరంగానీ, రోగంగానీ లేకుండానే గుండె ఆగి ఆకస్మికంగా చనిపోవడాన్ని 'శ్లాఘనీయ మరణం' (మంచి చావు)గా భావించారేగానీ ఉన్న దీపాలు కాసేపు ఆపి, మళ్లీ అవే దీపాల్ని వెలిగించుకోమనలేదు. జీవించాలన్న మనిషి ఆశాదీప కాంతితోనే ప్రజారోగ్యానికి బలమైన అసలు సిసలు దీపశిఖ!!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




### సోషల్ మీడియా

#### వైరస్



శాస్త్రజ్ఞులు చెబుతున్నట్లు సాంకేతికంగా సజీవంగా లేకపోయినా, భయంకరమైన తెలివితేటలున్న వైరస్‌లు మాత్రం నన్నెప్పుడూ ఆశ్చర్యపరుస్తూనే ఉంటాయి. నేను వైరాలజిస్ట్‌ను కావడానికి అది కూడా ఒక కారణం. మొదటి సార్స్ కంటే చిత్రంగా ప్రవర్తించే సార్స్–కోవిడ్–19 గురించి ఇటీవల ఒక పరిశోధనా పత్రం వెల్లడించింది. రెండు వైరస్‌లూ కూడా బయటనున్న స్పైక్ ప్రొటీన్, మన శరీరంలోని ఏస్–2 అని పిలువబడే ప్రొటీన్ ద్వారా కలుస్తాయి. మన కణాల్లోకి ప్రవేశించి ఇన్ఫెక్షన్ కలిగించడానికి ప్రతి వైరస్‌కీ ఒక ప్రత్యేకమైన దారి ఉంటుంది.

– పీటర్ కొల్చిన్ స్కై, వైరాలజిస్ట్

#### మంటలు



తొమ్మిది గంటలకు తొమ్మిది నిమిషాలపాటు బాణసంచా కాల్చడంతో మా పక్కనే ఉన్న భవంతిలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి, మంటలు అదుపుచేశారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కాలేదు. భవిష్యత్‌లో మనం కరోనాకు మందు కనుగొనగలుగుతాం, కానీ, మూర్ఖత్వానికి మందే లేదు.

– మహిమ్ ప్రతాప్ సింగ్, జర్నలిస్ట్

#### కానిస్టేబుల్



లాక్‌డౌన్ ప్రారంభమైనప్పటి నుంచీ కానిస్టేబుల్ పూజ రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలోని క్వారంటైన్ వార్డు దగ్గర కాపలా పని చేస్తోంది. తన విధులు పూర్తి చేసుకుని స్కూటీపై శివ విహార్ చేరుకుంటుంది. తన పొరుగువారి సహకారంతో ఆహారం వండి అవసరమైన వారందరికీ అందజేస్తుంది. వీళ్లే నిజమైన లాక్‌డౌన్ హీరోస్.

– సాక్షి చంద్, జర్నలిస్ట్

#### డాక్టర్



సివిల్ లైన్స్ ఆసుపత్రిలోని మానసిక అనారోగ్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సంజీవినిని పక్క ఫ్లాట్‌లో ఉండే చేతన్ మెహతా, అతని భార్య భావన కొంతకాలంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. చివరకు భౌతిక దాడులకు కూడా పాల్పడటంతో ఆమె పోలీసులను ఆశ్రయించక తప్పలేదు. చప్పట్లు కొట్టడానికీ, దీపాలు వెలిగించడానికి ఎగబడేవాళ్లు వైద్యుల పట్ల సానుభూతి చూపలేకపోతున్నారు.

– సానియా అహ్మద్, గృహిణి

#### మార్పు



పొరుగు రాష్ట్రంలో కూర్చుని రాళ్లు విసరడం కాదు. కరోనా నుంచి కోలుకుని ఆసుత్రులనుంచి డిశ్చార్జ్ అయిన వారితో మాట్లాడితే బాగుంటుంది. చికిత్స ఎలా జరిగింది, వసతులెలా ఉన్నాయి, డాక్టర్లు ఎంత శ్రద్ధ తీసుకున్నది తెలుస్తుంది. కోడి గుడ్డుపై ఈకలు పీకడమేనా? కాలంతో పాటు మారకపోతే ఎలా బాబూ?

– విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

#### మూసివేత



కరోనా వైరస్ వ్యాపిస్తున్న కారణంగా జెరూసలేంలోని హోలీ సెపల్కర్ చర్చిని మూసివేశారు. గతంలో ప్లేగు వ్యాధి తీవ్రంగా వ్యాపించినప్పుడు 1349లో ఈ చర్చిని మూసివేశారట. మళ్లీ ఇంతకాలానికి ఈ చర్చి మూతపడిపోయింది.

– డేవిడ్, రచయిత

## ఇన్‌బాక్స్

### నాన్న అభినివేశం

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ప్రజా
వైద్యశాలకు ఆవిర్భావ మహోత్సవం
తెలంగాణ ప్రజలకి విట్టల్ డాక్టర్
సమోన్నత దర్శనం
సూర్యాపేటలో కమ్యూనిస్టు ఉద్యమానికి
ఆయనే ఒక ప్రభంజనం
వైద్యమూ, కమ్యూనిస్టు విప్లవం
ఉచ్ఛ్వాసనిశ్వాసలుగా సాగిన జీవనం

పేద బలహీన వర్గాలకు
విట్టల్ దవాఖానా
3 రూపాయలతోనే మనిషిని
ఉల్లాసపరిచే ఒక ఉద్యానవనం
కళాకారులకు సాహితీవేత్తలకు విప్లవ
వీరులకు అది ఒక విశ్వవిద్యాలయం
సమాజ గతిని ప్రశ్నిస్తూ సాగిన ఆయన
జీవనం ఒక అద్భుత గేయం

మానవత్వం పరిమళించే విఠల్
ఒక మహోన్నత వైద్య శిఖరం
పేద ప్రజల హృదయాలలో
చెరగని ముద్ర వేసుకున్న ఆయన
ఒక అనంతసాగరం
అనేక సామాజిక సమస్యలకు ఆనాటి
ప్రజా వైద్యశాల ఒక పరిశోధనాలయం
మానవత్వ వీచికలకి ఒక అంబరం
తరతమ భేదాలు లేక ఎంతోమందిని
అక్కున చేర్చుకుని సేద తీర్చడమే
ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం
విభిన్న సైద్ధాంతిక దృక్పథాలను
కలబోసి వృత్తికి ప్రవృత్తికి
సమానమైన న్యాయం చేయగలిగిన
సవ్యసాచి 'ఇటల్' డాక్టర్

నవజాత శిశువులకు ఆనాడు
నీవు అందించిన శ్వాస
వారిలో ఇప్పటికీ నిశ్చలంగా
ఉంచింది మీపై ధ్యాస
సూర్యాపేటలో మీ జీవితం చరితార్థం
ప్రజలలో మీపై ప్రేమ అజరామరం

వీర తెలంగాణ నాదని
ఆ తెలంగాణ ప్రజల అభిమానాన్ని
మాత్రమే మూటగట్టుకొని
పుచ్చలపల్లి సుందరయ్య గారి
బాటలో పయనించిన
మీ ఉన్నత ఆశయాలకి
జోహార్లు అర్పిస్తూ
నాన్నా మీ ఆశయాలు అమర్ రహే

(డా. ఏపీ విఠల్ 1971 ఏప్రిల్ 7న సూర్యాపేటలో ప్రజావైద్యశాలను స్థాపించారు)
(నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం)

– సుహాసిని

# భారత్, చైనా ప్రపంచ పెద్దన్నలు కావాలి

సందర్భం



డా॥ చెరుకు సుధాకర్

దేశాలు స్వాతంత్ర్యాన్ని, జాతులు విముక్తిని, ప్రజలు శ్రేయోరాజ్యాన్ని, ప్రపంచం అంతర్జాతీయ మానవతావాదాన్ని కాంక్షిస్తున్న కాలంలో సరిహద్దులు దాటి అనేక సర్దుబాట్లు, దిద్దుబాట్లు జరిగినాయి. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్– మన దేశ స్వాతంత్ర్య కాలానికి అటు ఇటుగా ఏర్పడినాయి. 1920లో జెనీవా కేంద్రంగా హెన్రీ డ్యూనాంట్ ఏర్పాటు చేసిన రెడ్‌క్రాస్ సంస్థ కోటి మంది స్వచ్ఛంద సైనికులతో దేశాలు, వాటి ఘర్షణలతో సంబంధం లేకుండా క్షతగాత్ర సైనికులకు సేవలు అందించింది. దీని స్ఫూర్తితో 1948 ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పడి, తన మొదటి అసెంబ్లీని 1950లో సమాయత్తపరిచింది. అన్ని దేశాల ప్రజలు అత్యున్నత శారీరక, మానసిక ఆరోగ్యం సాధించాలని పిలుపును ఇచ్చింది. మన దేశంలో అమలైన మాతా శిశు సంరక్షణ, జాతీయ మలేరియా, క్షయ, కుష్టు, అనేక అంటురోగాల నిర్మూలనలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సహకారం ఉన్నది. ఎయిడ్స్ వ్యాధి నివారణకు వర్ధమాన దేశాల నుండి మందుల సరఫరాకు అతి తక్కువ ధరల బిడ్స్ కోరినందునే మన దేశంలోనే అనేక మందుల కంపెనీలు అంతర్జాతీయ ప్రమాణాలతో సరఫరా చేసినాయి. చైనా, ఇండియా, జపాన్ కొత్త ప్లేయర్స్‌గా అవతరించినాయి. అయితే, గత 30 ఏండ్లలో లేని తీవ్రమైన నిధుల కొరతను ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎదుర్కొంటున్నది. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేస్తున్న తరుణంలో బేలగా కొన్ని సలహాలే తప్ప, క్రియాశీలకంగా ముందుకు పోలేని స్థితిలో నేడు 72వ వార్షికోత్సవం జరుపుకొంటున్నది.

1978లో రష్యాలో '2000 సంవత్సరం నాటికి ప్రపంచ ఆరోగ్యం' డిక్లరేషన్ జరిగింది. దేశాలలో వనరుల పంపిణీ సమంగా ఉంటే కాని ఈ లక్ష్యం నెరవేరదనీ, పేద దేశాలకు నిధులు సమకూర్చడం అగ్రదేశాల మాననీయ కర్తవ్యమనీ అర్థించింది. ఈ మాటలు సహజంగానే అమెరికా, యూరోప్ దేశాలకు



నచ్చలేదు. చమురు పోస్తే కాని తోటి దేశాల ఆరోగ్య దీపాలు వెలగవని ఇవి గ్రహించలేకపోయినాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం ప్రపంచ ప్రజలు సంవత్సరమంతా ఒక నిర్దేశిత ఆరోగ్య లక్ష్యం చుట్టూ గమనంలో ఉండాలని ప్రతి ఏప్రిల్ 7కు ఒక థీమ్‌నూ, ఒక గోల్‌నూ ప్రతిపాదిస్తుంది. అనేక సంక్షోభ, సంక్లిష్ట కారణాలతో 2000 నాటికి అందరికి ఆరోగ్యం సాధించడం జరగలేదు కనుక, 2018 ఏప్రిల్‌లో తన 70వ వార్షికోత్సవం సందర్భంగా విశ్వజనీన ఆరోగ్య కవరేజ్ ప్రకటించుకుంది. 2019లో కూడా అదే టార్గెట్‌ను ప్రపంచ దేశాలకు నిర్దేశించినా, విధానపరమైన నిర్ణయాత్మకత లేకపోవడంతో ఫలితాలు రాలేదు. ఇప్పుడు కోవిడ్ 19 నేపథ్యంలో సంక్రమణ వ్యాధుల చర్చను, కార్యక్రమాలను ప్రకటించింది. సేవామూర్తులైన నర్సులకు ఆరాధ్య దేవత ఫ్లోరెన్స్ నైటింగేల్ 200వ జన్మదినోత్సవ పునరుత్తేజంతో వైద్య, ఆరోగ్య సిబ్బంది ముందుకు పోవాలని అన్నది. అట్లాంటాలోని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (సీడీసీ) ప్రపంచంలో ప్రామాణికమైన పరిశోధనా సంస్థ. కానీ సార్స్, ఎబోలా, నిఫా, మెర్స్ సమయంలో సీడీసీ, ప్రపంచ ఆరోగ్య సంస్థకు ఇచ్చిన సాంకేతిక సహాయం, సలహాలు నామమాత్రం. నిన్నటి కరోనా, నోవల్ కరోనాగా వచ్చి వూహాన్ గగనతలాన్ని దాటి తమ దేశాల్లో ప్రవేశిస్తుంటే చేష్టలుడిగిన దౌర్భాగ్యం ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రాభవం తగ్గడానికి ఒక కారణం.

కరోనా దెబ్బకు లక్షమంది దేశీయంగా చనిపోతారని వణికిపోతున్న అమెరికా గ్లోబల్ సహాయం చేసే స్థితిలో లేదు. అందుకే భారత్ అయినా గతంలో చేసిన తప్పులు చేయకుండా 2020 ఆరోగ్య బడ్జెట్‌లో 6% నిధులను కేటాయిస్తే బాగుంటుంది. ప్రపంచ ప్రజల ఆర్థిక శక్తులుగా ఎదిగిన చైనా, ఇండియా ఇతర వర్ధమాన దేశాలను ప్రభావితం చేయడానికి తామే పెద్దన్నలుగా ఎక్కువ నిధులు ఈ సంస్థకు సమకూర్చితే 2020లో అదే పెద్ద 'కంట్రిబ్యూషన్'. ఈ సంస్థ ప్రపంచ ఆరోగ్యానికి ఆక్సిజన్. దాన్ని బలోపేతం చేయడం ఒక అత్యవసర కార్యం.

(నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా)

వ్యాసకర్త సామాజిక వైద్యులు, రాజకీయ కార్యకర్త

# మెరుగైన వైద్యమే లక్ష్యం

ప్రపంచ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏటా ఏప్రిల్ 7ని ప్రపంచ ఆరోగ్య దినంగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో ఈసారి ప్రపంచ ఆరోగ్య దినోత్సవానికి చాలా ప్రాధాన్యతను అన్ని దేశాలూ కల్పించాలి. వ్యక్తులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండి రోజువారీ పనులు చేసుకుంటూ శరీరంలోని అన్ని అవయవాలూ సక్రమంగా పనిచేస్తూ ఉత్పత్తి క్రమంలో పాలుపంచుకుంటున్నప్పుడే ఆరోగ్యవంతులుగా ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. కానీ వాస్తవానికి ప్రపంచంలో సగంమంది రోగపీడితులుగా ఉన్నట్లు తెలుస్తోంది. అన్ని రకాల వ్యాధులు, వైరస్‌ల బారిన పడుతోంది వీరే. మన దేశంలో ఆరోగ్యం సాధారణ పౌరులకు అందని పండే. మనిషి సంపాదనలో 60 శాతం పైగా రోగనివారణకు ఖర్చుచేస్తున్న తరుణంలో కరోనా రాకతో మన ఆరోగ్య వ్యవస్థ ఇంకా దిగజారిపోయింది. కానీ ప్రాథమిక ఆరోగ్య కల్పనను మాత్రమే మన ప్రభుత్వాలు తీసుకుని ఉన్నత వైద్యంలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడంతో ప్రభుత్వాసుపత్రులు పేదలకు అరకొర సౌకర్యాలతో సేవలందిస్తున్నాయి.

రెండు తెలుగు రాష్ట్రాల్లో నేడు కరోనా కేసులు ఎక్కువవుతున్నాయి. కరోనా చికిత్స చేయడానికి వైద్య సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్నా వారికి కావలసిన మాస్కులు, గ్లౌజులు, కోటు వంటివి చాలా తక్కువగా అందుబాటులో ఉంటున్నాయి. దేశమంతా లైట్లు ఆర్పి, దీపం వెలిగించడంలో ప్రధానికి ఉన్న శ్రద్ధ అత్యవసరమైన కిట్లు, వెంటిలేటర్లను అందివ్వడంలో లేదనటం స్పష్టం. అందుకే క్యూబా పద్ధతిలో వైద్యరంగం ఉండాలంటే ప్రైవేటు ఆసుపత్రులను వెంటనే జాతీయం చేసి వైద్యాన్ని సార్వత్రికం చేయాలి. అప్పుడే ప్రతి ఒక్కరికీ వైద్యం అందుబాటులోకి వస్తుంది. చైనా ఇరుగుపొరుగు దేశాలైన ఉత్తరకొరియా, దక్షిణ కొరియా, హాంకాంగ్, తైవాన్, సింగపూర్, వియత్నాం వంటి దేశాలు షట్‌డౌన్, లాక్‌డౌన్ లేకుండానే కరోనాపై గెలుపు సాధించాయి. ఆరోగ్యాన్ని అత్యవసర సేవలుగా భావించి ప్రతి ఒక్కరికీ వైద్యాన్ని అందుబాటులోకి తేవడమే వ్యాధులు, వైరస్‌లను నియంత్రించగలవు.

(నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం)

బి. జ్యోతి, ఎడిటర్, మహిళామార్గం

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
మంగళవారం ॥ 7-4-2020



# ధైర్యవచనం

**కొం**డలు విరిగిపడి మనల్ని బెదిరించడానికి చూడవచ్చు. సముద్రాలు ఉప్పొంగి వచ్చి జడుపు జ్వరం తెప్పిద్దామని ప్రయత్నించవచ్చు. భూతలం తన వీపు విదుల్చుకుని బెంబేలెత్తించేద్దామని పగుల్లివ్వ వచ్చు. కాని మనిషి కొనసాగుతూ వచ్చాడు. కొనసాగుతూనే ఉన్నాడు. కరోనాతో ఇప్పుడు మానవ జాతి చేస్తున్నది సుదీర్ఘపోరాటం అని గ్రహించే సమయం వచ్చేసింది. ఇందులో ఆగడానికి లేదు. అలిసిపోవడానికి లేదు. గెలవడం తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదు. గెలవాలంటే తోడు కావాలి. పరస్పర ధైర్యవచనం కావాలి. ఇది రెండు రోజుల క్రితం అమెరికాలోని లాస్ ఏంజలస్‌లో తీసిన ఫొటో. కరోనా లక్షణాల వల్ల నర్సింగ్‌హోమ్‌లో క్వారంటైన్‌లో ఉన్న భర్తను భార్య బయట నుంచి పలకరిస్తున్న దృశ్యం ఇది. భౌతిక దూరం పాటించాలి కనుక అద్దాల గదిలో అతడు ఉంటే బయట ఆమె ఉంది. ఇద్దరూ ఫోన్ ద్వారా మాట్లాడుకుంటూ ఉన్నారు. 'తొందరగా నయమయ్యి వచ్చేస్తావులే' అని ఆమె బహుశా అంటుండవచ్చు. మనం కూడా అదే అనుకోవాలి. తొందరగా ఈ కరోనా నుంచి బయటపడిపోతాములే అని. అంతే కదూ.

## ఆమె కోలుకుంది



**కే**రళలోని కొట్టాయమ్‌కు చెందిన వృద్ధదంపతులు థామస్, మరియమ్మలు కరోనా నుంచి కోలుకున్న విషయం తెలిసిందే కదా! వాళ్లకు వైద్య సేవలు అందించిన రేష్మ మోహన్‌దాస్ అనే నర్స్‌కూ కరోనా సోకింది. కేరళలో ఆ వైరస్ బారిన పడ్డ తొలి హెల్త్ వర్కర్ రేష్మ. ఇప్పుడు శుభవార్త ఏంటంటే ఆమె కోలుకొని ఆరోగ్యవంతురాలై ఆసుపత్రి నుంచి డిశ్చార్చ్ అయింది. డాక్టర్లు, తోటి నర్సుల అభినందనల మధ్య ఆమె ఇంటికి బయలుదేరారు. '14 రోజుల క్వారంటైన్ తర్వాత రేష్మ తిరిగి విధులకు హాజరు కావచ్చు' అని కేరళ ఆరోగ్యశాఖ మంత్రి కేకే శైలజ చెప్పారు. అయితే రేష్మ చాలా తేలికపాటి లక్షణాలతోనే బాధపడిందని అంతే త్వరగా కోలుకొని డిశ్చార్జ్ అయినట్లు ఆసుపత్రి వర్గాలు తెలుపుతున్నాయి. 'కరోనా ట్రీట్‌మెంట్‌కు మా ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. దీనిపట్ల ఎలాంటి భయాందోళనలు, అనుమానాలు అక్కర్లేదు. కరోనాను నిరోధించడంలో కేరళ తప్పకుండా విజయం సాధిస్తుంది' అని ధైర్యం ఇస్తోంది రేష్మ. డాక్టర్లు, నర్సులే కాదు భర్త ఉన్నికృష్ణన్, తల్లి ఇచ్చిన మనోధైర్యం కూడా తనకు ఔషధంలా పనిచేశాయి అంటోంది రేష్మ.

## లీ ఫేస్ ప్రొటెక్టివ్ గేర్



**అ**వసరమే ఆవిష్కరణలకు ప్రేరణ అన్నట్టు కరోనా కష్టకాలం కూడా ఎన్నో ఆలోచనలకు ఓ రూపం ఇస్తోంది. వైరస్‌ను ఎదుర్కోవడానికి కావల్సిన ఆయుధాలను తయారు చేయిస్తోంది. మాస్కులు, గ్లోవ్స్, వెంటిలెటర్ల కొరత చాలా తీవ్రంగా ఉంది. ఈ కొరతను తీర్చడానికి సామాన్యుల నుంచి నిపుణుల వరకు ఎవరికి తోచిన ప్రయోగం వాళ్లు చేస్తూనే ఉన్నారు. ఆ లిస్ట్‌లో మణిపురికి ఎనిమిదేళ్ల బాలిక లిసిప్రియ కంగుజం కూడా ఉంది. తను మాస్కుల కొరత తీర్చడానికి 'సేఫ్టీ ఫేస్ షీల్డ్' ను తయారు చేసింది డాక్టర్ల కోసం. బయట మార్కెట్లో వీటి ధర వెయ్యి రూపాయలుంటే తను తయారు చేసిన షీల్డ్‌ను 35 రూపాయలకే అందజేస్తోంది ఈ అమ్మాయి. వచ్చే వారంలో ఒక వెయ్యి 'సేఫ్టీ ఫేస్ షీల్డ్స్'ను తయారు చేసి ఉచితంగా పంపిణీ చేయాలనుకుంటోంది. 'మెక్సికోలో ఉండే నా ఫ్రెండ్ అక్కడ తనే దేశంలోని డాక్టర్ల కోసం ప్రొటెక్టివ్ ఫేస్ మాస్కులను తయారు చేసింది. ఆ స్ఫూర్తితోనే నేనిక్కడ ఈ సేఫ్టీ ఫేస్ షీల్డ్స్‌ను తయారు చేస్తున్నాను' అంటుంది లిసిప్రియ. ఈ సేఫ్టీ ఫేస్ షీల్డ్స్‌కు తను పెట్టినపేరు 'లీ ఫేస్ ప్రొటెక్టివ్ గేర్'.

## కరోనా కథ - బాధ్యత

**సు**నంద ఉదయం ఏడు గంటలకు కూరలకోసం బయటకు వెళ్ళింది. అరగంట తర్వాత హడావిడిగా ఇంటికి వచ్చింది. కూరల సంచిని బాల్కనీలో ఉన్న నీళ్ల టబ్‌లో నానబెట్టడానికి పడేసింది.

కట్టుకున్న మాస్క్‌ని డస్ట్ బిన్ లో వేసి, ముఖం కాళ్ళూ,చేతులూ కడుక్కొని లోపలికి వచ్చింది.

వచ్చిన దగ్గర్నుంచీ ఆమె మనసు మనసులో లేదు. భర్త రత్నం చేతికి యాధాలాపంగానే కాఫీ కప్పు అందించి గదిలోకి వెళ్ళింది.

బీరువా తెరిచి, భర్త రత్నం వేసుకోని కొన్ని ప్యాంట్లను తీసి మంచం మీద పెట్టింది.

'ఏవిటోయ్ పొద్దున్నే నా బట్టలు సర్దుతున్నావ్? ఈ లాక్డౌన్ సమయంలో ప్రయాణాలూ గట్రా చెయ్యకూడదు. లోపల నీటుగా పెట్టెయ్. నా సహాయం ఏమన్నా కావాలా?' అన్నాడు రత్నం.

'నేను ఇప్పుడు చేసే పనికి కాస్త అడ్డు చెప్పకుండా ఉంటే చాలు. అదే నాకు మీరు చేసే పెద్ద సాయం. మీకు వీలైతే ఓ పని చేయండి' అంది.

'ఏంటో చెప్పు చిటికెలో చేసేస్తా, అసలే ఖాళీగా ఉన్నానేమో ఏవీ తోచడం లేదు' అన్నాడు రత్నం మంచం మీద మఠం వేసుకుని కూర్చుని.

'మీరు ఈ మధ్య వేసుకోని కొన్ని ప్యాంట్లను కత్తిరించి నాకు ఇవ్వండి. నేను మాస్కులు కుడతాను. ఎన్ని వీలైతే అన్ని కుట్టాలి మనం. నేను మార్కెట్ నుంచి వచ్చే దారి పొడవునా ఎందరో అనాథలు, యాచకులు నడి రోడ్డు మీద మాస్కులు లేకుండా కనబడ్డారు. వాళ్ళకి ఎక్కడ దొరుకుతాయి. అందుకేమనం వీలైనన్ని మాస్కులు కుట్టి వాళ్లందరికీ అందివ్వగలిగితే ఈ కష్టకాలంలో మనం చేయగలిగే సేవ, సామాజిక బాధ్యత నెరవేర్చిన వాళ్ళం అవుతాము ఏమంటారు' అంది సునంద.

'మంచి ఆలోచన చేశావు సునందా! ఎవరికి చేతనైన సహాయం వాళ్ళు చేయడమే అసలైన దేశభక్తి. తప్పకుండా చేద్దాం' అన్నాడు రత్నం.

– గొర్తి వాణీ శ్రీనివాస్

కరోనా రాకుండా ఉండివుంటే ప్రపంచానికిది రాగాల రుతువు. స్ప్రింగ్ సీజన్. వసంతం. పువ్వులదొక రాగం. గువ్వలదొక రాగం. పచ్చని ప్రకృతి మువ్వలదొక రాగం. ఈ రాగాలన్నిటితో పండిట్ రవిశంకర్ 'స్మృతి సితార' కూడా శృతి కలిపి ఉండేది. ఈరోజు పండిట్ జీ నూరవ జయంతి. ఆయన్ని కృతిస్తూ ఆయన భార్య, కూతురు శత సితార్ మహోత్సవాన్ని ప్లాన్ చేశారు. అయితే లాక్‌డౌన్‌తో అదిప్పుడు ఆగిపోయింది!

### పండిట్ రవిశంకర్ (1920-2020)

# శత వసంతం



పండిట్ రవిశంకర్, స్వర్గీయ సితార్ విద్వాంసులు

**సం**గీతానికి ఒక దేశపు పౌరసత్వం అంటూ ఉంటుందా? అలాగే రవిశంకర్, ఆయన సంతానం! ప్రస్తుతం రవిశంకర్ భార్య సుకన్య, కూతురు అనౌష్క లండన్‌లో ఉన్నారు. ఉండటం కాదు, కరోరా కారణంగా అక్కడి తమ సొంత ఇంట్లో వారు చిక్కుకుపోయారు. వాళ్లతో పాటు రవిశంకర్‌కు ఎంతో ఇష్టమైన ఆయన సితార్ కూడా! కోల్‌కతాలో వాద్యపరికరాల తయారీకి ప్రసిద్ధులైన కన్హాయిలాల్.. రవిశంకర్ కోసం ప్రత్యేకంగా మలిచి ఇచ్చిన సితార్ అది. దానిపై ఇష్టంగా వేళ్లు కదుపుతుండేవారు రవిశంకర్. కరోపా వ్యాప్తికి ముందు లండన్‌లో జరిగిన సంగీత ప్రదర్శనకు ఆ సితార్‌తోనే వెళ్లారు అనౌష్క. ఇప్పుడు ఇంటి నుంచి కాలు కదపలేని స్థితిలో తండ్రి శతజయంతి స్మృతి గీతికలను ఉన్నచోటు నుంచే వేళ్లతో ఆలపించి, విశ్వాన్ని సమ్మోహనపరచడానికి ఆ సితారే ఆమెకొక దారి చూపించింది.

**ఇంటి నుంచే..!**

ఘనమైన సంగీతకారునికి ఘనమైన నివాళి ఇవ్వాలని తల్లీకూతుళ్లిద్దరూ కలిసి కూర్చొని ఇన్ని నెలలుగా వేసుకున్న ప్రణాళికలన్నీ పుస్తకంలో నోట్ చేసుకున్న గమకాల్లా మిగిలి, ఆయన జయంతి రోజు ఇంట్లో చేయబోతున్న చిన్న పూజా కార్యక్రమమే ఇప్పుడు పెద్ద మహోత్సవంగా మిగలబోతోంది. పూజ తర్వాత హిందూస్థానీ సంగీతంలో అనౌష్క పలికించే స్వరాలు ఆన్‌లైన్‌లో మాత్రమే ఆమె తండ్రి అభిమానులను ఓలలాడించబోతున్నాయి.

అనౌష్క కూడా తండ్రిలాగే సితార్ విద్వాసురాలు. సుకన్య ఆ తండ్రీకూతుళ్ల సంగీతానికి ఒక పిపాసి మాత్రమే. రవిశంకర్ తొలి చూపుతో సుకన్యకు ఏర్పడిన ఆత్మబంధం.. ఆ చూపులోంచి ప్రవహించి హృదయాన్ని సోకిన సంగీతం వల్లనే. భర్త శత జయంతి రోజున భర్తతో తనకున్న అనుబంధాన్ని పంచుకోడానికి ఆమె దగ్గర జలధి తరంగాల్లా ఎన్నటికీ తరగని అంతరంగ భావావేశాలు ఎన్నో ఉన్నాయి. అయితే వాటికి మాత్రం ఆన్‌లైన్ వేదిక కాకూడదని సుకన్య భావిస్తున్నారు. అంటే ఒక పెద్ద పుస్తకాన్నే ఆమె త్వరలో రాయడం ప్రారంభించబోతున్నారని.



రవిశంకర్ భార్య సుకన్య (66), కూతురు అనౌష్క (38)

**పెళ్లిక్కడే జరిగింది**

హైదరాబాద్ చిలుకూరు బాలాజీ టెంపుల్‌లోనే సుకన్య, రవిశంకర్‌ల పెళ్లి జరిగింది. 1989లో. అప్పటికి ఆయన వయసు 69. ఆమె వయసు 35. అనౌష్క వయసు 8 ఏళ్లు. డెబ్భైల నుంచీ రవిశంకర్‌తో సుకన్యకు పరిచయం. ఆ పరిచయం ప్రేమ అయి, ఆ ప్రేమ.. బంధంగా మారి, అనౌష్క పుట్టిన ఎనిమిదేళ్లకు.. పెళ్లితో వాళ్లిద్దరూ ఆలూమగలు, అనురాగాల సరిగమలు అయ్యారు. అన్నపూర్ణా దేవి (మొదటి భార్య), కమలాశాస్త్రి (సన్నిహిత), సూజోన్స్ (సహజీవన సహచరి).. ఒక్కొక్కరు ఒక్కో సంగీతిక అయితే.. సుకన్య ఒక స్వరసమ్మేళనం రవిశంకర్ జీవితానికి. 1920 ఏప్రిల్ 7న బెనారస్‌లోని పుట్టారు పండిట్ జీ. బెంగాలీ కుటుంబం. హిందూస్తానీ సితార్ విద్వాంసుడిగా గుర్తింపు పొందారు. ఆలిండియా రేడియోలో మ్యూజిక్ డైరెక్టర్‌గా పని చేశారు. విదేశాల్లో కచేరీలు ఇచ్చారు. ఈ బ్రాహ్మలబ్బాయి మొదటి భార్య ఒక ముస్లిం! పేరు రోషనారా ఖాన్. అన్నపూర్ణాదేవిగా ఆయనే ఆమె పేరు మార్చుకున్నారు. ఆయన సంగీతం ఆయనకు పేరుతో పాటు అనేక మంది సంగీతప్రియులను, ప్రియురాళ్లనూ ఇచ్చింది. మనదేశం 'భారతరత్న' ఇచ్చింది. 2012లో కాలిఫోర్నియాలో ఉండగా 92 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచారు పండిట్ జీ. నేటికీ జీవించి ఉండుంటే ఈ ఏడాదికి నూరేళ్ల వయసులో ఉండేవారు.

సుకన్య, ఇద్దరు మనవళ్లు జుబిన్, మోహన్, అనౌష్క అంతా కలిసి లండన్‌లో ఉంటున్నప్పటికీ తరచు లండన్–ఢిల్లీ–కోల్‌కతా మధ్య ప్రయాణాలు సాగిస్తుంటారు. అనౌష్క భర్త జో రైట్ ఆమె జీవితంలో ఒక తెగిపోయిన తీగ. బ్రిటిష్ డైరెక్టర్ ఆయన. రెండేళ్ల క్రితమే విడిపోయారు. రవిశంకర్, స్యూ జోన్స్‌ల కుమార్తె నోరా జోన్స్ యు.ఎస్.లో ఉంటున్నారు.

''పండిట్ రవిశంకర్ జీవించి ఉంటే ఈ కరోనా పరిస్థితులకు ఎలా స్పందించి ఉండేవారు'' అనే ప్రశ్నకు సుకన్య చెప్పిన సమాధానంలో కూడా ఆమె హృదయంలో ఆయనకెంత ఘనమైన స్థానం ఉందో వెల్లడించే విధంగా ఉంది. ''ప్రతిదీ జీవితంలో భాగమే. ఇదీ ఎన్నాళ్లో ఉండదు. సాగిపోతుంది అనేవారు నవ్వేస్తూ'' అన్నారు సుకన్య ఒక ఇంటర్వ్యూలో.

### నేడు వరల్డ్ హెల్త్ డే

# కరోనా నేపథ్యంలో లంగ్స్ జాగ్రత్త

**ఈ**రోజు ప్రపంచ ఆరోగ్య దినం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఏప్రిల్ 7న దీన్ని నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది నిర్దేశించుకున్న ఉద్దేశం/ నినాదం (స్లోగన్) 'అందరికీ ఆరోగ్యం'.

అయితే ఈ ఏడాది 'ప్రపంచ ఆరోగ్య దినం' వచ్చిన సమయంలో లోకమంతా కరోనా వైరస్ గుప్పెట్లో విలవిలలాడుతోంది. ఈ వైరస్ కారణంగా వచ్చే 'కోవిడ్–19' వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులను లక్ష్యంగా చేసుకుంటుంది. అందుకే ప్రస్తుతం ఉన్న తరుణంలో ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం.

**మీకు తెలుసా?**

ప్రతి ఏడాదీ... ప్రతి ఒక్కరికీ ఊపిరితిత్తుల సామర్థ్యం ఎంతో కొంత తగ్గుతూ పోతుంటుంది. దాంతో ఆక్సిజన్ అందే సామర్థ్యం కూడా తగ్గుతుంది. దీన్ని నివారించాలంటే మనం క్రమం తప్పకుండా శ్వాసవ్యాయామాలు (బ్రీతింగ్ ఎక్సర్‌సైజెస్) చేస్తూ ఉండాలి.

**ఇలాంటి వృత్తుల్లో ఉన్నవారు జరభద్రం...**

- గొర్రెల పెంపకం అన్నది కూడా చాలామందికి ఓ జీవనోపాధి. అయితే గొర్రెల మంద మీదుగా వచ్చే గాలిలో కూడా 'కాక్సియల్లా' అనే సూక్ష్మజీవులు ఉంటాయి. వీటివల్ల ఇంకో రకం నిమోనియా వస్తుంది. అందుకే వీటి నుంచీ జాగ్రత్తగా ఉండాలి. దీనికి ఒక మార్గం ఉంది. గొర్రెల మీదుగా వచ్చే గాలి ఒకరకమైన వాసనతో మన ముక్కుపుటాలకు తాకుతుంది. ఆ వాసన తగలనంతటి దూరంలో మనం ఉండటం మేలు.
- ఇక మన సమాజంలో కోళ్లు, బాతుల వంటి వాటిని పెంచేవారు చాలామందే ఉంటారు. ఆ పక్షుల మీదుగా వచ్చే గాలిలోని 'క్లెమీడియా' అనే సూక్ష్మజీవుల వల్ల ఒక రకం నిమోనియా వస్తుంది. అందుకే ఆ పక్షులను పెంచేవారు వాటిని మీ నివాసాల నుంచి దూరంగా ఉంచేలా జాగ్రత్త పడండి.
- **పావురాలు, అవి వేసే రెట్టల వల్ల ఆస్పర్జిల్లస్, క్రిప్టోకోకస్ అనే సూక్ష్మజీవుల వల్ల వ్యాప్తి చెంది ఊపిరితిత్తులకు సంబంధించిన ఇన్ఫెక్షన్స్ వచ్చే ఆస్కారం ఉంది. షుగర్ లేదా ఇతర ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారిలో ఇలాంటి ఇన్ఫెక్షన్లు మరింత ప్రమాదకరంగా పరిణమించే అవకాశం ఉంది. వీటిని కనుగొనడం, చికిత్స... ఈ రెండూ కష్టమైన, ఖరీదైన విషయాలే. కాబట్టి వాటిని నివాస ప్రాంతాలకు దూరంగా ఉంచాలి. కొందరు వాటికి దాణా తినిపించడం మంచి విషయంగా భావిస్తుంటారు. కానీ వాటిని నివాస ప్రాంతాలకు దూరంగా ఉంచాలన్నది గుర్తుంచుకోండి. మరీ ముఖ్యంగా క్వారంటైన్ ప్రదేశాలు, హాస్పిటల్స్ వంటి వైద్య/చికిత్సా కేంద్రాలకు దూరంగా ఉంచేలా జాగ్రత్త తీసుకోవాలి.**
- పిల్లులూ లేదా ఇతర పెంపుడు జంతువులు కూడా మీనుంచి దూరంగా ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి. వాటి సాధారణ ప్రవర్తనలో ఏమాత్రం మార్పు కనిపించినా వెంటనే వాటిని వెటర్నరీ డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లండి.



- ఇక పట్టణాల్లో... ఆ మాటకొస్తే కొన్ని పల్లెల్లో కూడా చాలాకాలం వాడని ఏసీలు, కూలర్లలో 'లెజినెల్లా' అనే సూక్ష్మజీవులు పెరిగి, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌కు దారితీస్తాయి. ఇలాంటి ఇన్ఫెక్షన్లు ముదిరితే, దీర్ఘకాలంలో క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మునరీ డిసీజ్ (సీఓపీడీ)కి దారితీసే అవకాశాలూ ఉంటాయి. చాలాకాలం వాడకుండా ఉన్న కూలర్‌ను బయటకు తీసినప్పుడు కాసేపు ఆరుబయట దాన్ని ఆన్‌చేసి ఉంచి, ఆ తర్వాతే వాడాలి. ఏసీలు వాడేవారు వాటి తగిన సమయంలో వాటి ఫిల్టర్లను మార్చి వాడాలి.
- ఇళ్లలోకి గాలి వెలుతురు ధారాళంగా వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలి. చాలాకాలం మూసి ఉంచిన గదుల్లోకి వెళ్లేటప్పుడు ముక్కుకు గుడ్డ కట్టుకుని వెళ్లడం మంచిది.
- లిఫ్ట్ వంటి క్లోజ్‌డ్ ప్రదేశాల్లో తుమ్మడం, దగ్గడం వంటివి చేసేటప్పుడు ముక్కు దగ్గర టిష్యూ లేదా కర్చీఫ్ అడ్డు పెట్టుకోవాలి. ఆ టిష్యూను ఇక మళ్లీ వాడకుండా పారేయాలి. కర్చీఫ్‌ను ఉతికాకే మళ్లీ వాడుకోవాలి. టిష్యూ, కర్చీఫ్ లేకపోతే మోచేతి మడతలో తుమ్మడం/దగ్గడం చేయాలన్నది ఇటీవలి సూచనల వల్ల మీకు తెలిసిన విషయమే.
- పొగతాగే అలవాటుంటే, తక్షణమే మానేయాలి. పొగతాగే వారంతా ఈ 21 రోజుల లాక్‌డౌన్ సందర్భంగా తమ అలవాటు మానుకోగలిగితే ప్రపంచవ్యాప్తంగా ఏటా పదిలక్షల మరణాలను నివారించవచ్చు.

ప్రపంచ ఆరోగ్య దినం సందర్భంగా లంగ్స్ ఆరోగ్యం కోసం ఈ సూచనలు పాటించండి.



**డాక్టర్ మహబూబ్ ఖాన్**
సూపరింటెండెంట్, ప్రొఫెసర్ & హెచ్ఓడి
పల్మునరీ మెడిసిన్,
ఉస్మానియా మెడికల్ కాలేజి అండ్
గవర్నమెంట్ జనరల్ & చెస్ట్ హాస్పిటల్,
ఎర్రగడ్డ, హైదరాబాద్

### సాగుబడి

# ఈ వేసవికి ఇన్‌స్టంట్ గడ్డి

- **తక్కువ నీటితో వారంలో మొలక గడ్డి సిద్ధం**
- **మొక్కజొన్నలతో షేడ్ నెట్ కింద సాగు**

ఉష్ణోగ్రత రోజురోజుకు పెరుగుతుంటే పచ్చిమేత కరువై పాల ఉత్పత్తి తగ్గుతుంది. ఈ పరిస్థితుల్లో ఏడు రోజుల్లో ఇళ్లలోనే/షేడ్ నెట్ కింద మొక్కజొన్న గడ్డిని పెంచుకోవచ్చు అంటున్నారు డాక్టర్ ధనలక్ష్మి. కర్నూలు జిల్లా యాగంటిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధాన శాస్త్రవేత్తగా సేవలందిస్తున్న ఆమె తక్కువ ఖర్చుతో, ఇంటి పట్టునే 7 రోజుల్లో పశుగ్రాసాన్ని సాగు చేసే విధానాన్ని విస్తృతంగా రైతుల్లోకి తీసుకెళ్తున్నారు.

మట్టి లేకుండా, ఎటువంటి రసాయనిక/ సేంద్రియ ఎరువులు/ పురుగుమందుల అవసరం లేకుండా కేవలం నీటి చిలకరింపుతో ట్రేలలో మొక్కలను పెంచడమే మొలకగడ్డి సాగు. తక్కువ స్థలం, తక్కువ నీటి వినియోగంతో సంవత్సరం పొడవునా కేవలం మొలకగడ్డిని పెంచవచ్చు.

10 వేల చ.మీ. భూమిలో 45–60 రోజుల్లో పెరిగే పశుగ్రాసాన్ని ఈ పద్ధతిలో 50 చ.మీ. స్థలంలో షేడ్‌నెట్ కింద ట్రేలలో వారం రోజుల్లో పెంచవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో చౌకగా లభించే మొక్కజొన్న గింజలను మొలక గడ్డి కోసం వినియోగించుకోవటం మేలు. ప్రతి కిలో గింజల నుండి ఎనిమిది కిలోల గడ్డి పొందవచ్చు.

పది పశువులకు సరిపడా గడ్డిని పెంచడానికి 15 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పులో షేడ్ నెట్ హౌస్ నిర్మించుకోవాలి. 90 శాతం ఎండను అడ్డుకునే షేడ్ నెట్‌ను ఉపయోగించాలి.

3 అడుగుల పొడవు, 1.5 అడుగుల వెడల్పు ఉన్న ట్రేలో ఒకటిన్నర కిలోల మొలక కట్టిన విత్తనాలను వేస్తే 12 కిలోల మొలక గడ్డి పొందవచ్చు. 5 రోజుల్లో మొలక గడ్డి 30 సెంటీ మీటర్లు (అడుగు) ఎత్తు పెరుగుతుంది.

ఒక్క శాతం క్లోరిన్ ద్రావణంలో మొక్కజొన్న విత్తనాలను 12 గంటల పాటు నానబెట్టాలి. నానిన గింజలను గుడ్డలో కట్టి 24 నుంచి 36 గంటల పాటు ఉంచాలి. మొలకెత్తించిన గింజలను ఖాళీ ట్రేలలో పోసి, ట్రేలను షేడ్ నెట్‌లోని అరలపై ఉంచాలి.

సన్నని నీటి తుంపర్లను వెద జల్లే మిస్టర్లు లేదా ఫాగర్ల ద్వారా సమయానుసారం తడిని అందిస్తూ మొలక ఎండిపోకుండా చూడాలి. ఇందుకోసం 0.5 హెచ్‌పి మోటరుకు టైమర్‌ను కూడా అమర్చుకోవచ్చు. ఆరో రోజున ఈ గ్రాసాన్ని వేర్లతో పాటు తీసి పశువులకు మేపవచ్చు.

ఒక కిలో విత్తనంతో 7 రోజుల్లో మొలక గడ్డిని పెంచడానికి 3 లీటర్ల నీరు సరిపోతుంది. నీటిలో ఎటువంటి కృత్రిమ పోషకాలను కలపనవసరం లేదు. విత్తనాల్లో స్వతహాగా ఉండే పోషకాలే మొక్క పెరుగుదలకు సరిపోతుంది.

5 లీటర్ల కంటే తక్కువ పాలిచ్చే పశువుకు ఒక ట్రే, 5 లీటర్ల కంటే ఎక్కువ పాలిచ్చే పశువులకు రెండు ట్రేల వరకు మేపవచ్చు. రెండు ట్రేలకు మించి మొలక గడ్డి మేపకూడదు. మొలక గడ్డితో పాటు ఎండు గడ్డిని తప్పని సరిగా కలిపి పశువులకు మేపాలి. అపుడే పశువుకు కావాల్సిన పీచు పదార్థం లభిస్తుంది. ట్రే ఖరీదు సుమారు రూ.400 వరకు ఉంటుంది. నిరంతరాయంగా మొలక గడ్డి పొందడానికి ఒక పశువుకు 5 ట్రేలు అవసరమవుతాయి. పాడి రైతులకు వేసవిలో మొలక గడ్డి సాగు చాలా ఉపయోగకరం. చాలా సులభం కూడా అంటున్నారు డా. ధనలక్ష్మి (94406 07424).



వాడకానికి సిద్ధమైన మొలకగడ్డి

– గవిని శ్రీనివాసులు, సాక్షి, కర్నూలు (అగ్రి)

### కరోనాపై పోరాడే

# శక్తి కషాయాలు

**మ**న చుట్టూ ఉండే ఔషధ మొక్కల ఆకులతో కషాయాలు తాగుతూ సిరిధాన్యాలు ప్రధాన ఆహారంగా తింటూ ఉంటే.. కరోనా వైరస్ వల్ల గాని, మరే ఇతర వైరస్‌ల వల్ల గాని సాంక్రమిక వ్యాధులు సోకుతాయన్న భయం లేకుండా మనుషులు జీవించవచ్చని స్వతంత్ర శాస్త్రవేత్త, ఆహార, ఆరోగ్య నిపుణులు డాక్టర్ ఖాదర్ వలి చెబుతున్నారు. కరోనా వైరస్ నుంచి రక్షణకు రోగనిరోధక శక్తి పెరగాలంటే ఈ కింద పేర్కొన్న ఏడు రకాల ఔషధ మొక్కల ఆకులతో తయారు చేసిన కషాయం ఉదయం పరగడుపున, సాయంత్రం ఖాళీ కడుపున 14 రోజుల పాటు తాగాలని ఆయన సూచిస్తున్నారు. ఒక్కో రకం ఆకుతో రెండేసి రోజులు కషాయం తాగాలి.

1. **గరిక** (CYNADON DACTYLON)
2. **తులసి** (OCIMUM SANCTUM)
3. **తిప్పతీగ** (TINOSPORA CORDIFOLIA)
4. **బిల్వం** (AEGLE MARMELOS)
5. **కానుగ** (PONGAMIA PINNATA)
6. **వేప** (AZADIRACHTA INDICA)
7. **రావి** (FICUS RELIGIOSA)

గుప్పిటలో సరిపోయే అన్ని ఆకులను తీసుకొని గ్లాసుడు నీటిలో కేవలం 5 నిమిషాలు ఉడికించి, కాస్త బెల్లం లేదా తాటి బెల్లం కలుపుకొని గోరు వేచ్చగ గాని, చల్లారిన తర్వాత గాని తాగాలి. పైన పేర్కొన్న వరుసలోనే ఆయా కషాయాలను రెండేసి రోజుల చొప్పున తాగితే రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని ఆయన తెలిపారు. అవసరం అనుకుంటే మరో విడత 14 రోజుల పాటు ఈ 7 కషాయాలు తాగితే మంచిది.




కరోనా వైరస్ సోకకుండా ఉండాలంటే.. రుస్టాక్స్–200, బ్రయోనియా–200 హోమియో పిల్స్‌ను మూడేసి చొప్పున తీసుకొని అరకప్పు నీటిలో కలుపుకొని ఉదయం, సాయంత్రం మూడు రోజులు తాగితే రోగనిరోధక శక్తి వస్తుందని తెలిపారు.

ఒకవేళ కరోనా సోకితే రోగం వచ్చిన తర్వాత తిప్పతీగ, తులసి, పారిజాతం కషాయాలను రోజుకు రెండు సార్లు తాగాలి. కరోనా సోకితే ఆర్సెనిక్ ఆల్బం, ఫాస్ఫరస్, బ్రయోనియా మందులు పనిచేస్తాయి. దగ్గరలోని హోమియో వైద్యుడ్ని సంప్రదించి మీకు ఏ మందు తగినదో నిర్ణయించుకొని వాడుకోవాలని డా.ఖాదర్ వలి సూచించారు.

'ముఖ్యంగా ఈ రోగాలు మాంసాహారులకు రోగనిరోధక శక్తి దేహంలో తక్కువ ఉండటం వల్ల వస్తూ ఉన్నాయి. ప్రస్తుతం మన అదృష్టం కొద్దీ ప్రపంచంలో ఉన్న దేశాల్లో కంటే మన దేశం ఇంకా శాకాహార దేశమే అని చెప్పుకోవాలి. కానీ, ప్రస్తుతం ఆధునిక ఆహార పద్ధతుల్లో మనకు తెలియకుండానే మాంసాహార పదార్థాలు శాకాహారుల ఇళ్లలోకి కూడా ఆహారంలోకి వచ్చేస్తున్నాయి. అందువల్ల పూర్తిగా మనం 'సిరి'జీవన విధానాన్ని మన జీవనక్రమంలోకి తెచ్చుకుంటే, శాకాహారులుగా ఉంటే, ఏ వైరాణువుల నుంచి వచ్చే సాంక్రమిక రోగానికీ భయపడాల్సిన అవసరం లేనేలేదు. కాబట్టి, మనందరం శాకాహారులుగా మారదాం. నిర్భీతిగా బతుకుదాం అంటున్నారు డా. ఖాదర్ వలి.

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం
7-4-2020

## కరోనాపై పోరాటానికి పుల్లెల గోపీచంద్ విరాళం రూ. 26 లక్షలు



సాక్షి, హైదరాబాద్: భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ కరోనా మహమ్మారిపై పోరాటానికి తనవంతుగా చేయూతనిచ్చారు. ఈ వైరస్ కట్టడి నియంత్రణ చర్యల్లో భాగంగా మొత్తం రూ. 26 లక్షలు గోపీచంద్ విరాళంగా ఇచ్చారు. ఇందులో రూ. 11 లక్షలు ప్రధానమంత్రి సహాయనిధికి... రూ. 10 లక్షలు తెలంగాణ సీఎం సహాయనిధికి... రూ. 5 లక్షలు ఆంధ్రప్రదేశ్ సీఎం సహాయనిధికి ఆయన ప్రకటించారు. పీఎం-కేర్స్ ఫండ్‌కు తాను కూడా విరాళం ఇచ్చినట్టు భారత బ్యాడ్మింటన్ స్టార్ కిడాంబి శ్రీకాంత్ ప్రకటించినా... ఎంత మొత్తం అనేది వెల్లడించలేదు. మరోవైపు 23 సార్లు వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన భారత స్టార్ స్నూకర్, బిలియర్డ్స్ చాంపియన్ రూ. 5 లక్షలను పీఎం-కేర్స్ ఫండ్‌కు విరాళం ఇచ్చాడు.

# చిన్న లక్ష్యాలు పెట్టుకోను

- ‘టోక్యో’ పతకమే లక్ష్యంగా శ్రమిస్తున్నా
- విదేశీ రెజ్లర్లను మట్టి కరిపించడంపైనే నా దృష్టి
- నర్సింగ్ యాదవ్‌ను స్వాగతిస్తున్నా
- భారత దిగ్గజ రెజ్లర్ సుశీల్ కుమార్



**న్యూఢిల్లీ:** అనూహ్య పరిస్థితుల్లో టోక్యో ఒలింపిక్స్ వాయిదా పడటం కారణంగా మేలు పొందిన వారిలో భారత దిగ్గజ రెజ్లర్ సుశీల్ కుమార్ ఒకడు. వ్యక్తిగత విభాగంలో రెండు ఒలింపిక్ పతకాలు గెలుపొందిన ఏకైక భారత క్రీడాకారుడిగా చరిత్ర సృష్టించిన సుశీల్... ఈ విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకునే పనిలో పడ్డాడు. తాను బరిలో దిగే 74 కేజీల వెయిట్ కేటగిరీలో ఒలింపిక్ బెర్త్ కోసం తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ, తన పనైపోయిందంటూ పలువురు విమర్శలు చేస్తున్నప్పటికీ అవేమీ తనను ప్రభావితం చేయలేవంటున్నాడు. టోక్యో పతకమే లక్ష్యంగా సాధన చేస్తున్నానన్న సుశీల్ మనోగతం అతని మాటల్లోనే...

**వారికి అలవాటే...**

చాలా కాలం నుంచి నా గురించి ఎవరికి తోచింది వారు రాయడం అందరికి అలవాటైపోయింది. కానీ వారి రాతలు, అభిప్రాయాలు నాపై ప్రభావం చూపలేవు. 2011లోనే సుశీల్ పనైపోయిందని అన్నారు. కానీ 2008 బీజింగ్‌లో గెల్చిన కాంస్య పతకాన్ని లండన్ 2012 ఒలింపిక్స్‌లో రజతంగా మార్చాను. ఈ వ్యాఖ్యల్ని ఎలా ఎదుర్కోవాలో తెలుసు. ఇది నాకు రోజువారీ కార్యక్రమం అయిపోయింది.

**సన్నద్ధతకు ఇదే సమయం...**

మరో నెల రోజుల్లో నేను 37వ పడిలో అడుగుపెడతా. అయితేనేం... నేను రెజ్లింగ్‌ను వదిలి వెళ్లే ప్రసక్తే లేదు. ఒలింపిక్ బెర్తు సంపాదించేందుకు ప్రస్తుతం నాకు మంచి సమయం లభించింది. దీన్ని నేను టోక్యో సన్నద్ధత కోసం వినియోగించుకుంటా.

**గాయాల బారిన పడకూడదు...**

రెజ్లింగ్ క్రీడలో గాయాల బారిన పడకుండా, మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకొని నిరంతరం ప్రాక్టీస్ చేస్తూ ఉంటే చాలు. మనం అనుకున్నది సాధించవచ్చు. నేను ఇప్పటికీ రోజులో రెండుసార్లు ప్రాక్టీస్ చేస్తున్నా. మ్యాచ్ ఫిట్‌నెస్‌తో ఉండేందుకు ప్రయత్నిస్తున్నా. దేవుని దయతో టోక్యో ఒలింపిక్స్‌కు కూడా అర్హత సాధిస్తాననే నమ్మకముంది.

**నర్సింగ్‌కు అభినందనలు...**

డోపింగ్‌లో పట్టుబడి నాలుగేళ్ల నిషేధం తర్వాత తిరిగి జూలైలో బరిలో దిగనున్న నర్సింగ్ యాదవ్‌కు అభినందనలు. పునరాగమనం అతనికి అత్యుత్తమంగా ఉండాలని కోరుకుంటున్నా. నర్సింగ్‌తో పోటీ గురించి ఇప్పుడే ఏం మాట్లాడలేను. సమయం వచ్చినప్పుడు దాని గురించి చూద్దాం. రియో ఒలింపిక్స్‌కు నర్సింగ్ కారణంగానే సుశీల్ దూరమైన సంగతి తెలిసిందే.

**విదేశీ రెజ్లర్లే నా ప్రత్యర్థులు...**

చిన్న లక్ష్యాలు పెట్టుకుంటే మనం ఏదీ సాధించలేం. జితేందర్ కుమార్, నర్సింగ్ యాదవ్‌లు కాదు... ఉజ్బెకిస్తాన్ రెజ్లర్, ఆసియా క్రీడల స్వర్ణపతక విజేత బెక్‌జోడ్ అబ్దురఖ్‌మోనోవ్ లాంటి ప్రత్యర్థులను ఎలా ఎదుర్కోవాలో అనే అంశంపై దృష్టి సారించా. నా సన్నాహాలు మేటి రెజ్లర్లను ఎదుర్కొనేలా సాగుతున్నాయి.

# నా శైలిని మార్చుకోను

- భారత బ్యాటర్ షఫాలీ వర్మ మనోగతం
- సవాళ్లకు సిద్ధమంటున్న హరియాణా టీనేజర్
- జట్టు గెలిస్తేనే గుర్తింపు లభిస్తుందన్న ఓపెనర్

సాక్షి క్రీడా విభాగం

**టి**20 ప్రపంచకప్‌లో షఫాలీ వర్మ 5 ఇన్నింగ్స్‌లలో కలిపి 158.25 స్ట్రయిక్ రేట్‌తో 163 పరుగులు చేసింది. ఫైనల్లో షఫాలీ వైఫల్యం భారత జట్టు తుది ఫలితంపై బలంగా పడిందంటే టోర్నీలో ఆమె ప్రభావం ఎంతో అర్థం చేసుకోవచ్చు. గత ఏడాది ఐపీఎల్ సమయంలో జరిగిన ఉమెన్ చాంపియన్స్ టి20 టోర్నీతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న షఫాలీ ఏడాది తిరిగేలోగా భారత జట్టులో కీలక సభ్యురాలిగా ఎదిగింది. రాబోయే రోజుల్లోనూ తన సత్తా చాటాలని ఉత్సాహంగా ఉన్న షఫాలీ తన కెరీర్‌కు సంబంధించి వివిధ అంశాలపై మాట్లాడింది. విశేషాలు ఆమె మాటల్లోనే....

**ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌పై...**

నా ప్రయాణం ఇప్పుడే మొదలైంది. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్ ర్యాంక్ దాకా చేరడం సంతోషకరమే అయినా ముమ్ముందు కఠిన పరీక్షా సమయం ఉంది. అయితే నాకు ఎదురయ్యే ఎలాంటి సవాల్‌కైనా సిద్ధంగా ఉన్నా. రాబోయే రోజుల్లో భారత జట్టు ఎక్కువ మ్యాచ్‌లు గెలిచేలా ప్రయత్నించడం, వాటిలో నేనూ కీలక పాత్ర పోషించడమే ప్రస్తుతానికి నా దృష్టిలో లక్ష్యాలు.

**వరల్డ్‌కప్ ఫైనల్ ఫలితంపై...**

ఆ రోజు మాకు కలిసి రాలేదు. క్రీడల్లో గెలుపోటములు సహజమే. మేం ఒడిసిపట్టుకొని విజయాన్ని అందుకొనే మరిన్ని అవకాశాలు ముమ్ముందు వస్తాయి. ఫలితం వచ్చేశాక దానిని మనం మార్చలేం కానీ భవిష్యత్‌లో ఏం చేయాలో మా చేతుల్లోనే ఉంది.

**తన వ్యక్తిగత ప్రదర్శనపై...**

క్రీజ్‌లోకి అడుగు పెట్టాక వీలైనన్ని ఎక్కువ పరుగులు చేసి భారత జట్టును మెరుగైన స్థితిలో నిలపడమే నా బాధ్యత. ఎందరో ప్రముఖులు నా ప్రదర్శనను ప్రశంసించినప్పుడు గర్వంగా అనిపిస్తుంది. అయితే ట్రోఫీ గెలిచి ఉంటే ఇది మరింత అద్భుతంగా ఉండేది.

**జట్టులో వాతావరణంపై...**

చాలా బాగుంటుంది. సీనియర్లే మాట్లాడాలని, జూనియర్లు వారు చెప్పింది వినాలని అస్సలు ఉండదు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్, స్మృతిలాంటి సీనియర్లయితే నన్ను మరింతగా ప్రోత్సహిస్తూ వచ్చారు. ఇక డబ్ల్యూవీ రామన్ సర్ రూపంలో అద్భుతమైన కోచ్ మాకు ఉన్నారు. ఎలాంటి సమస్య గురించి చెప్పినా ఆయన దగ్గర పరిష్కారం ఉంటుంది. తన మార్గనిర్దేశనంతో మనలో ఎనలేని ఆత్మవిశ్వాసం నింపగలరు.

**స్మృతితో ఓపెనింగ్‌పై...**

మేం అతిగా ఆలోచించం. ఇద్దరం సహజసిద్ధమైన ఆటనే ఆడేందుకు ప్రయత్నిస్తాం. కాస్త తేలికైన బంతి పడిందంటే చాలు చితక్కొట్టడమే. దానిపై మరో ఆలోచన లేదు. ఈ విషయంలో ఇద్దరం ఒకే తరహాలో ఆలోచిస్తాం. ఇక మంచి బంతులు వస్తే సింగిల్స్‌పై దృష్టి పెడతాం. సహజసిద్ధమైన ఆటను ఆడటంలో ఉండే సౌకర్యం మరోదాంట్లో రాదు. దానిని మార్చాలని ప్రయత్నిస్తే అది పని చేయదని నా నమ్మకం.

**కరోనాతో వచ్చిన విరామంపై...**

నా ఫిట్‌నెస్‌ను మెరుగుపర్చుకోవడంపై దృష్టి పెట్టాను. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రతికూల ఆలోచనలు రాకుండా ఉండటం కూడా ఎంతో కీలకం. దీనికి సంబంధించి స్పోర్ట్స్ సైకాలజిస్ట్ నాకు ఎంతో సహకరిస్తున్నారు. ఇక ఒక స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ కంపెనీతో ఒప్పందం కుదరడం వల్ల ఆర్థికపరంగా నేను ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఉండగలుగుతున్నా. ఎన్నో కష్టాలకోర్చి నేను ఈ స్థాయికి చేరడానికి కారణమైన మా నాన్నపై కూడా ఇప్పుడు ఆ భారం తగ్గింది.



మహిళల టి20 ప్రపంచకప్‌లో ఫైనల్ చేరడం కాకుండా ఈ టోర్నీ ద్వారా భారత జట్టుకు జరిగిన మరో మేలు ఒక సంచలన బ్యాటర్ వెలుగులోకి రావడం. 16 ఏళ్ల వయసులోనే దాదాపుగా ప్రపంచకప్‌ను గెలిపించాల్సిన పెను భారాన్ని ఆ అమ్మాయి మోసింది. దురదృష్టవశాత్తూ టైటిల్ నెగ్గకపోయినా మన మహిళల క్రికెట్ భవిష్యత్ భద్రంగా ఉందన్న ధైర్యం కలిగిందంటే ఆమె ఇచ్చిన ప్రదర్శనే కారణం. ఇదంతా హరియాణా టీనేజర్ షఫాలీ వర్మ గురించే. తన దూకుడైన ఆటతో అందరి దృష్టినీ ఆకర్షించిన ఆమె కూడా ముమ్ముందు మరింతగా దూసుకుపోవాలని పట్టుదలగా ఉంది.

# శ్రేయస్ టీనేజ్‌లో జరిగింది ఇది!



**న్యూఢిల్లీ:** టీనేజ్‌లో శ్రేయస్ అయ్యర్ ఆట ఆటకెక్కుతుంటే అతని తండ్రి పసిగట్టేశారు. అతన్ని ఓ మేటి ఆటగాడిగా చూడాలనుకున్న తండ్రి సంతోష్ అయ్యర్ వెంటనే కుమారుడిని గాడినపెట్టే పనిలో పడ్డారు. ఈ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు. ‘శ్రేయస్ 4 ఏళ్ల వయసులోనే బంతిని చక్కగా బాదేవాడు. అది చూసిన నాకు వాడి బ్యాటింగ్ ప్రతిభ అర్థమైంది. అందుకే వాణ్ని ఆ దిశగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నాం. అయితే అండర్–16 క్రికెట్ ఆడే రోజుల్లో అతని బ్యాటింగ్ గతి తప్పింది. దీన్ని ఓ కోచ్ గమనించి నా చెవిన వేశాడు. మీ అబ్బాయికి ప్రతిభ ఉంది కానీ... ఏకాగ్రతే లేకుండా పోతోంది. ఆటపై ఏమాత్రం దృష్టి సారించలేకపోతున్నాడని చెప్పాడు. నేను ఆలస్యం చేయకుండా సైకాలజిస్ట్ దగ్గరికి తీసుకెళ్లాక అంతా సర్దుకుంది’ అని సంతోష్ అయ్యర్ తెలిపారు. అప్పట్లో తన కుమారుడు ప్రేమ మాయలో పడ్డాడో లేక సహచర దోషమోనని బెంగపట్టుకుందని చెప్పుకొచ్చారు. ఇప్పుడు శ్రేయస్ బ్యాటింగ్ ఆర్డర్‌లో నాలుగో స్థానం ప్రశ్నార్థకానికి సమాధానంగా నిలిచాడు. 18 వన్డేల్లో 748 పరుగులు చేశాడు. ఇందులో ఓ సెంచరీ, 8 అర్ధసెంచరీలున్నాయి.

# జూలై వరకు బ్యాడ్మింటన్ టోర్నీల్లేవు: బీడబ్ల్యూఎఫ్

**న్యూఢిల్లీ:** ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్ ఉత్పాతం కొనసాగుతుండటంతో... జూలై వరకు అంతర్జాతీయ టోర్నమెంట్‌లను రద్దు చేస్తున్నట్లు ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ప్రకటించింది. టోర్నీ ఆతిథ్య సంఘాలతో, ఆయా దేశాల సమాఖ్యలతో చర్చించాకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీడబ్ల్యూఎఫ్ తెలిపింది. రద్దయిన టోర్నీల్లో ఆస్ట్రేలియన్ ఓపెన్ (జూన్ 2–7), థాయ్‌లాండ్ ఓపెన్ (జూన్ 9–14), ఇండోనేసియా ఓపెన్ (జూన్ 16–21), రష్యా ఓపెన్ (జూలై 7–12) ఉన్నాయి.

**షూటింగ్ వరల్డ్‌కప్‌లు కూడా...**

మరోవైపు మే నెలలో భారత్‌లో జరగాల్సిన రెండు ప్రపంచకప్ టోర్నమెంట్‌లను... మ్యూనిచ్, బాకు నగరాల్లో జూన్‌లో జరగాల్సిన రెండు ప్రపంచకప్ టోర్నమెంట్‌లను రద్దు చేస్తున్నట్లు అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య తెలిపింది.

# చైనా ఫుట్‌బాల్ టీమ్‌కు నెగెటివ్

**బీజింగ్:** చైనా ఫుట్‌బాల్ జట్టు ఊపిరిపీల్చుకుంది. 14 రోజుల స్వీయ నిర్బంధం అనంతరం జట్టులోని 25 మందికి సోమవారం నిర్వహించిన కరోనా పరీక్షల్లో అందరికీ నెగెటివ్ ఫలితాలు రావడంతో ఆ జట్టుకు ఊరట లభించింది. దుబాయ్‌లో నిర్వహించిన శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఆ జట్టు... గత నెల 23న తిరిగి తమ దేశానికి చేరుకుంది. అయితే కరోనా నేపథ్యంలో వారు వెంటనే ఒక హోటల్‌లో రెండు వారాల పాటు స్వీయ నిర్బంధంలోకి వెళ్లారు.

## కరోనా విరాళం







**కృష్ణంరాజు, శ్యామలా దేవి** – 10 లక్షలు (‘పీయం కేర్స్’కు)
(శ్యామలా దేవి పుట్టినరోజు ఏప్రిల్ 13న. ఈ సందర్భంగా 4 లక్షలు విరాళం ప్రకటించారు. అలాగే కృష్ణం రాజు, శ్యామల కుమార్తెలు సాయి ప్రసీద, సాయి ప్రకీర్తి, సాయి ప్రదీప్తి తమ పాకెట్ మనీ నుంచి తలా రెండు లక్షలు తీసి 6 లక్షలను విరాళంగా ప్రకటించారు.)





**కె.కె. రాధా మోహన్** – 3 లక్షలు (సీసీసీ మనకోసం)

**వీకే నరేష్** – 11 లక్షలు (‘సీసీసీ మనకోసం’కి 1 లక్ష, ‘మా’లో 100 మంది సభ్యులను దత్తత తీసుకుని ఒక్కో సభ్యుని కుటుంబానికి 10 వేలు సాయం. ఇప్పటికే 58 కుటుంబాలకు వారి వారి బ్యాంకు ఖాతాలో 10 వేలు చొప్పున డిపాజిట్ చేశారు).

**ఆదిత్య మ్యూజిక్ అధినేతలు ఉమేశ్ గుప్త, సుభాష్ గుప్త, దినేశ్ గుప్త, ఆదిత్య గుప్తలు కరోనాపై యుద్ధానికి** – 31 లక్షలు విరాళం



● రకుల్‌ప్రీత్ సింగ్



● అమితాబ్



● రజనీ



● చిరంజీవి



● మమ్ముట్టి

# రజనీ.. చిరంజీవి.. ఓ ‘ఫ్యామిలీ’!

## కార్మికులకు అమితాబ్ సాయం

**క**రోనా మహమ్మారి నుంచి కాపాడుకోవడానికి ఇంటి పట్టునే ఉండిపోయిన ‘ఫ్యామిలీ’ల కోసం ‘ఫ్యామిలీ’ అనే షార్ట్‌ఫిల్మ్ నిర్మిస్తున్నారు. ఈ సమయంలో కుటుంబాలను ఉత్సాహపరచడానికి, వారికి అవసరమైన సూచనలు ఇవ్వడానికి ఈ షార్ట్‌ఫిల్మ్ ఉపయోగపడనుంది. అమితాబ్ ప్రోద్బలంతో సోనీ నెట్‌వర్క్ సహాయంతో ఈ షార్ట్‌ఫిల్మ్ తయారవుతోంది. ప్రసిద్ధ యాడ్ డైరెక్టర్ ప్రసూన్ పాండే వర్చువల్‌గా దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ షార్ట్‌ఫిల్మ్ కుటుంబాలకు ఐదు విషయాలను చెప్పనుంది. ‘ఇంట్లో ఉండండి’, ‘సురక్షితంగా ఉండండి’, ‘చేతులు కడుక్కోండి’, ‘ఇంటి నుంచి పని చేయండి’, ‘భౌతిక దూరం పాటించండి’... అని సృజనాత్మకంగా చెప్పనుంది. భారతీయులందరినీ ఉత్సాహపరచాలి కనుక ఈ షార్ట్‌ఫిల్మ్‌లో భారీ తారాగణం లిప్తపాటు కనిపిస్తారట. వారిలో రజనీకాంత్, చిరంజీవి, మమ్ముట్టి, మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్, ప్రియాంకా చోప్రా, ఆలియా భట్, రణ్‌బీర్ కపూర్ తదితరులు ఉంటారు. ఏప్రిల్ 6న రాత్రి 9 గంటలకు ఈ షార్ట్‌ఫిల్మ్ దేశమంతా ప్రముఖ చానెళ్లలో ప్రసారం కానుంది. ఈ షార్ట్‌ఫిల్మ్ గురించే కాక దేశంలో ఉన్న ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీలో పని చేస్తున్న చిన్న స్థాయి కార్మికులు లక్షమందికి సోనీ నెట్‌వర్క్, కల్యాణ్ జువెలర్స్‌తో కలిసి అమితాబ్ ఒక నెల వెచ్చాలను అందించనున్నారు. సూపర్‌మార్కెట్‌లతో ఏర్పాటు చేసుకున్న కూపన్ల కార్మికులకు అందేలా చేసి వెచ్చాలను అందించనున్నారు.

# తమ్మారెడ్డి భరద్వాజకు మాతృ వియోగం



● కృష్ణవేణి

**ప్ర**ముఖ దర్శకుడు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాతృమూర్తి కృష్ణవేణి (94) ఇక లేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం తుది శ్వాస విడిచారు. తమ్మారెడ్డి భరద్వాజ తండ్రి కృష్ణమూర్తి కూడా చిత్ర నిర్మాతే. రవీంద్ర ఆర్ట్స్ పతాకంపై ‘లక్షాధికారి, జమీందారు, బంగారు గాజులు, ధర్మదాత, దత్త పుత్రుడు, డాక్టర్ బాబు’ వంటి అనేక విజయవంతమైన చిత్రాలు నిర్మించారు కృష్ణమూర్తి. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు లెనిన్ బాబు చనిపోయారు. చిన్న కుమారుడు భరద్వాజ నిర్మాతగా, దర్శకుడిగా అనేక విజయవంతమైన చిత్రాలు అందించారు. మొదటి నుంచి వీరిది వామపక్ష భావాలున్న కుటుంబం. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ– ‘‘నా తల్లి రెండు నెలలుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ సోమవారం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న నా మిత్రులు, శ్రేయోభిలాషులు ఫోన్లు చేస్తున్నారు. కరోనా వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నందున నన్ను పరామర్శించడానికి ఎవరూ ఇంటికి రావద్దు’’ అని కోరారు. కాగా కృష్ణవేణి మరణ వార్త తెలుసుకున్న చిరంజీవి ఫోన్‌లో తమ్మారెడ్డి భరద్వాజను పరామర్శించారు.

# ఒక్కరికైనా సాయపడండి

‘‘ఈ లాక్‌డౌన్ పరిస్థితుల్లో పేదలకు సాయం చేయగలిగినవారు కనీసం రోజులో ఒక్కరికైనా సహాయం చేయడానికి ప్రయత్నించండి’’ అని కోరుకుంటున్నారు రకుల్‌ప్రీత్ సింగ్. కరోనా వైరస్ మహమ్మారి కారణంగా ఉపాధి కోల్పోయిన దాదాపు 200 కుటుంబాలకు ఆహారం అందజేస్తున్నారు రకుల్. గుర్గావ్‌లోని తన ఇంటి సమీపంలో ఉన్న పేదవారికి రకుల్ ఈ సహాయం చేస్తున్నారు. ‘‘లాక్‌డౌన్ కారణంగా పేదవారి జీవనశైలి దెబ్బ తింటోంది. కనీస అవసరాలు తీరని పేదవారికి మేం సహాయం చేయాలనుకున్నాం. మా వంతుగా మా ఇంటి సమీపంలోని బస్తీలో నివాసం ఉంటున్న 200 కుటుంబాలకు రెండు పూటలా భోజన సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. లాక్‌డౌన్ పూర్తయ్యేంతవరకు ఇలా చేయాలనుకున్నాం. ఒకవేళ లాక్‌డౌన్ పొడిగిస్తే మా సహాయాన్ని కూడా కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇదంతా మా నాన్నగారి (కుల్వీందర్ సింగ్) ప్రోత్సాహంతోనే జరుగుతోంది. విపత్కర పరిస్థితుల్లో నా వంతుగా నేను ఏదో సాయం చేయాలని తాపత్రయ పడుతుంటాను’’ అని పేర్కొన్నారు రకుల్.

# శ్రీలక్ష్మి కనకాల ఇకలేరు



● శ్రీలక్ష్మి

**బు**ల్లితెర నటి శ్రీలక్ష్మి కనకాల (40) మృతి చెందారు. గత రెండేళ్లుగా బ్రెస్ట్ క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆమె సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని తన ఇంట్లో కన్నుమూశారు. దివంగత దేవదాస్ కనకాల, లక్ష్మీదేవి కనకాల కుమార్తె, నటుడు రాజీవ్ కనకాల చెల్లెలు శ్రీలక్ష్మి. శ్రీ పెద్ది రామారావు భార్య అయిన శ్రీలక్ష్మి ఆయుర్వేద వైద్యురాలు కూడా. కొన్నాళ్లుగా టీవీ సీరియల్స్‌లో నటిస్తూ తల్లిదండ్రులకు తగ్గ తనయగా గుర్తింపు పొందారు. శ్రీలక్ష్మికి ఇద్దరు కుమార్తెలున్నారు.

# కూతురి కోసం...



● కూతురు నుర్వీతో నీల్ నితిన్ ముఖేష్

**షూ**టింగ్స్ ఆగిపోవడంతో ఇంటిపట్టున ఉంటున్న సినిమా స్టార్స్ తమకు నచ్చినట్లుగా టైమ్ స్పెండ్ చేస్తున్నారు. బాలీవుడ్ నటుడు నీల్ నితిన్ ముఖేష్ అయితే తన కూతురి కోసం సరదాగా పోనీ టెయిల్ వేసుకున్నారు. ‘‘నా కూతురు (నుర్వీ) పోనీ టెయిల్ వేసుకోనంటే వేసుకోనని ఒకటే మారాం చేసింది. తనని ఒప్పించడానికి నేను పోనీ టెయిల్ వేసుకున్నాను’’ అంటూ ఇక్కడున్న ఫొటోను షేర్ చేశారు నీల్ నితిన్. ప్రభాస్ ‘సాహో’, బెల్లకొండ సాయి శ్రీనివాస్ ‘కవచం’ చిత్రాల్లో నీల్ నితిన్ కీలక పాత్రల్లో నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

# నీలి నీలి ఆకాశం @ 10 కోట్లు!



● అమృత, ప్రదీప్

**యాం**కర్ ప్రదీప్ మాచిరాజు హీరోగా పరిచయమవుతున్న చిత్రం ‘30 రోజుల్లో ప్రేమించటం ఎలా’. అమృతా అయ్యర్ కథానాయికగా నటించారు. మున్నా దర్శకత్వంలో ఎస్వీ బాబు నిర్మించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని ‘నీలి నీలి ఆకాశం..’ పాట 100 మిలియన్ల వ్యూస్ దాటినట్లు చిత్రవర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా మున్నా, ఎస్వీ బాబు మాట్లాడుతూ– ‘‘మా సినిమాలోని ‘నీలి నీలి ఆకాశం..’ పాటతో సహా అన్ని పాటలనూ చంద్రబోస్ రాశారు. ప్రదీప్, అమృతలపై చిత్రీకరించిన ‘నీలి నీలి ఆకాశం’ పాట పది కోట్ల వ్యూస్ దాటడం చాలా ఆనందంగా ఉంది. అనూప్ సంగీతం, చంద్రబోస్ సాహిత్యం, సిద్ శ్రీరామ్, సునీత సుమధుర గానం.. అన్నీ కలిసి ఈ పాటను ఇంత బ్లాక్ బస్టర్ చేశాయి. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం నెలకొన్న సంక్షోభ పరిస్థితులు సమసిపోయి, సాధారణ పరిస్థితి నెలకొన్న తర్వాత సినిమాని విడుదల చేస్తాం’’ అన్నారు. కాగా ‘30 రోజుల్లో ప్రేమించడం ఎలా’ సినిమాని జీఏ2, యూవీ క్రియేషన్స్ సంస్థలు విడుదల చేయనున్నాయి.

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్థయా వర్ధతే విద్య
కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com
మంగళవారం
7-4-2020

# ఆటవిడుపు కొలువులు

అఫ్‌బీట్ కెరీర్స్

**కరోనా కారణంగా తెలుగు రాష్ట్రాలే కాదు. దేశ వ్యాప్తంగా పలు పరీక్షలు వాయిదా పడ్డాయి..! ఈ సమయంలో ఇప్పుడు ఇంటికే పరిమితమైన పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు తర్వాత ఏం చేయాలి.. ఏ కోర్సును, కెరీర్‌ను ఎంచుకోవాలో కూడా ఆలోచిస్తుండాలి. భవిష్యత్ లక్ష్యం ఏంటి.. అందుకోసం ఏ మార్గాన్ని అనుసరించాలో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. చాలామంది ఇంజనీరింగ్, మెడిసిన్ అంటుంటే.. మరికొంతమంది నలుగురు వెళ్లే దారిలో అడుగేసేందుకు అస్సలు ఇష్టపడరు..! ఏదైనా వినూత్నంగా చేయాలనుకుంటారు..! సరిగ్గా అలాంటి వారికోసమే పలు వినూత్న కెరీర్స్ పుట్టుకొస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. పదో తరగతి, ఇంటర్ తర్వాత అందుబాటులో ఉన్న ఆఫ్‌బీట్ కెరీర్స్ గురించి తెలుసుకుందాం..**

» ఆఫ్‌బీట్ కెరీర్స్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం
» క్రియేటివిటీతో రాణించొచ్చు అంటున్న నిపుణులు

## ఎథికల్ హ్యాకర్

ఎవరికీ తెలియకుండా అక్రమంగా కంప్యూటర్‌లోని సమాచారాన్ని తస్కరించడాన్ని హ్యాకింగ్ అంటారు. ఎథికల్ హ్యాకింగ్ అంటే.. యజమాని అనుమతితోనే కంప్యూటర్‌లోకి ప్రవేశించి డేటాను నాశనం చేయడం! కంప్యూటర్ ఎంత సురక్షితంగా ఉంది? దానిలో ఎలాంటి లోపాలు ఉన్నాయి? వాటిని ఎలా సరిచేయాలి? అనే విషయాలను గుర్తించడానికి ఎథికల్ హ్యాకర్లను నియమిస్తారు. కంప్యూటర్ నుంచి తమకు లభించిన కీలక సమాచారాన్ని వీరు గోప్యంగా ఉంచాల్సి ఉంటుంది.




- **భారీ డిమాండ్:** భారత ఐటీ పరిశ్రమలో ఎథికల్ హ్యాకర్ల అవసరం పెరిగిందని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం డిమాండ్‌కు సరిపడా నిపుణులు అందుబాటులో లేరు. ప్రధానంగా బీపీఓ, ఫైనాన్స్, బ్యాంకింగ్, ఐటీ రంగాల్లో ఎథికల్ హ్యాకర్లకు మంచి అవకాశాలు లభిస్తున్నాయి. ఎథికల్ హ్యాకర్లకు విదేశాల్లోనూ భారీ డిమాండ్ ఉంది.
- **రాణించాలంటే:** ఎథికల్ హ్యాకర్‌గా పేరు తెచ్చుకోవాలంటే.. హ్యాకర్లు ఉపయోగించే విధానాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలి. కంప్యూటర్ నెట్‌వర్కింగ్ నాలెడ్జ్ సంపూర్ణంగా ఉండాలి. జావా, సీ++ వంటి కంప్యూటర్ అప్లికేషన్లపై పూర్తి పట్టు అవసరం. కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్ 'యూనిక్స్'పై పరిజ్ఞానం సంపాదించాలి. తార్కిక ఆలోచనా విధానం, విశ్లేషణాత్మక వైఖరి ఉండాలి.

## బార్‌టెండర్

మీరెప్పుడైనా పబ్‌కు లేదా బార్‌కి వెళ్లారా..! వెళ్లని వారు.. టీవీలు, సినిమాల్లోనైనా ఆయా దృశ్యాలను చూసి ఉంటారు. రంగు రంగుల మద్యం సీసాలను ఒక చేత్తో గాల్లోకి ఎగరేస్తూ, మరో చేత్తో పట్టుకుంటూ.. చూపరులను ఆశ్చర్యపరిచే వ్యక్తులనే బార్ టెండర్లు అంటారు. ప్రస్తుతం నగరాలు, పట్టణాల్లో కార్పొరేట్ సంస్కృతి వేగంగా విస్తరిస్తుండటంతో బార్‌టెండర్లకు గిరాకీ పెరుగుతోంది.

- **కోర్సులు:** ప్రస్తుతం మన దేశంలో బార్ టెండింగ్‌లో స్వల్పకాలిక కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ రంగంలో ఉన్నతస్థాయికి చేరాలనుకొనే వారు గ్రాడ్యుయేషన్ తర్వాత ఈ కోర్సులను పూర్తి చేయొచ్చు.
- **నైపుణ్యాలు:** బార్‌టెండర్‌గా కెరీర్‌లో రాణించేందుకు » చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్ » కొత్త వ్యక్తులతో కలిసిపోయే స్వభావం » ఆత్మవిశ్వాసం ఉట్టిపడే బాడీ లాంగ్వేజ్ » నిత్యం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండటం » బేవరేజెస్‌పై పరిజ్ఞానం » కొత్త కొత్త కాక్‌టెయిల్స్, మాక్‌టెయిల్స్‌ను సృష్టించగలిగే నైపుణ్యాలు ఉండాలి.
- **వేతనాలు:** స్టార్ హోటళ్లు, పబ్బుల్లో బార్ టెండర్లకు అధిక వేతనాలు లభిస్తాయి. ప్రారంభంలో నెలకు రూ.15 వేలు వరకు అందుతుంది. అనుభవం ఆధారంగా రూ.50 వేలు నుంచి రూ.80 వేల వరకు అందుకోవచ్చు.



## యానిమేషన్, గేమింగ్

ఇంట్లో పిల్లలున్నారా..! అయితే టీవీలో టామ్ అండ్ జెర్రీ, మిక్కీమౌస్ వంటి కార్టూన్ ప్రోగ్రామ్స్ హోరెత్తాల్సిందే. లేదా టీవీ, మొబైల్ ఫోన్స్‌లో వీడియో గేమ్స్ మోత మోగాల్సిందే..! ఆ వీడియో గేమ్స్, కార్టూన్ ప్రోగ్రామ్స్ వెనకున్న వారే... గేమింగ్ అండ్ యానిమేషన్ నిపుణులు.

- కంప్యూటర్‌ను ఉపయోగించి చిత్రాలు, ఇతర ప్రతిబింబాలను కదులుతున్నట్లు చూపించే ప్రక్రియను యానిమేషన్ అంటారు. యానిమేషన్ కోర్సులు పూర్తి చేస్తే వినోద, ప్రకటన విభాగాల్లో అవకాశాలు లభిస్తాయి. వీడియో గేమ్స్ రూపకల్పన, మార్కెటింగ్, ఆదాయ సమీకరణలు గేమింగ్ రంగంలో ప్రధాన విధులు. గేమింగ్, యానిమేషన్ విభాగాలు ఒకదానితో ఒకటి కలసి ఉంటాయి. యానిమేటర్, గేమ్ డిజైనర్‌ల విధుల్లో చాలా వరకూ సారూప్యత ఉంటుంది. గేమ్ డిజైనర్లు గేమ్ స్టోరీ లైన్, గేమ్ ప్లే స్టైల్‌ను రూపొందిస్తారు. గేమింగ్ రంగంలో యువతకు పెద్ద సంఖ్యలో కొలువులు లభిస్తున్నాయి.

### కోర్సులు

- గ్రాడ్యుయేషన్ ఇన్ యానిమేషన్ అండ్ గేమింగ్



» పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇన్ యానిమేషన్ అండ్ గేమింగ్ » మాస్టర్ డిప్లొమా ఇన్ యానిమేషన్ అండ్ గేమింగ్ » సర్టిఫికెట్ ఇన్ యానిమేషన్ » డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ 3డీ యానిమేషన్.

### అవసరమైన నైపుణ్యాలు

గేమింగ్, యానిమేషన్ రంగంలో రాణించేందుకు పలు నైపుణ్యాలు తప్పనిసరి. అవి.. » సాంకేతిక, కంప్యూటర్ నైపుణ్యాలు » మ్యాథమెటిక్స్‌పై పట్టు » ప్రోగ్రామింగ్ స్కిల్స్ » సృజనాత్మకత » రంగులు, ఆకారాలపై అవగాహన » స్వీయ ప్రేరణ » బృంద స్ఫూర్తి, స్వశక్తితో పనిచేయగలిగే నేర్పు » మార్కెటింగ్ నైపుణ్యం.

### జాబ్ ప్రొఫైల్స్

- 3డీ మాడ్యులర్, యానిమేటర్, ఆర్ట్ డైరెక్టర్, గ్రాఫిక్ డిజైనర్, వీడియో గేమ్ డిజైనర్, యానిమేషన్ డైరెక్టర్, కార్టూనిస్ట్, డిజిటల్ పెయింటర్, స్టాప్ మోషన్ యానిమేటర్, కలర్ ఆర్టిస్ట్, ఎఫెక్ట్స్ యానిమేటర్, మ్యాథమెటికల్, కాంపొసైటింగ్ ఆర్టిస్ట్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి.

## కామెంటేటర్

స్పోర్ట్స్, గేమ్స్ ఇష్టపడని వాళ్లెవరుంటారు..! కొంతమంది క్రికెట్‌ను ప్రాణంగా ప్రేమిస్తే... మరికొంతమంది ఫుట్‌బాల్‌ను ఆసక్తిగా చూస్తుంటారు. క్రికెట్‌నే తీసుకుంటే విరాట్ కోహ్లీ ఎంతలా ఆకట్టుకుంటాడో... కామెంటేటర్ సైతం ఆటగాళ్లు ఆడే షాట్‌ల వర్ణన, విశ్లేషణతో వీక్షకులను రంజింపచేస్తుంటాడు. క్రికెట్ కామెంటరీలో సునీల్ గవాస్కర్, హర్షా భోగ్లే, సంజయ్ మంజ్రేకర్, రమీజ్ రాజా తదితరులు ప్రాచుర్యం పొందగా...ఫుట్‌బాల్‌లో పీటర్ డ్యూరీ, డేరెక్ రే, జిమ్ బెగ్లింగ్ తదితరులు పేరు గడించారు. కామెంటేటర్‌గా స్థిరపడాలంటే.. ముందుగా కావాల్సిన ప్రాథమిక అర్హత... మంచి కంఠస్వరం. దీంతోపాటు కనీసం బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. సంబంధిత ఆట గురించి క్షుణ్నంగా తెలుసుండాలి. వీటితోపాటు ఆయా జట్ల ఆటతీరు, ప్లేయర్ల గణాంకాలు కంఠస్తా వచ్చుండాలి. బిజినెస్ కమ్యూనికేషన్, మాస్ మీడియా, రేడియో/టీవీ బ్రాడ్ కాస్టింగ్‌లో బ్యాచిలర్, మాస్టర్ డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన వారిలో ఎక్కువ మంది కామెంటేటర్లుగా స్థిరపడుతున్నారు.






## వెడ్డింగ్ ప్లానర్

పెద్ద పెద్ద పంక్షన్లు, పార్టీలను బాగా ఆస్వాదిస్తారా! వాటి నిర్వహణలో తగిన అనుభవం ఉందా! బేరసారాలు చేయడంతోపాటు ఇతరులను కలుపుకుని పనిచేయగలరా! మీ సమాధానం అవును అయితే.. మీరూ వెడ్డింగ్ ప్లానర్‌గా మారొచ్చు! ఆయా అంశాల్లో ఆసక్తి కలిగిన ఎంతో మంది వెడ్డింగ్ ప్లానర్స్, బ్రైడల్ కన్సల్టెంట్స్‌గా స్వయం ఉపాధి పొందుతున్నారు. స్వయం ఉపాధి పట్ల ఆసక్తి లేని వారు వెడ్డింగ్ అండ్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీల్లో ఉద్యోగులుగా చేరొచ్చు.

- గత కొంత కాలంగా ప్రజల ఆదాయం బాగా పెరిగింది. ముఖ్యంగా ఐటీ, బిజినెస్ రంగాల్లోని వారు, ఇతర పెద్ద ఉద్యోగాల్లోని వారు నెలకు లక్షల్లో ఆర్జిస్తున్నారు. వీరి వద్ద కావాల్సినంత డబ్బుయితే ఉంటుంది.. కానీ, సమయమే ఉండట్లేదు. వీరంతా దొరికిన కొద్ది సమయాన్ని ఉల్లాసంగా గడిపేందుకే ఇష్టపడుతున్నారు. ఇప్పుడిదే ఈవెంట్ మేనేజర్లకు వరంగా మారింది. పెళ్లి, పుట్టిన రోజు, గృహప్రవేశం, ఫేర్‌వెల్, ఫ్రెషర్స్ పార్టీ.. ఇలా శుభకార్యం ఏదైనా.. ఈవెంట్ మేనేజర్ల వైపే చూస్తున్నారు. దాంతో వెడ్డింగ్ ప్లానర్స్‌కు అవకాశాలు లభిస్తున్నాయి.

## టాయ్ డిజైనింగ్

భారత్‌తోపాటు ప్రపంచ వ్యాప్తంగా టాయ్ డిజైనింగ్ రంగం విస్తరిస్తోంది. ఆట వస్తువులు, ఇతర ఆకర్షణీయ బొమ్మల రూపకల్పన, తయారీ కార్యకలాపాల్లో నిమగ్నమైన వారిని టాయ్ డిజైనర్స్ అంటారు. టాయ్ డిజైనింగ్‌కు సంబంధించి ఎలాంటి పూర్తిస్థాయి కోర్సులు అందుబాటులో లేవు. కొన్ని స్వల్పకాలిక కోర్సులు మాత్రం టాయ్ డిజైనర్‌గా స్థిరపడేందుకు కావాల్సిన నైపుణ్యాలను అందిస్తున్నాయి. ప్రస్తుతం అనేక పెద్ద కంపెనీలు టాయ్స్ తయారుచేస్తున్నాయి. దీంతో ఉద్యోగ అవకాశాల పరంగానూ టాయ్ డిజైనర్లకు ఆశాజనక పరిస్థితులు కనిపిస్తున్నాయి.

- టాయ్స్ పట్ల ఆసక్తి, ఇష్టాన్ని టాయ్ డిజైనర్ కావాల్సిన ప్రాథమిక అర్హతలుగా పేర్కొనవచ్చు. టాయ్ డిజైనర్లు అందరినీ ఆకట్టుకునే టాయ్స్‌ను రూపొందించేలా ఆలోచించాలి. ఇందులో భాగంగా సీఏడీ, హ్యాండ్ డిజైన్స్‌పై పట్టు సాధించడం తప్పనిసరి. దీంతోపాటు కంప్యూటర్ ఆధారిత డ్రాఫ్టింగ్, డ్రాయింగ్, ఆర్కిటెక్చర్ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సి ఉంటుంది. డిజైనర్లకు టాయ్స్ తయారీకి అవసరమైన మెటీరియల్స్‌పై అవగాహన ఉండాలి. ఫైన్ ఆర్ట్స్ కోర్సులు పూర్తి చేసిన వారు టాయ్ డిజైనర్స్‌గా స్థిరపడవచ్చు.



## వెబ్ డిజైనింగ్

ఇటీవల కాలంలో జాబ్ ఓరియెంటెడ్ కోర్సుల్లో వెబ్ డిజైనింగ్ ముందు వరుసలో నిలుస్తోంది. విలక్షణత, వినూత్న ఆలోచనా దృక్పథం కలిగిన విద్యార్థులకు ఈ కోర్సు చక్కగా సరిపోతుంది. వెబ్ డిజైన్, వెబ్ డెవలప్‌మెంట్ కోర్సులు వెబ్‌సైట్‌ల రూపకల్పన, నిర్వహణా నైపుణ్యాలను అందిస్తాయి. దీంతోపాటు ఇంటర్‌ఫేస్ డిజైన్, గ్రాఫిక్ డిజైన్, వెబ్ గ్రాఫిక్ డిజైన్, యూజర్ ఎక్స్‌పీరియెన్స్ డిజైన్, సెర్చ్ ఇంజన్ ఆపరేషన్, సెర్చ్ ఇంజన్ ఆప్టిమైజేషన్ తదితర నైపుణ్యాలను పెంపొందిస్తాయి. ఆయా నైపుణ్యాలున్న అభ్యర్థులకు

» గ్రాఫిక్ డిజైనర్
» గ్రాఫిక్ ఆర్టిస్ట్
» క్రియేటివ్ డైరెక్టర్
» డిజైన్ ఆర్కిటెక్ట్

వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి. వీరికి రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వార్షిక వేతనంతో కొలువులు దక్కుతున్నాయి.



## ప్రవేశాలు

### కలినరీ ఆర్ట్స్‌లో బీబీఏ

తిరుపతి, నోయిడాలోని ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్(కేంద్ర పర్యాటక శాఖ పరిధిలోని అటానమస్ సంస్థ)..అమర్ కంఠక్‌లోని ఇందిరా గాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీతో కలసి బీబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సు పేరు:** బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్
- **కోర్సు వ్యవధి:** మూడేళ్లు
- **అర్హత:** ఇంటర్మీడియెట్/తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 01.07.2020 నాటికి 22 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 27.04.2020
- **దరఖాస్తు హార్డ్‌కాపీ పంపడానికి చివరి తేదీ:** 30.04.2020
- **పరీక్ష తేదీ:** 16.05.2020
- **వెబ్‌సైట్:** http://www.ici.nic.in

### కలినరీ ఆర్ట్స్‌లో ఎంబీఏ

తిరుపతి, నోయిడాలోని ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్(కేంద్ర పర్యాటక శాఖ పరిధిలోని అటానమస్ సంస్థ).. అమర్ కంఠక్‌లోని ఇందిరా గాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీతో కలసి ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సు పేరు:** మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ)
- **కోర్సు వ్యవధి:** రెండేళ్లు
- **అర్హత:** బ్యాచిలర్స్ డిగ్రీ లేదా తత్సమాన కోర్సు(కలినరీ ఆర్ట్స్/హాస్పిటాలిటీ/హోటల్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణత.
- **వయసు:** 01.08.2020 నాటికి 25 ఏళ్లు మించరాదు.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **పరీక్ష తేదీ:** 16.05.2020
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన దరఖాస్తులకు చివరి తేదీ:** 27.04.2020
- **దరఖాస్తు హార్డ్‌కాపీలను పంపడానికి చివరి తేదీ:** 30.04.2020
- **వెబ్‌సైట్:** http://www.ici.nic.in

### ఎన్‌సీఈఆర్‌టీలో వివిధ టీచింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు

కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఆర్‌డీ) పరిధిలోని నేషనల్ కౌన్సెల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్(ఎన్‌సీఈఆర్‌టీ)... దేశవ్యాప్తంగా ఉన్న రీజనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎడ్యుకేషన్స్(ఆర్‌ఐఈ)ల్లో.. 2020 విద్యాసంవత్సరంలో వివిధ టీచింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **ప్రోగ్రామ్‌లు:** బీఎస్సీ బీఈడీ(నాలుగేళ్లు), బీఏ బీఈడీ(నాలుగేళ్లు), ఎంఎస్సీ ఎడ్యుకేషన్ (ఆరేళ్లు), బీఈడీ(రెండేళ్లు), ఎంఈడీ(రెండేళ్లు).
- **ఎంపిక విధానం:** ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** 06.04.2020
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 04.05.2020
- **పరీక్ష తేదీ:** 24.05.2020
- **వెబ్‌సైట్:** https://cee.ncert.gov.in

### యూఓహెచ్‌లో ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ కోర్సులు



హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ... యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (యూఓహెచ్) 2020–21 విద్యా సంవత్సరానికి ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **కోర్సులు:** ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ(ఐదేళ్లు), ఇంటిగ్రేటెడ్ ఎంఏ(ఐదేళ్లు), ఎంసీఏ, ఎంఎఫ్‌ఏ, ఎంబీఏ, ఎంటెక్, ఎంఫిల్, ఎంఎస్సీ పీహెచ్‌డీ.
- **అర్హత:** ఆయా కోర్సును అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్మీడియెట్, బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ కోర్సుల్లో ఉత్తీర్ణత.
- **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 03.05.2020
- **వెబ్‌సైట్:** http://www.uohyd.ac.in



జాబ్ ట్రెండ్స్

**కార్పొరేట్ కంపెనీల్లో పూర్తిస్థాయి ఉద్యోగులుగా చేరకుండా.. ఒకే సమయంలో అనేక కంపెనీలకు తమ సేవలను అందిస్తూ.. తమకు ఇష్టమున్నప్పుడే పనిచేస్తూ.. స్వయం ఉపాధిని పొందడమే ఫ్రీలాన్సింగ్! ఫ్రీలాన్సర్‌లు ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తూ.. పనికి తగ్గ ఆదాయం ఆర్జిస్తారు. ఇటీవల కాలంలో మిలీనియల్స్‌లో ఫ్రీలాన్సింగ్ ట్రెండ్ బాగా నడుస్తోంది. కంపెనీలు సైతం వీరిని ప్రోత్సహిస్తున్నాయి. ఎందుకో తెలుసుకుందాం...!!**

# కార్పొరేట్ కొలువుకన్నా..

# ఫ్రీలాన్స్ ఉద్యోగమే మిన్న

### స్వేచ్ఛగా పనిచేసే సౌలభ్యం

కంపెనీలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేసే ఉద్యోగస్తులు స్థిర పని, నిర్దేశిత పనివేళలు, నిర్ణీత ఆదాయం పొందుతారు. కానీ ఎటువంటి నిర్ణీత సమయం, నిబంధనలు, బాస్‌ల బాదరబందీ లేకుండా.. స్వేచ్ఛగా పనిచేసే సౌలభ్యం ఫ్రీలాన్స్ ఉద్యోగాలలో ఉంటుంది. ప్రస్తుతం చాలామంది ఫ్రీలాన్స్ ఉద్యోగాలవైపు ఆసక్తి చూపడానికి కారణం కేవలం పని సౌలభ్యం కోసం మాత్రమే కాదు. ఫ్రీలాన్సింగ్ విధానంలో.. ఏదో ఒక సంస్థ కోసం మాత్రమే పని చేయడం కాకుండా.. ఒకే సమయంలో అనేక కంపెనీలకు పనిచేస్తూ.. తమ నైపుణ్యాల్ని, ఆదాయాన్ని పెంచుకునేందుకు వీలుంటుంది. విభిన్న అవకాశాలు పొందడానికి ఫ్రీలానర్స్ ఉద్యోగం తోడ్పడుతుంది. కంపెనీలలో ఒకే రంగానికి సంబంధించిన ఉద్యోగాలు ఉంటాయి. నచ్చిన విభాగాన్ని ఎంపిక చేసుకొనే అవకాశం ఉండదు. కానీ ఫ్రీలాన్స్ ఉద్యోగాలలో అన్ని రంగాలకు సంబంధించిన పనులు ఉంటాయి. ఇష్టమైనది ఎంచుకొని పనిచేయవచ్చు.

### ఫ్రీలాన్సింగ్ వైపు మొగ్గు

అమెరికా వంటి విదేశాల్లో ఫ్రీలాన్స్ ఉద్యోగాల విధానం ఎప్పటి నుంచో ఉంది. మన దేశంలో మాత్రం ఇలాంటి ధోరణి ఇప్పుడిప్పుడే కనిపిస్తోంది. ఫ్రీలాన్స్ ఉద్యోగాలలో ఉన్న సౌలభ్యం ఏమిటంటే.. ఒత్తిడి తక్కువ, ఇష్టమున్నప్పుడు పని చేయొచ్చు. ఎక్కువ పనిచేస్తే ఎక్కువ ఆదాయం లభిస్తుంది. ప్రస్తుతం యువత కంపెనీలలో ఉద్యోగం చేయడం కంటే.. ఫ్రీలాన్స్ ఉద్యోగాలు చేయడానికే ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు.

### ఫ్రీలాన్సింగ్‌కు కారణాలు

- ఫ్రీలాన్సింగ్‌లో ఇంటి నుంచే పనిచేసే సౌలభ్యం ఉంటుంది. సౌకర్యవంతంగా, నచ్చిన సమయంలో పని చేయవచ్చు. ఒప్పందం మేరకు నిర్దేశిత గడువులోపు ప్రాజెక్టు పూర్తి చేస్తే సరిపోతుంది.
- స్థిరమైన ఆదాయ ప్రవాహం ఉండాలంటే.. ఫ్రీలాన్సర్‌లు మంచి క్లయింట్‌లను ఏర్పాటుచేసుకోవాలి. మంచి ప్రాజెక్టులు రావాలంటే.. ఫ్రీలాన్స్ సర్వీసు ప్రొవైడర్లతో సత్సంబంధాలు కొనసాగించాలి. దీనివల్ల మంచి క్లయింట్‌లను పొందడమే కాకుండా.. ఎక్కువ ఆదాయాన్ని ఆర్జించే వీలుంటుంది.
- ఫ్రీలానర్స్‌గా పనిచేస్తున్నప్పుడు ప్రాజెక్టులలో కొత్త ఆలోచనలను అమలు చేసే స్వేచ్ఛ ఉంటుంది. ఇది వృత్తిలో ఉన్నతికే కాకుండా.. వ్యక్తిగత నైపుణ్యాలు పెంచుకునేందుకు కూడా దోహదపడుతుంది.
- ఫ్రీలాన్సింగ్.. దీర్ఘకాలిక, స్వల్పకాలిక అవకాశాలను అందిస్తుంది. 9 గంటల నుంచి 5 గంటల వరకు పనిచేసే ఉద్యోగాల మాదిరిగా కాకుండా.. ఫ్రీలానర్స్‌గా ఉండటం వల్ల ఎప్పుడు పనిచేయాలో, ఎంత సేపు పనిచేయాలో నిర్ణయించుకోవచ్చు. అవసరం, పని లభ్యత ఆధారంగా దీర్ఘకాలిక, స్వల్పకాలిక ప్రాజెక్టులు చేయవచ్చు. ఒకవేళ 4–5 గంటలు మాత్రమే పనిచేయాలనుకుంటే.. అలాంటి సందర్భాల్లో స్వల్పకాలిక ప్రాజెక్టులు ఎంచుకుంటే సరిపోతుంది.
- ఫ్రీలాన్సర్‌లకు బాస్ ఎవరూ ఉండరు. ఇందులో రాణించేందుకు నిజాయితీ, సమయస్ఫూర్తి, నిబద్ధత తప్పనిసరి. అదే సమయంలో పని ప్రామాణికత, విశ్వసనీయత, నాణ్యతకు కట్టుబడి ఉండటం చాలా అవసరం. ఫ్రీలాన్సింగ్ స్వతంత్రంగా ఎదగడానికి సహాయపడుతుంది.

### శాశ్వత ఉద్యోగులకంటే

కంపెనీలలో పనిచేసే ఉద్యోగులకు యాజమాన్యాలు స్థిరమైన పని వేళలు, నిర్ణీత వేతనాలు అందిస్తాయి. నేడు, అనేక చిన్న, పెద్ద కంపెనీలు శాశ్వత ఉద్యోగులను నియమించుకోవడం కంటే అవుట్‌సోర్సింగ్ విధానం వైపు మొగ్గుచూపుతున్నాయి. దీని వల్ల మానవ వనరులు, మౌలిక వసతులపై వ్యయం తగ్గుతుంది. కాబట్టి ఈ మారుతున్న ధోరణికి అనుగుణంగా నైపుణ్యాలు మెరుగుపరచుకుంటే.. ఫ్రీలాన్సింగ్‌లో రాణించే అవకాశం ఉంది.

ఎంసెట్ ప్రత్యేకం
- స్టడీమెటీరియల్
- బిట్ బ్యాంక్
- ఆన్‌లైన్ టెస్టులు
- మోడల్ పేపర్స్
- ప్రీవియస్ పేపర్స్

విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

## అమెరికాలో పులికీ కరోనా!



**న్యూయార్క్:** ప్రాణాంతక కరోనా వైరస్ ఇప్పుడు జంతువులకూ సోకడం మొదలైంది. పిల్లి జాతి జంతువుల్లోకి కరోనా వైరస్ ప్రవేశించే అవకాశముందని శాస్త్రవేత్తలు నిర్ధారించిన నేపథ్యంలో న్యూయార్క్‌లోని బ్రాంక్స్ జంతు ప్రదర్శన శాలలో నాదియా అనే నాలుగేళ్ల పులి ఈ వైరస్ బారిన పడింది. గత ఏడాది డిసెంబరులో చైనాలోని వూహాన్‌లో ముందుగా కనిపించిన కరోనా వైరస్ జంతువుల నుంచి మనుషుల్లోకి ప్రవేశించిందని అంచనా. హాంకాంగ్‌లో ఇప్పటికే రెండు కుక్కలకు ఈ వ్యాధి సోకినట్లు సమాచారం.


తెలంగాణ ప్రభుత్వం
**వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, ములుగు జిల్లా**

Lr.No.AMC/MLG/KMS/2019-20 (Rabi Season) సంక్షిప్త టెండరు ప్రకటన తేది: .04.2020

ములుగు జిల్లాలోని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీకి ఎలక్ట్రానిక వెయింగ్ స్కేల్స్, టార్పాలిన్స్, పాడి క్లీనర్స్, పాడి మాయిశ్చర్ మీటర్లు సరఫరా చేయుటకు సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. స్పెసిఫికేషన్లు, నియమ నిబంధనలు మరియు ఇతర వివరాలు టెండరు షెడ్యూలులో తెలియజేయబడినవి. రూ.1,000.00లను Collector, Mulugu పేరున DD లేదా నగదు ద్వారా చెల్లించి మార్కెట్ సెక్రటరీ కార్యాలయం, AMC-ములుగు నుండి కార్యాలయ పనివేళలలో టెండరు షెడ్యూలును పొందగలరు.

| | |
|---|---|
| టెండరు షెడ్యూలు అమ్మకం తేది | 07.04.2020 నుండి 09.04.2020 మ.1.00 గం. వరకు. |
| టెండరు దాఖలు కోసం చివరి తేది | 09.04.2020 మ.2.00 గం. వరకు. |
| టెండరు తెరుచు తేది మరియు సమయం | 09.04.2020 మ.3.00 గం. |
| వివరాలకు సంప్రదించండి | 7330733502 / 7331157956 |

సం/- జిల్లా మార్కెటింగ్ అధికారి (FAC) సం/- కలెక్టర్
DIPR Ro.No.1107-PP/CL/Advt/1/2020-21, Dt: 06.04.2020



**వ్యవసాయ మార్కెటింగ్ శాఖ**
జిల్లా మార్కెటింగ్ అధికారి కార్యాలయం, జనగామ : మొబైల్ నం.7330944725

No.DMO/JNG/MSP/RMS/2019-20 సంక్షిప్త టెండరు ప్రకటన తేది: 06.04.2020

దిగువ ఐటమ్స్ సరఫరా చేయుటకు తయారీదారులు/సంస్థల నుండి సీల్డ్ కొటేషన్లు కోరబడుచున్నవి.

| క్ర.సం. | ఐటం పేరు | షెడ్యూలు ధర | బయానా |
|---|---|---|---|
| 1. | ప్యాడి మాయిశ్చర్ మీటర్లు (డిజిటల్) | రూ.1000/- | రూ.10,000/- |
| 2. | టర్పాలిన్స్ | రూ.1000/- | రూ.10,000/- |
| 3. | ఎలక్ట్రానిక్ వెయింగ్ స్కేల్స్ | రూ.1000/- | రూ.20,000/- |
| 4. | ప్యాడి క్లీనర్స్ | రూ.1000/- | రూ.50,000/- |

ఆసక్తిగల తయారీదారులు/సంస్థలు రూ.1000 (ఒకవేయి రూపాయలు మాత్రమే) నగదు లేదా DD చెల్లించి జిల్లా మార్కెటింగ్ అధికారి, జనగామ వారినుండి టెండరు షెడ్యూళ్లను పొందగలరు. సెక్యూరిటీ డిపాజిట్ నిమిత్తం పైన పట్టికలో చూపిన విధంగా బయానా మొత్తాలను District Marketing Officer, Jangaon పేరున డిమాండ్‌డ్రాఫ్ట్ రూపంలో చెల్లించి టెండర్లకు జతచేయవలెను మరియు పూర్తిచేసిన కొటేషన్లను జిల్లా మార్కెటింగ్ అధికారి కార్యాలయం, జనగామ వద్ద ఉంచిన టెండరు బాక్సులో వేయవలెను. ఏదేని ఇతర సమాచారాన్ని జిల్లా మార్కెటింగ్ అధికారి కార్యాలయం, జనగామ నుండి కార్యాలయ పనివేళలలో పొందవచ్చును. ఎలాంటి కారణాలు తెలియజేయకుండానే ఏదేని లేదా అన్ని టెండర్లను తిరస్కరించుటకు/రద్దు చేయుటకు ఈ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ హక్కు కలిగిఉంది.
**టెండరు వివరాలు:** టెండరు షెడ్యూలు అమ్మకం తేది: **07.04.2020 ఉ.10.30 గం. నుండి.** టెండర్ల దాఖలు కోసం చివరి తేది: **09.04.2020 మ.3.00 గం. వరకు.** టెండర్లు తెరుచు తేది: **09.04.2020 సా.5.00 గం.నుండి.**

సం/- జిల్లా మార్కెటింగ్ అధికారి, జనగామ సం/- జిల్లా కలెక్టర్, జనగామ
DIPR RO.No.1106-PP/CL/Advt/1/2020-21, Dt: 06.04.2020



తెలంగాణ ప్రభుత్వం
**సాగునీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ**
**పర్యవేక్షక ఇంజినీరు వారి కార్యాలయం, నీటి పారుదల శాఖ సర్కిల్, వరంగల్**

**సంఖ్య: 110/2019-20** ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు **తేది: 28.03.2020**

వరంగల్ అర్బన్‌జిల్లా 01 చెక్‌డ్యాం నిర్మాణ పనుల కొరకు తేది: 06.04.2020 నుండి 13.04.2020 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ **http://tender.telangana.gov.in** వెబ్‌సైట్‌లో చూడవచ్చును.

సం/- పర్యవేక్షక ఇంజినీరు, ఐ అండ్ సిఏడిడి.,
నీటిపారుదల శాఖ సర్కిల్, వరంగల్ ఫోన్ నం: 0870-2577221
DIPR Ro.No.1091-PP/CL/Advt/1/2020-21, Dt: 06.04.2020



తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ శాఖ/ భూసేకరణ
**ఫారం-VII**
కలెక్టర్ స్పెషల్ / భూసేకరణ/ స్పెషల్ కలెక్టర్ / సంయుక్త కలెక్టర్ / డిప్యూటీ కలెక్టర్ భూసేకరణ /
**డిక్లరేషన్**
భూసేకరణలో న్యాయమైన పరిహారం, పారదర్శకత, పునరావాసము మరియు పునఃస్థాపన హక్కు చట్టము / 2013/ 30వ సంవత్సరం కేంద్ర చట్టము 2013లోని సెక్షన్/1/19 మరియు రాష్ట్ర ప్రభుత్వ నియమావళి/1/25లో నియమము 2014ననుసరించి

**నెం.డి:970/2012** **తేది: 25-02-2020**

ఈ దిగువ షెడ్యూల్‌లో నిర్దిష్టపరిచిన నల్లగొండ జిల్లా, చండూర్ మండలములోని కస్తాల గ్రామములో వున్న భూమి విస్తీర్ణం 18.35½ గుంటలు ప్రజా ప్రయోజనము నిమిత్తము అనగా యస్.సి.పి. ప్రస్తుతము ఉన్న శేశిలేటి వాగు అనికట్ లాల్ శంక్ తండా నుండి మాధవరావు చెరువు నింపుటకు ఫీడర్ ఛానల్ పునర్నిర్మాణము కొరకు భూసేకరణ అవసరమైనదని భావించనైనది.

కావున ఈ క్రింద షెడ్యూల్‌లో చూపబడిన భూమి పై తెలుపబడిన ప్రజావసరము గురించి అవసరమైనందున భూమి సేకరించుటకు రూఢి ప్రకటన జారీ చేయనైనది.

షెడ్యూలు
గ్రామం: కస్తాల మండలం: చండూర్ జిల్లా: నల్లగొండ

| క్రమ సం | సర్వే నెం. | భూమి స్వభావము | తరి/ ఖుష్కి | భూసేకరణలో పోవు విస్తీర్ణం ఎ.గుం. | భూమిపై ఆసక్తి (హక్కు) గల వ్యక్తి పేరు మరియు తండ్రి పేరు | బెట్టు, నిర్మాణాలు మరియు మిగతా వివరములు |
|---|---|---|---|---|---|---|
| 1 | 195/2 | పట్టా | మెట్ట | 0.15 | అబ్బిడి జయపాల్ రెడ్డి తండ్రి | - |
| ఉప మొత్తము | | | | 0.15 | | |
| 2 | 196/2 | పట్టా | మెట్ట | 1.02 | అబ్బిడి లక్ష్మమ్మ భర్త మాధవరెడ్డి | - |
| 3 | 196/2 | పట్టా | మెట్ట | 0.10 | మెండు నర్సిరెడ్డి తండ్రి ప్రతాప్‌రెడ్డి | - |
| 4 | 196/2 | పట్టా | మెట్ట | 0.10 | మెండు శేఖర్‌రెడ్డి తండ్రి ప్రతాప్‌రెడ్డి | - |
| ఉప మొత్తము | | | | 1.22 | | |
| 5 | 202/2 | పట్టా | మెట్ట | 0.13 | అబ్బిడి చంద్రారెడ్డి తండ్రి నర్సిరెడ్డి | - |
| 6 | 202/2 | పట్టా | మెట్ట | 0.13 | అబ్బిడి జలంధర్‌రెడ్డి తండ్రి నర్సిరెడ్డి | - |
| 7 | 202/2 | పట్టా | మెట్ట | 0.11 | మెండు నర్సింహారెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి | - |
| 8 | 202/2 | పట్టా | మెట్ట | 0.22 | అబ్బిడి అనిత తండ్రి భూపాల్‌రెడ్డి | - |
| ఉప మొత్తము | | | | 1.19 | | |
| 9 | 203/2 | పట్టా | మెట్ట | 0.17 | మెండు పద్మారెడ్డి తండ్రి చిన్న నారాయణ్‌రెడ్డి | - |
| 10 | 203/2 | పట్టా | మెట్ట | 0.10 | మెండు సంజీవరెడ్డి తండ్రి మల్లారెడ్డి | - |
| 11 | 203/2 | పట్టా | మెట్ట | 0.21 | అబ్బిడి మాణిక్యమ్మ భర్త పాపిరెడ్డి | - |
| ఉప మొత్తము | | | | 1.08 | | |
| 12 | 204/2 | పట్టా | మెట్ట | 0.14 | మెండు వెంకటరెడ్డి తండ్రి సూరారెడ్డి | - |
| 13 | 204/2 | పట్టా | మెట్ట | 0.13 | మెండు విజయభాస్కర్ రెడ్డి తండ్రి నర్సిరెడ్డి | - |
| 14 | 204/2 | పట్టా | మెట్ట | 0.13 | మెండు పూలమ్మ భర్త గురువారెడ్డి | - |
| 15 | 204/2 | పట్టా | మెట్ట | 0.13 | మెండు జ్యోతి భర్త నర్సిరెడ్డి | - |
| ఉప మొత్తము | | | | 1.13 | | |
| 16 | 205/2 | పట్టా | మెట్ట | 1.09 | మెండు స్వాతి భర్త చంద్రారెడ్డి | - |
| ఉప మొత్తము | | | | 1.09 | | |
| 17 | 206/2 | పట్టా | మెట్ట | 0.19 | మెండు చంద్రారెడ్డి తండ్రి సత్తిరెడ్డి | - |
| 18 | 206/2 | పట్టా | మెట్ట | 0.19 | మెండు సత్తిరెడ్డి తండ్రి చంద్రారెడ్డి | - |
| ఉప మొత్తము | | | | 0.38 | | |
| 19 | 207/2 | పట్టా | మెట్ట | 0.06 | మెండు అహల్య భర్త సత్తిరెడ్డి | - |
| ఉప మొత్తము | | | | 0.06 | | |
| 20 | 257/2 | పట్టా | మెట్ట | 0.17½ | సరిపల్లి విక్రమ్ తండ్రి అచ్చయ్య | - |
| 21 | 257/2 | పట్టా | మెట్ట | 0.17½ | సరిపల్లి రమేష్, నాగేశ్, శ్రీను తండ్రి చిన ఈదయ్య | - |
| ఉప మొత్తము | | | | 0.35 | | |
| 22 | 258/2 | పట్టా | మెట్ట | 0.03 | సరిపల్లి రమేష్, నాగేశ్, శ్రీను తండ్రి చిన ఈదయ్య | - |
| 23 | 258/2 | పట్టా | మెట్ట | 0.02 | సరిపల్లి విక్రమ్ తండ్రి అచ్చయ్య (ఐ) దాసరి వెంకటేశం తండ్రి విక్రమయ్య (వ) | - |
| 24 | 258/2 | పట్టా | మెట్ట | 0.02½ | సరిపల్లి సునీత భర్త విక్రమ్ | - |
| ఉప మొత్తము | | | | 0.07½ | | |
| 25 | 265/2 | పట్టా | మెట్ట | 0.23 | బక్క మైసయ్య తండ్రి వెంకయ్య | - |
| 26 | 265/2 | పట్టా | మెట్ట | 0.23 | దండావతి ఉమా మహేశ్వరి భర్త భీమయ్య | - |
| 27 | 265/2 | పట్టా | మెట్ట | 0.13½ | సరిపల్లి వెంకట్రాములు తండ్రి చంద్రయ్య | - |
| 28 | 265/2 | పట్టా | మెట్ట | 0.06 | సరిపల్లి ముత్యాలు తండ్రి నర్సయ్య | - |
| ఉప మొత్తము | | | | 1.25½ | | |
| 29 | 371/2 | పట్టా | మెట్ట | 0.08 | పిన్నపురెడ్డి అంతిరెడ్డి తండ్రి వెంకటిరెడ్డి | - |
| 30 | 371/2 | పట్టా | మెట్ట | 0.15 | పిన్నపురెడ్డి వెంకటమ్మ భర్త వెంకటిరెడ్డి | - |
| 31 | 371/2 | పట్టా | మెట్ట | 0.15 | పిన్నపురెడ్డి రవీందర్‌రెడ్డి తండ్రి వెంకటిరెడ్డి | - |
| 32 | 371/2 | పట్టా | మెట్ట | 0.08 | పిన్నపురెడ్డి గోపాల్‌రెడ్డి తండ్రి అంతిరెడ్డి | - |
| 33 | 388/2 | పట్టా | మెట్ట | 0.17 | చొప్పరి చిన మారయ్య తండ్రి సాయన్న | - |
| 34 | 388/2 | పట్టా | మెట్ట | 0.17 | చొప్పరి జయమ్మ భర్త పెద మారయ్య | - |
| 35 | 388/2 | పట్టా | మెట్ట | 0.09 | పిన్నపురెడ్డి రవీందర్‌రెడ్డి తండ్రి వెంకటిరెడ్డి | - |
| ఉప మొత్తము | | | | 1.03 | | |
| 36 | 390/2 | పట్టా | మెట్ట | 0.10 | పిన్నపురెడ్డి పెద లక్ష్మారెడ్డి తండ్రి నర్సయ్య | - |
| 37 | 390/2 | పట్టా | మెట్ట | 0.10 | పిన్నపురెడ్డి అంతిరెడ్డి తండ్రి వెంకటిరెడ్డి | - |
| ఉప మొత్తము | | | | 0.20 | | |
| 38 | 391/2 | పట్టా | మెట్ట | 0.14 | గాడి గోవర్ధనరెడ్డి తండ్రి ప్రతాప్‌రెడ్డి | - |
| ఉప మొత్తము | | | | 0.14 | | |
| 39 | 392/2 | పట్టా | మెట్ట | 0.05 | గాడి ఆశామ్మ భర్త ఆదిరెడ్డి | - |
| ఉప మొత్తము | | | | 0.05 | | |
| 40 | 393/2 | పట్టా | మెట్ట | 0.18 | దేవ పెద మాధవరెడ్డి తండ్రి చంద్రారెడ్డి దేవ చిన మాధవరెడ్డి తండ్రి రాజిరెడ్డి | - |
| 41 | 393/2 | పట్టా | మెట్ట | 0.20½ | దేవ మల్లారెడ్డి తండ్రి బుచ్చిరెడ్డి | - |
| 42 | 393/2 | పట్టా | మెట్ట | 0.23 | దేవ ముత్యంరెడ్డి తండ్రి చంద్రారెడ్డి దేవ మల్లారెడ్డి తండ్రి బుచ్చిరెడ్డి | - |
| ఉప మొత్తము | | | | 1.21½ | | |
| 43 | 394/2 | పట్టా | మెట్ట | 0.01 | పిన్నపురెడ్డి ప్రభువర్ధన్ రెడ్డి తండ్రి చిన్న లింగారెడ్డి | - |
| ఉప మొత్తము | | | | 0.01 | | |
| 44 | 396/2 | పట్టా | మెట్ట | 0.29½ | గంట అంజయ్య తండ్రి పెద వెంకట్రాములు | - |
| 45 | 396/2 | పట్టా | మెట్ట | 0.29½ | గంట అంగిబాలు తండ్రి శ్రీరాములు | - |
| ఉప మొత్తము | | | | 1.19 | | |
| 46 | 397/2 | పట్టా | మెట్ట | 0.12½ | దేవ యాదగిరిరెడ్డి తండ్రి చిన్న చంద్రారెడ్డి | - |
| 47 | 397/2 | పట్టా | మెట్ట | 0.12½ | దేవ చిన మాధవరెడ్డి తండ్రి రాజిరెడ్డి | - |
| 48 | 397/2 | పట్టా | మెట్ట | 0.07 | పిన్నపురెడ్డి వెంకటిరెడ్డి తండ్రి లింగారెడ్డి | - |
| 49 | 397/2 | పట్టా | మెట్ట | 0.07 | పిన్నపురెడ్డి యాదగిరిరెడ్డి తండ్రి పెద్ద లింగారెడ్డి | - |
| 50 | 397/2 | పట్టా | మెట్ట | 0.23 | పిన్నపురెడ్డి వరలక్ష్మమ్మ భర్త చిన్న లింగారెడ్డి | - |
| ఉప మొత్తము | | | | 1.22 | | |
| 51 | 398/2 | పట్టా | మెట్ట | 0.03½ | దేవ మల్లారెడ్డి తండ్రి బుచ్చిరెడ్డి | - |
| ఉప మొత్తము | | | | 0.03½ | | |
| 52 | దొంక | ప్రభుత్వ | మెట్ట | 0.02½ | ప్రభుత్వ భూమి | - |
| ఉప మొత్తము | | | | 0.02½ | | |
| మొత్తం | | | | 18.35½ | | |

ప్రతిపాదిత భూమి భూసేకరణ చట్టము, 2013 నెం/30/2013 ప్రకారం 15లోని సెక్షన్/ సంబంధిత భూయజమానుల నుండి ముసాయిదా నోటిఫికేషన్‌పై ప్రతిపాదిత భూసేకరణ విషయములో 19 ఎటువంటి అభ్యంతరములు రానందున సెక్షన్ / ప్రకారం డిక్లరేషన్ జారీ చేయనైనది. ఇట్టి భూసేకరణ వలన ఎవరు ప్రభావితము కాలేదు. నిర్వాసితులు కాలేదు. కావున 31 సెక్షన్ (కేంద్ర చట్టము 30/2013) క్రింద విడిగా ఆర్ అండ్ ఆర్ అవార్డు జారీ చేయవలసిన అవసరము లేదు.

ప్రతిపాదిత భూసేకరణ భూమిలో ఎటువంటి భూగర్భ గనులు, బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూమిలో లేదా కొంత భాగములో లభ్యము అయినచో అట్టిని భూసేకరణ ఉద్దేశమునకు స్వీకరించబడును లేనిచో స్వీకరించబడదు.

పై విషయములో తెలపబడిన భూసేకరణ చేయబడు భూమి యొక్క ప్లాను ఏదేని పని దినములలో మరియు కార్యాలయము పని వేళలలో భూసేకరణాధికారి మరియు రెవిన్యూ మండలాధికారి, నల్లగొండ గారి కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/- భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, నల్లగొండ
సం/- జిల్లా కలెక్టర్ నల్లగొండ
DIPR Ro.No.1450/LA/PP/Agency/2019-20


# ‘హాట్ స్పాట్స్’ కాని ప్రాంతాల్లో!

- లాక్‌డౌన్ ఎత్తివేతపై ప్రధాని మోదీ సంకేతాలు
- ఎకానమీపై కరోనా ప్రభావాన్ని తగ్గించే దిశగా చర్యలు చేపట్టండి
- లాక్‌డౌన్ అనంతర కార్యాచరణపై ప్రణాళికలు రూపొందించండి
- కేబినెట్ భేటీలో ప్రధాని దిశానిర్దేశం

**న్యూఢిల్లీ:** ఏప్రిల్ 14 తరువాత లాక్‌డౌన్‌ను దశలవారీగా ఎత్తివేసే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి సంకేతాలిచ్చారు. దేశవ్యాప్తంగా వైరస్ హాట్‌స్పాట్స్ కాని ప్రాంతాల్లో లాక్‌డౌన్‌ను క్రమానుగతంగా ఉపసంహరించేలా ప్రణాళిక రూపొందించాలని కేంద్ర మంత్రులకు సూచించారు. ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా కూడా గత గురువారం ప్రధాని లాక్‌డౌన్ ఎత్తివేత దిశగా సంకేతాలిచ్చిన విషయం తెలిసిందే. దేశ ఆర్థిక రంగంపై కరోనా ప్రతికూల ప్రభావం అత్యంత కనిష్ట స్థాయిలో ఉండేలా లాక్‌డౌన్ అనంతరం వివిధ మంత్రిత్వ శాఖలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆయన మంత్రులను ఆదేశించారు. లాక్‌డౌన్ ప్రకటన అనంతరం తొలిసారి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని కేబినెట్ భేటీ నిర్వహించారు. వ్యవసాయ రంగంపై కరోనా ప్రభావం గురించి ఈ భేటీలో చర్చించారు. పంట కోతల సమయంలో రైతులను పూర్తి స్థాయిలో ఆదుకోవాలని ప్రధాని కోరారు. ‘రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలి. ఈ పంట కోతల సమయంలో సాధ్యమైనంత సాయాన్ని వారికి ప్రభుత్వం అందించాలి’ అని స్పష్టం చేశారు. పంటలను మార్కెట్లకు చేర్చేందుకు సాంకేతికత సాయం తీసుకోవాలని, క్యాబ్ సర్వీస్ అగ్రిగేటర్ల తరహాలో ట్రక్ సర్వీస్ అగ్రిగేటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయవచ్చేమో ఆలోచించాలని సూచించారు. గిరిజనుల నుంచి అటవీ ఉత్పత్తులను సేకరించే విషయంపైన కూడా దృష్టి పెట్టాలన్నారు. ఈ సంక్షోభ సమయాన్ని ‘మేక్ ఇన్ ఇండియా’ను ప్రోత్సహించేందుకు, విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు లభించిన ఒక అవకాశంగా భావించాలని ప్రధాని సూచించారు. కరోనాతో అతలాకుతలమైన ఆర్థిక రంగాన్ని పునరుత్తేజపరిచేందుకు మంత్రిత్వ శాఖలు ‘వ్యాపార కొనసాగింపు ప్రణాళిక’లను సిద్ధం చేయాలని ప్రధాని ఆదేశించారు. లాక్ డౌన్ అనంతరం అమలు చేయాల్సిన అత్యంత ముఖ్యమైన 10 నిర్ణయాలను, 10 ప్రాధాన్య రంగాలను గుర్తించాలని మంత్రిత్వ శాఖలకు విజ్ఞప్తి చేశారు. అలాగే, తమ తమ మంత్రిత్వ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న సంస్కరణలను అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, దేశీయంగా ఉత్పత్తులను పెంచడం, తద్వారా ఎగుమతులను పెంచేందుకు ఆచరణపూర్వక సూచనలు ఇవ్వాలని మంత్రులను కోరారు. కొత్తగా ఏయే ఉత్పత్తులను ఎగుమతి చేయొచ్చో, ఏయే దేశాలకు ఎగుమతి చేయొచ్చో ఆలోచించాలన్నారు. అదే సమయంలో దేశీయంగా నిత్యావసర వస్తువులకు కొరత రాకుండా చూడాలని మంత్రులను కోరారు. బ్లాక్ మార్కెట్‌ను, ధరలను అక్రమంగా పెంచడాన్ని అడ్డుకునే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన పథకం సమర్థవంతంగా అమలు జరిగేలా చూడాలని కోరారు. ఈ పథకం ప్రయోజనాలు లబ్ధిదారులకు కచ్చితంగా అందేలా చూడాలన్నారు. ప్రధాని నివాసంలో ప్రధానితో పాటు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, పలువురు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మిగతా మంత్రులు తమ కార్యాలయాలు, నివాసాల నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించే ఉద్దేశంతో మార్చి 25 నుంచి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతున్న విషయం తెలిసిందే.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మోదీ

### ఇది సుదీర్ఘ పోరాటం: మోదీ

కరోనా వైరస్‌పై భారత్ సుదీర్ఘ పోరు జరపాల్సి ఉంటుందని ప్రధాని మోదీ అన్నారు. ఈ పోరాటంలో అంతిమంగా భారత్ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కరోనా కట్టడికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఇతర దేశాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. బీజేపీ 40వ వ్యవస్థాపక దినం సందర్భంగా ప్రధాని పార్టీ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. ‘ఈ పోరాటం సుదీర్ఘ కాలం కొనసాగనుంది. అలసట చెందినట్లు గానీ, ఓటమి పాలయినట్లు గానీ మనం భావించరాదు. ఈ పోరాటంలో మనం విజయం సాధిస్తాం. విజేతలుగా నిలుస్తాం. కరోనా మహమ్మారిపై గెలుపు సాధించడమే యావత్ జాతి లక్ష్యంగా పెట్టుకుంది. కోవిడ్–19 తీవ్రతను అర్థం చేసుకుని సరైన సమయంలో సమగ్ర చర్యలు అమలు చేస్తున్న దేశాల్లో భారత్ ఒకటి. భారత్ తీసుకున్న చర్యలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయి. లాక్‌డౌన్ సమయంలో ప్రజలు చూపిన పరిణతి అపూర్వం. భారత్ వంటి పెద్ద దేశంలో ప్రజలు ఇలా క్రమశిక్షణ చూపుతారని ఎవరూ ఊహించి ఉండరు’ అని ప్రధాని అన్నారు.

### ఐసోలేషన్ కేంద్రాలుగా రైల్వే కోచ్‌లు

**న్యూఢిల్లీ:** కరోనాను ఎదుర్కొనేందుకు రైల్వే శాఖ 2,500 కోచ్‌లను ఐసోలేషన్ వార్డులుగా మార్చింది. మొత్తం 5 వేల కోచ్‌లను ఐసోలేషన్ కేంద్రాలుగా మార్చేందుకు రైల్వే శాఖ నిర్ణయం తీసుకోగా మొదటి దశలో భాగంగా 2,500 కోచ్ లను ఐసోలేషన్ కేంద్రాలుగా మార్చినట్లు రైల్వే శాఖ స్పష్టం చేసింది. వీటితో కొత్తగా 50 వేల ఐసోలేషన్ బెడ్లు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపింది.

# కరోనా మృత్యుఘోష

- దేశంలో 111కి చేరిన మరణాలు
- 24 గంటల్లో 28 మంది మృతి
- ఒకేరోజు 704 కొత్త కేసులు
- 4,281కి చేరిన పాజిటివ్ కేసులు

**న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారి కాటేస్తోంది. దేశంలో ఇప్పటిదాకా 111 మందిని బలి తీసుకుంది. గత 24 గంటల్లో రికార్డు స్థాయిలో 704 కొత్త కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, 28 మంది మృతి చెందారని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. దీంతో మొత్తం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య ఏకంగా 4,281కి చేరింది. బాధితుల్లో ఇప్పటిదాకా 318 మంది స్వస్థత పొందారు. కరోనా వల్ల గత 24 గంటల్లో మహారాష్ట్రలో 21 మంది, ఆంధ్రప్రదేశ్‌లో ఇద్దరు, తమిళనాడులో ఇద్దరు, పంజాబ్‌లో ఒకరు, గుజరాత్‌లో ఒకరు, ఉత్తరప్రదేశ్‌లో ఒకరు మృత్యువాత పడ్డారు. కరోనా మరణాల్లో మహారాష్ట్ర మొదటి స్థానంలో నిలుస్తోంది. ఈ రాష్ట్రంలో ఇప్పటికే 45 మంది బలయ్యారు. గుజరాత్‌లో 12 మంది, మధ్యప్రదేశ్‌లో 9 మంది, తెలంగాణలో ఏడుగురు, ఢిల్లీలో ఏడుగురు, పంజాబ్‌లో ఆరుగురు, తమిళనాడులో ఐదుగురు, కర్ణాటకలో నలుగురు మరణించారు. ఇతర రాష్ట్రాల్లోన మరణాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రాల వారీగా గణాంకాలను బట్టి చూస్తే కరోనాతో దేశవ్యాప్తంగా 137 మంది కన్ను మూసినట్లు, 4,678 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. ఇప్పటిదాకా వెలుగుచూసిన 4,281 కరోనా పాజిటివ్ కేసుల్లో 1,445 కేసులు తబ్లిగీ జమాత్‌కు సంబంధం ఉన్నవేనని గుర్తించినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది.


అహ్మదాబాద్‌లో క్రిమి సంహారిణులను వాహనం ద్వారా స్ప్రేచేస్తున్న సిబ్బంది

**యువతలోనూ ముప్పు అధికమే..**

మొత్తం కరోనా పాజిటివ్ కేసుల్లో పురుషుల వాటా 76 శాతం, మహిళల వాటా 24 శాతమని కేంద్ర ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ లవ్ అగర్వాల్ తెలిపారు. మొత్తం కేసుల్లో 40 ఏళ్లలోపు వారి వాటా 47 శాతం, 40 నుంచి 60 ఏళ్లలోపు వారి వాటా 34 శాతం, 60 ఏళ్లకుపైగా వయసున్న వారు 19 శాతమని పేర్కొన్నారు. మృతుల్లో పురుషులు 73 శాతం, మహిళలు 27 శాతమని చెప్పారు. మరణాల్లో 60 ఏళ్లలోపు వారు 63 శాతం, 40 నుంచి 60 ఏళ్లలోపు వారు 30 శాతం, 40 ఏళ్లలోపు వారు 7 శాతం.

### పాత మందుతో 48 గంటల్లో వైరస్‌కు చెక్?

ప్రాణాంతక కరోనా వైరస్‌ను ఇవర్‌మెక్టిన్ అనే మందు 48 గంటల్లోనే మట్టుబెడుతున్నట్లు మొనాశ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు నిర్వహించిన ఒక అధ్యయనం స్పష్టం చేసింది. శరీరంలోని పరాన్న జీవులను చంపేందుకు ఈ మందును చాలాకాలంగా వాడుతుండగా ఆస్ట్రేలియాలోని మొనాశ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు దీన్ని కోవిడ్‌పై ప్రయోగించి చూసింది. పరిశోధన శాలలో పెంచిన కరోనా వైరస్‌పై ఈ మందును ప్రయోగించినప్పుడు ఒకే ఒక్క డోస్‌తో వైరస్ 48 గంటల్లో మరణించినట్లు ఈ పరిశోధనలకు నేతృత్వం వహించిన డాక్టర్ కైల్ వాగ్‌స్టాఫ్ తెలిపారు. ఈ మందు పరిశోధనశాలలో కరోనా వైరస్‌తోపాటు డెంగీ, ఇన్‌ఫ్లూయెంజా, జికా, హెచ్‌ఐవీ వైరస్‌లపై కూడా ప్రభావం చూపిందని చెప్పారు. 24 గంటల తరువాతే ప్రభావం కనిపించడం మొదలైందని వాగ్‌స్టాఫ్ తెలిపారు. ఇవర్‌మెక్టిన్‌ను అందరికీ అందుబాటులోకి తేవాలంటే మరిన్ని పరీక్షలు తప్పనిసరిగా చేయాల్సి ఉందని, తాము కేవలం పరిశోధనశాలలో మాత్రమే ప్రయోగాలు చేశామని డాక్టర్ కైల్ వాగ్‌స్టాఫ్ తెలిపారు. అయితే ఈ మందును చాలాకాలంగా వాడుతున్న కారణంగా సురక్షితమైందని మాత్రం చెప్పవచ్చునని, వేసే మోతాదు ఎంతన్నది ఇంకా నిర్ణయించాల్సి ఉందని, ఇవన్నీ త్వరలో నిర్ణయిస్తామని చెప్పారు. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తున్న నేపథ్యంలో, అనుమతి పొందిన చికిత్స ఏదీ లేని తరుణంలో ఇప్పటికే వాడుతున్న మందు ఒకటి అందుబాటులో ఉందని తెలిస్తే.. ప్రజలు వేగంగా కోలుకునే అవకాశం ఏర్పడుతుందని వివరించారు.

### వీడియో కాన్ఫరెన్సింగ్ విచారణలకు సుప్రీంకోర్టు ఆదేశాలు



**న్యూఢిల్లీ:** కోవిడ్ మహమ్మారి విజృంభిస్తోన్న తరుణంలో అత్యవసరమైతే తప్ప కోర్టులకు రావాల్సిన అవసరం లేదనీ, అన్ని కోర్టులు భౌతిక దూరం పాటిస్తూ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీచేసింది. టెక్నాలజీని ఉపయోగించుకుని కోర్టుల్లో విచారణ చేపట్టాలని కోరుతూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ రాసిన లేఖను సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు ఈ ఆదేశాలను జారీచేసింది. న్యాయప్రక్రియ సజావుగా సాకేందుకు ఆధునిక సాంకేతిక తను ఉపయోగించుకుని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా విచారణ చేపట్టేందుకు దేశంలోని హైకోర్టులన్నింటికీ అనుమతినిస్తూ అత్యున్నత న్యాయస్థానం పలు మార్గదర్శకాలను విడుదల చేసింది.

# ఎంపీల వేతనాల్లో 30% కోత

- ప్రధాని, కేంద్ర మంత్రులకూ వర్తింపు
- కరోనాపై పోరుకు ఆ నిధులు

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్‌పై పోరాటంలో నిధులను సమకూర్చుకునే దిశగా కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు సహా పార్లమెంటు సభ్యులందరి వేతనంలో సంవత్సరం పాటు 30% కోత విధిస్తూ రూపొందించిన ఆర్డినెన్స్‌కు సోమవారం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. సంఘటిత నిధిలో చేరే ఈ మొత్తాన్ని కరోనాపై పోరాటంలో వినియోగించనున్నారు. ఈ మేరకు ‘శాలరీ, అలవెన్సెస్ అండ్ పెన్షన్ ఆఫ్ మెంబర్స్ ఆఫ్ పార్లమెంట్ యాక్ట్–1954’కు సవరణలు చేస్తూ ఆర్డినెన్స్ రూపొందించామని కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ వెల్లడించారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, రాష్ట్రాల గవర్నర్లు కూడా తమ సామాజిక బాధ్యతలో భాగంగా, తమ వేతనాల్లో కొంత భాగాన్ని కరోనాపై పోరుకు వినియోగించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారన్నారు. సాయం అందించడం మన నుంచే ప్రారంభం కావాలన్నానుడిని ఈ సందర్భంగా జవదేకర్ ఉటంకించారు. ఎంపీల వేతనానికి, ప్రధాని, ఇతర కేంద్ర మంత్రుల వేతనాలకు తేడా ఉంటుంది. ఎంపీలు నెలకు సుమారు రూ. లక్ష వేతనంతో పాటు, రూ. 70 వేలను నియోజకవర్గ అలవెన్స్‌గా పొందుతారు. మంత్రుల వేతనం కూడా దాదాపు అంతే ఉంటుంది కానీ వారికి వేరే అలవెన్సులు కూడా ఉంటాయి. అయితే, ఈ కోత వేతనానికే అని, పెన్షన్, ఇతర అలవెన్సుల్లో ఈ కోత ఉండబోదని ప్రభుత్వ అధికార ప్రతినిధి ఆ తరువాత వివరణ ఇచ్చారు. ఎంపీల్యాడ్(ఎంపీ లోకల్ ఏరియా డెవలప్‌మెంట్) ఫండ్ పథకాన్ని తాత్కాలికంగా నిలిపివేసేందుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకాన్ని రెండు ఆర్థిక సంవత్సరాల(2020–21, 2021–22) పాటు నిలిపివేయనున్నారు. ఈ మొత్తాన్ని కూడా కోవిడ్–19పై పోరుకు వినియోగిస్తారు. లోక్‌సభలో 543, రాజ్యసభలో 245 మంది సభ్యులున్నారు. ఈ మొత్తం 788 మంది ఎంపీలకు ఎంపీల్యాడ్స్ కింద ఒక్కొక్కరికి ఏటా రూ. 5 కోట్లు చొప్పున ఇస్తారు. రెండేళ్లకు గానూ ఈ మొత్తం దాదాపు రూ. 7,880 కోట్లు అవుతుంది. అలాగే, ఎంపీల వేతనాల్లో కోత ద్వారా ఏటా రూ. 29 కోట్లు కరోనాపై పోరాటానికి జమ అవుతాయి. వేతనాల్లో కోత ద్వారా కోల్పోయే మొత్తం ఎంపీలకు పెద్ద సమస్య కాబోదు కానీ, ఎంపీల్యాడ్స్‌ను కోల్పోవడంతో నియోజకవర్గాల్లో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ఎంపీల వేతనాల్లో కోత నిర్ణయాన్ని కాంగ్రెస్ స్వాగతించింది. అయితే, ఎంపీ ల్యాడ్స్‌పై నిర్ణయానికి సంబంధించి పునరాలోచించాలని కోరింది.



# అమెరికాలో మరింత తీవ్రం!

- పది వేలు దాటిన మరణాలు
- న్యూయార్క్‌లో నలుగురు భారతీయులు మృతి
- స్పెయిన్, ఇటలీల్లో తగ్గిన మృతులు


అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో జనసంచారం లేని రోడ్డుపైకి పిల్లలతోపాటు వచ్చిన బాతులు

**లండన్/పారిస్/వాషింగ్టన్:** కోవిడ్–19 మహమ్మారికి కళ్లెం పడుతోందా? చైనాలో పుట్టి ప్రపంచమంతా విస్తరించిన కరోనా వైరస్‌తో తీవ్రంగా నష్టపోయిన ఇటలీ, స్పెయిన్‌లలో కొన్ని రోజులుగా మరణాల సంఖ్య తగ్గుముఖం పడుతూండటం ఈ ఆశను కల్పిస్తోంది. అగ్రరాజ్యం అమెరికా పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. పదివేలకుపైగా మరణాలు నమోదు కావడంతోపాటు మరో వారం పాటు మరింత గడ్డు పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. కోవిడ్‌తో న్యూయార్క్‌లోనే 4,159 మంది ప్రాణాలు కోల్పోయారు. దేశ వ్యాప్తంగా ఒక్క రోజులోనే 594 మంది మృతి చెందారు. నిత్యం రద్దీతో ఉండే టైమ్స్ స్క్వేర్ కూడా బోసిపోయింది. కోవిడ్‌తో న్యూయార్క్‌లో నలుగురు భారతీయులు చనిపోయారని మలయాళీల సంస్థ ఒకటి తెలిపింది.

ప్రపంచ వ్యాప్తంగా సోమవారం నాటికి కోవిడ్ 72,636 మందిని బలి తీసుకోగా. 13 లక్షలకుపైగా కేసులు నమోదయ్యాయి. కోవిడ్ ప్రభావం 191 దేశాల్లో కనిపిస్తున్నప్పటికీ యూరప్‌లోనే 50,215 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇటలీలో సోమవారం నాటికి మరణాల సంఖ్య 16,523కు చేరుకుంది. దేశంలో 1.28 లక్షల మంది వ్యాధి బారిన పడ్డారు. స్పెయిన్‌లో 13,169 మంది ప్రాణాలు కోల్పోగా, 1.35 లక్షల మంది పాజిటివ్‌గా తేలారు. ఫ్రాన్స్‌లో 8,911 మందిని కోవిడ్ బలితీసుకోగా, 92,839 మందికి వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయ్యింది. ప్రపంచవ్యాప్తంగా 2.75 లక్షల మంది కోవిడ్ కోరల నుంచి తప్పించుకుని ఆరోగ్యవంతులు కావడం గమనార్హం. అమెరికాలో పదివేలకు పైగా మరణాలు నమోదయ్యాయి. 3.33 లక్షల మంది వ్యాధి బారిన పడ్డారు. బ్రిటన్‌లో వ్యాధి బారిన పడ్డ వారు 47 వేల పైచిలుకు మంది కాగా, 4834 మంది ప్రాణాలు కోల్పోయారు. చైనాలో 3,331 మంది కోవిడ్‌కు బలికాగా, మొత్తం 81,708 మందికి వైరస్ సోకింది.

**నిలకడగా బ్రిటన్ ప్రధాని ఆరోగ్యం**

కోవిడ్ బారిన పడిన బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ ఆరోగ్యం నిలకడగా ఉందని, కొన్ని పరీక్షల కోసం ఆయన ఒక రాత్రి ఆసుపత్రిలో గడపాల్సి వచ్చిందని ప్రభుత్వం తెలిపింది. బ్రిటన్‌లో ఆదివారం నాటికి కోవిడ్ బాధితుల సంఖ్య 48 వేలకు చేరుకోగా 4,934 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇలా ఉండగా, బ్రిటన్ రాణి ఎలిజబెత్ అరుదైన సందేశం ఇచ్చారు. బ్రిటన్, ఇతర కామన్వెల్త్ దేశాల ప్రజలు కలిసికట్టుగా కరోనా వైరస్‌ను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

### జపాన్‌లో అత్యవసర పరిస్థితి

**టోక్యో:** కరోనా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో జపాన్‌లోని పలు ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితిని ప్రకటించాలని జపాన్ ప్రధాని ప్రతిపాదించారు. ఆర్థిక వ్యవస్థపై కోవిడ్ ప్రభావాన్ని తగ్గించేందుకు లక్ష కోట్ల డాలర్లతో ఉద్దీపన ప్యాకేజీని ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని ప్రధాని షింజో అబే వెల్లడించారు. టోక్యో, ఒసాకా వంటి నగరాల్లో కరోనా వైరస్ కేసులు వేగంగా పెరుగుతున్నాయని అబే చెప్పారు.



అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తే ప్రజలందరూ ఇళ్లకే పరిమితమయ్యేలా, వ్యాపారాలను మూసివేసేలా కోరేందుకు గవర్నర్లకు అధికారాలు లభిస్తాయి. అయితే ఇవన్నీ లాక్‌డౌన్ తరహా ఆంక్షలతో పోలిస్తే ప్రభావం తక్కువ. ఒక నెల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని అబే అన్నారు. జపాన్‌లో మొత్తం 3,650 మంది కరోనా వ్యాధి బారిన పడ్డారు.

| ప్రపంచ వ్యాప్తంగా మొత్తం కేసులు | మరణాలు | కోలుకున్న వారు |
|---|---|---|
| 13,12,494 | 72,636 | 2,75,068 |

# సాక్షి 24|7 నల్లగొండ

NALGONDA DISTRICT

మంగళవారం, 7, ఏప్రిల్, 2020


## కరోనా మీటర్

(6వ తేదీ వరకు)



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. మొత్తం నలుగురు బర్మా దేశస్తులకు కరోనా సోకింది. తాజాగా నాగారం మండలం వర్ధమానుకోటలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురికి పాజిటివ్ వచ్చింది.

**నల్లగొండలో**

| | |
|---|---|
| మీర్‌బాగ్ కాలనీ | 4 |
| బర్కత్‌పుర | 2 |
| మాన్యంచెల్క | 1 |
| రెహమాన్‌బాగ్ | 1 |

సోమవారం ఇద్దరు బర్మావాసులకు పాజిటివ్ నిర్ధారణ అయ్యింది.




## న్యూస్‌రీల్

### పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయి

- విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



నల్లగొండ : జిల్లాలో కరోనా వైరస్ వ్యాప్తి విజృంభిస్తున్న నేపథ్యంలో పరిస్థితులు చేయిదాటిపోయే ప్రమాదం ఉందని, లాక్‌డౌన్‌ను మరింత కట్టుదిట్టం చేయాలని విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. పాజిటివ్ కేసులు నమోదు అయిన ప్రాంతాల్లో ప్రజలు సంచరించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కరోనా అనుమానం ఉన్న వారు స్వచ్ఛందంగా చికిత్స పొందేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆయా కాలనీల్లో నివసించే వారికి కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించేందుకు ప్రభుత్వ అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. వలస కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రకటించారు. సమావేశంలో స్థానిక శాసన సభ్యుడు కంచర్ల భూపాల్‌రెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎస్పీ ఏవీ రంగనాథ్‌లతోపాటు వైద్య ఆరోగ్యశాఖ, సివిల్ సప్లయ్ తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### బియ్యం పంపిణీ 50 శాతం పూర్తి : వనమాల



నల్లగొండ : జిల్లాలో ఇప్పటికే 50 శాతం రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమం పూర్తి అయిందని అదనపు కలెక్టర్ వనమాల చంద్రశేఖర్ అన్నారు. సోమవారం పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో ఉన్న చౌకధరల దుకాణం 39తోపాటు, శ్రీనివాస కాలనీలోని షాపు నంబర్ 61లో తెల్లరేషన్ కార్డుదారులకు ఉచితంగా ఇస్తున్న 12 కేజీల బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో 4,57,363 మంది కార్డుదారులు ఉండగా.. అందులో 13,97,776 మంది ఉన్నారని, వారందరికీ 12 కిలోల లెక్కన ప్రభుత్వం ఉచితంగా బియ్యం ఇస్తుందని తెలిపారు. 1,57,649.76 క్వింటాళ్ల బియ్యం కేటాయించగా ఇప్పటి వరకు 78850.71 క్వింటాళ్ల బియ్యం అందించడం జరిగిందన్నారు. బియ్యం తీసుకునే సమయంలో లబ్ధిదారులు భౌతికదూరం పాటించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ రుక్మిణి, ఏఎస్‌ఓ నిత్యానందం పాల్గొన్నారు.

### బీజేపీ ఆవిర్భావ వేడుకలు



నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోలి మధుసూదన్‌రెడ్డి ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లె బోయిన శ్యాంసుందర్, బాకి పాపయ్య, బండారు ప్రసాద్, నాయకులు మాదగోని శ్రీనివాస్‌గౌడ్, నూకల వెంకట్‌నారాయణరెడ్డి, యాదగిరాచారి, బొజ్జ శేఖర్ పాల్గొన్నారు.



నల్లగొండ : వాహనాల రాకపోకలు లేకపోవడంతో నిర్మానుష్యంగా కనిపిస్తున్న పానగల్ బైపాస్

# నిర్మానుష్యం

కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి ప్రజలు ఇంట్లో ఉండడం ఒక్కటే ఆయుధం. చిన్నాచితక పనులకు బయటికి వెళ్లే వారి సంఖ్య పెరుగుతోంది. దీనిని సైతం నిరోధించేందుకు పోలీసులు లాక్‌డౌన్ నిబంధనలు కఠినతరం చేశారు. సోమవారం నిత్యావసరాల దుకాణాలు తెరిచే సమయాన్ని సైతం కుదిరించారు. వాహనాల రాకపోకలను ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. సాయంత్రం ఆరునుంచే కర్ఫ్యూ అమలు చేస్తున్నారు. దీంతో జనసంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి.

# మరో 2



- జిల్లాలో 15కు చేరిన కరోనా కేసులు
- కట్టుదిట్టంగా లాక్‌డౌన్ అమలు..
- సడలింపు సమయం కుదింపు
- ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే షాపులు
- కరోనా కేసులు పెరుగుతుండడంతో ఈ నిర్ణయం
- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు
- రెండు కార్లు, రెండు బైక్‌లు సీజ్
- రోజూ 200 నుంచి 300 మందికి పోలీసుల కౌన్సెలింగ్

## తాజాగా ఇద్దరు బర్మావాసులకు పాజిటివ్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాకు వచ్చిన బర్మా దేశస్తుల్లో మరో ఇద్దరికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. జిల్లాలో ఇప్పటికే 13మంది కరోనా బారిన పడిన విషయం తెలిసిందే. అందులో నల్లగొండ పట్టణానికి చెందిన ఏడుగురు మర్కజ్‌వెళ్లొచ్చిన వారు ఉండగా, మిర్యాలగూడ, దామరచర్లకు చెందిన వారు ఒక్కొక్కరు ఉన్నారు. బర్మానుంచి మత ప్రచారం కోసం జిల్లాకేంద్రానికి వచ్చిన 17 మందిలో ఐదు రోజుల క్రితం ఇద్దరికి కరోనా ఉన్నట్లు తేలిన విషయం తెలిసిందే. వారిని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. నెగిటివ్ వచ్చిన వారిని అదేరోజు రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు పంపించారు. వారిలో సోమవారం ఇద్దరికి కరోనా పాజిటివ్ నిర్ధారణ కావడంతో జిల్లాలో కరోనా కేసుల సంఖ్య 15కు చేరింది. దీంతో ప్రజల్లో మరింత ఆందోళన నెలకొంది. వారు నల్లగొండలోని పలు మసీదుతోపాటు నార్కట్‌పల్లి మండలంలో మత ప్రచారం నిర్వహించినట్లు అధికారులు గుర్తించారు. తాజాగా మరో ఇద్దరికి రావడం వల్ల వారు కలిసిన వారికి మళ్లీ పరీక్షలు చేయడంతోపాటు ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీస్తున్నారు.

**మరింత కట్టుదిట్టంగా లాక్‌డౌన్ ...**

కరోనా కేసులు రోజురోజుకూ పెరుగుతుండడంతో దాన్ని కట్టడి చేసేందుకు అధికారులు లాక్‌డౌన్‌ను మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. గతంలో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు నిత్యావసరాల షాపులు తెరిచే ఉండేవి. కరోనా కట్టడి కోసం ఆ సమయాన్ని కుదించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే షాపులు తెరిచి ఉంచాలని ఆదేశాలు ఇచ్చారు. మెడికల్ షాపులు మినహాయించి మిగతావి ఏవి తెరిచినా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు నిత్యావసరాల కోసం ఉదయమే రావాలి తప్ప, సాయంత్రం సమయంలో రోడ్లపైకి రావద్దంటూ హెచ్చరిస్తున్నారు.

**రెడ్‌జోన్లపై మరింత నిఘా**

పాజిటివ్ వచ్చిన వారి కాలనీలను రెడ్‌జోన్లుగా ప్రకటించి అందులోనుంచి ఎవరూ బయటికి రాకుండా, బయటివారు ఆ కాలనీలకు వెళ్లకుండా బారికేడ్‌లను ఏర్పాటు చేసి పోలీసుల నిఘా ఏర్పాటు చేశారు. ఆయా కాలనీలవాసులకు అవసరమైన నిత్యావసరాలను డోర్ డెలివరీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

**లాక్‌డౌన్ ఉల్లంఘించిన వారిపై కేసులు**

లాక్‌డౌన్ ఉల్లంఘించిన వారిపై జిల్లా పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటివరకు 16 కేసులు నమోదు చేయగా, అందులో రెండు బైక్‌లు, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అదేవిధంగా ఇద్దరు హోం క్వారంటైన్‌లో ఉండాలని ఆదేశించగా, వారు ఉల్లంఘించడంతో క్వారంటైన్‌కు తరలించారు.

**రోజూ వందలాదిమందికి కౌన్సెలింగ్**

ఎలాంటి కారణాలు లేకుండా బైక్‌లపై రోడ్లపైకి వచ్చిన వారిని పోలీసులు పట్టుకొని తాత్కాలిక కేసులు నమోదు చేసి మొదటి తప్పుగా, రెండవ తప్పుగా మందలించి సాయంత్రం వదిలేస్తున్నారు. మూడో సారి తిరిగి అదే బండి రోడ్లపైకి వస్తే చివరి అవకాశం అంటూ హెచ్చరిస్తూ ఆ తర్వాత బండిని సీజ్ చేస్తామంటూ హెచ్చరించి పంపిస్తున్నారు. రోజూ 200 నుంచి 300 మందికి కౌన్సెలింగ్ ఇస్తూ ఇళ్లకు పరిమితం కావాలంటూ సూచిస్తున్నట్లు ఓ పోలీస్ అధికారి తెలిపారు.

**పరీక్షలకు మరో 32మంది నమూనాలు**

జిల్లాలో మరో 32మంది రక్త నమూనాలను కరోనా పరీక్షల కోసం అధికారులు పంపించారు. అందులో మిర్యాలగూడకు చెందిన 20 మందివి, నల్లగొండలో ఓ వైద్యుడి కుటుంబానికి చెందిన 9మందివి ఉన్నాయి. వీరితోపాటు జిల్లాకేంద్రాస్పత్రిలోని క్వారంటైన్‌లో ఉన్న మరో ముగ్గురి నమూనాలను పరీక్షల కోసం పంపించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.




## ఉలికిపడ్డ వర్ధమానుకోట

- మర్కజ్‌కు వెళ్లివచ్చిన వ్యక్తి ఇంట్లోనే ఆరుగురికి కరోనా

నాగారం : సూర్యాపేట జిల్లా నాగారం మండలం వర్ధమానుకోట గ్రామంలోని ఓ వ్యక్తి కుటుంబానికి చెందిన ఆరుగురికి సోమవారం కరోనా పాజిటివ్ వచ్చింది. సదరు వ్యక్తి ఇటీవల తన అల్లుడైన చివ్వెంల మండలం కుడకుడకు చెందిన వ్యక్తి(ఇప్పటికే ఇతనికి కరోనా పాజిటివ్ వచ్చింది)తో ఢిల్లీలో మతప్రార్థనలకు వెళ్లి వచ్చాడు. వర్ధమానుకోటకు చెందిన వ్యక్తి కుమారులు మార్చి20న సూర్యాపేటలోని కుడకుడలోని తన తమ బావ ఇంటికి వెళ్లారు. 23వ తేదీన వర్ధమానుకోటకు వచ్చారు. 2న కుడకుడకు చెందిన వ్యక్తికి పాజిటివ్ రావడంతో అదే రోజు రాత్రి వర్ధమానుకోట గ్రామానికి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులు 10 మందిని సూర్యాపేటలోని ఇమాంపేట ప్రభుత్వ క్వారంటైన్ సెంటర్‌కు తరలించారు. సోమవారం వారిలో ఆరుగురికి కరోనా పాజిటివ్‌గా వచ్చింది. పాజిటివ్ వచ్చిన వ్యక్తుల్లో అతని భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కోడళ్లు, ఒక కూతురు ఉన్నారు. ఇంటి యజమాని(మర్కజ్‌కు వెళ్లొచ్చిన వ్యక్తి)తో పాటు మరో నలుగురికి కరోనా నెగిటివ్‌గా రిపోర్టులు వచ్చాయి. పాజిటివ్ వచ్చిన వారిని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

# రవాణా ఖర్చులు మావే

- బత్తాయి, నిమ్మ రైతులకు ఉద్యానవనశాఖ ఆఫర్
- కరోనా నివారణలో విటమిన్ 'సీ' కీలకం
- దీంతో ఈ రెండు పంటలకు పెరిగిన డిమాండ్
- జిల్లాలో బత్తాయి 46వేల ఎకరాల్లో సాగు..
- 43 వేల మెట్రిక్‌టన్నుల దిగుబడి వస్తుందని అంచనా



నల్లగొండలో బత్తాయిల విక్రయం ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, ఎమ్మెల్యే కంచర్ల (ఫైల్)

నల్లగొండ రూరల్ : విటమిన్ 'సీ' సమృద్ధిగా ఉండే బత్తాయి, నిమ్మ పంటలను మార్కెట్‌కు తీసుకువచ్చే రైతులకు రవాణా ఖర్చులు ఇచ్చేందుకు ఉద్యానశాఖ నిర్ణయించింది. రోగ నిరోధక శక్తిని పెంచే బత్తాయి, నిమ్మ, సంత్రాలను రాష్ట్రంలోనే వినియోగించాలని సీఎం కేసీఆర్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయా పంటలను మార్కెట్‌కు తీసుకొచ్చే రైతులకు రవాణా ఖర్చును అందించాలని కలెక్టర్ ఇప్పటికే జిల్లా ఉద్యానవనశాఖ అధికారులను ఆదేశించారు. దీనిపై ఇటీవల జరిగిన సమావేశంలోనూ చర్చించారు. ఉద్యాన రైతులు నష్టపోకుండా, ప్రజల ఆరోగ్యం కోసం స్థానికంగా వినియోగం పెంచాలని, ఇతర జిల్లాలకు, మార్కెట్లకు సరఫరా చేసేందుకు అవసరమైన రవాణా ఖర్చులు అందిస్తామని కలెక్టర్ చెప్పారు. జిల్లానుంచి అధికంగా గడ్డి అన్నారం బత్తాయి మార్కెట్‌కు తరలిస్తుంటారు. దళారులు రైతుల తోటలవద్ద గుండుగుత్తలా, టన్ను ధర చొప్పున ఒప్పందం చేసుకొని గడ్డి అన్నారం మార్కెట్ తోపాటు ఢిల్లీ, ఆగ్రా, కలకత్తా ప్రధాన నగరాలకు ఎగుమతి చేస్తారు.

**46వేల ఎకరాలకుపైగా బత్తాయి సాగు ...**

జిల్లాలో 46వేల ఎకరాలకుపైగా బత్తాయి సాగులో ఉంది. 43వేల మెట్రిక్ టన్నుల దిగుబడి లభిస్తుంది. బత్తాయిలో కత్తెర, సీజన్ దిగుబడి లభిస్తుంది. కత్తెర దిగుబడి 20 శాతం ఉంటుంది. నిమ్మ 16వేల ఎకరాల్లో సాగులో ఉండగా 8వేల ఎకరాల పైచిలుకు తోటలు దిగుబడినిస్తాయి. 400 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు.

**రైతులపై లాక్‌డౌన్ ప్రభావం ...**

జిల్లా ఉద్యానవన రైతులపై లాక్‌డౌన్ ప్రభావం పడింది. నేరుగా మార్కెట్‌కు తెచ్చి అమ్ముకోవడం ఇబ్బందిగా ఉంటుందని పలువురు రైతులు అంటున్నారు. వీరు దళారులకు, లేదా నేరుగా గడ్డి అన్నారం మార్కెట్‌కు అమ్ముకోవడం అలవాటుగా మారింది. కరోనా పరిస్థితుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా రవాణా వ్యవస్థ నిలిచిపోయింది. ప్రస్తుతం కత్తెర సీజన్ బత్తాయిల దిగుబడి వస్తుంది. జూన్, జూలై నుంచి సీజన్ దిగుబడి అధికంగా లభిస్తుంది. గత ఏడాది మార్చిలో రూ.35వేలు టన్ను ధర ఉండగా ఈసారి కరోనా ప్రభావంతో రెండురోజుల క్రితం టన్ను రూ.18వేల వరకు విక్రయించారు. పెద్ద రైతులు స్థానిక మార్కెట్‌కు తరలించి విక్రయించడం సాధ్యం కాదని వాపోతున్నారు. చిన్న రైతులు మాత్రమే స్థానిక వినియోగానికి మార్కెట్ చేసుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

**స్థానిక వినియోగంతో ప్రయోజనం**

స్థానికంగానే బత్తాయి, నిమ్మను వినియోగించడం ద్వారా ఇటు ప్రజలు, అటు రైతులు లాభపడతారు. లాక్‌డౌన్ కారణంగా రైతులు లోకల్ మార్కెట్‌ను ఉపయోగించుకోకపోతే చెట్టుపైనా బత్తాయి, నిమ్మ రాలిపోయి రైతులు ఆర్థికంగా నష్టపోతారు. కత్తెర దిగుబడి సాధారణ దిగుబడిలో 20 శాతం ఉంటుంది. ఎకరం 10 టన్నుల దిగుబడి వస్తే ఇందులో కత్తెర దిగుబడి 2 టన్నులు ఉంటుంది.

**రైతులు ఏం చేయాలి...**

బత్తాయి, నిమ్మ , పుచ్చసాగు చేసిన రైతులంతా తమ దిగుబడులను స్థానిక మార్కెట్‌లో అమ్ముకునేందుకు సంబంధిత మండలంలోని ఉద్యానశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఏ దిగుబడిని తీసుకెళ్తున్నారు. ఎక్కడికి తీసుకెళ్తారో తెలియజేసి వివరాలు నమోదు చేసుకోవాలి .

**రైతులకు రవాణా ఖర్చులు అందిస్తాం..**



బత్తాయిలు, నిమ్మ పంటలను స్థానిక మార్కెట్లకు తరలించే రైతులకు రవాణా ఖర్చులను కలెక్టర్ ఆదేశాల ప్రకారం అందిస్తాం. దిగుబడులు అమ్ముకునే రైతులు సంబంధిత మండల ఉద్యాన అధికారులకు గానీ. జిల్లా కార్యాలయ అధికారులకు గానీ వివరాలు అందించాలి. ఇతర రాష్ట్రాలకు వెళ్తే రవాణా ఖర్చులు ఇవ్వం.

**సంగీత లక్ష్మి, జిల్లా ఉద్యాన అధికారి**

## ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలి : ఉత్తమ్

కొండమల్లేపల్లి : ప్రభుత్వం రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎంపీ, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని పెండ్లిపాకల, వర్ధమానిగూడెం, చింతకుంట్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, సరిపడా గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్, ఎంపీపీలు దూదిపాళ్ల రేఖ, పార్వతి, పీఏసీఎస్ చైర్మన్‌లు దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, జాల నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, సిరాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు

# మద్యం పట్టివేత

**సాక్షి ఎఫెక్ట్..**

హాలియా : నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని నిడమనూరు, తిరుమలగిరి (సాగర్) మండలాల్లో బెల్ట్ దుకాణాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని సోమవారం హాలియా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ నెల 6వ తేదీన 'సాక్షి' దినపత్రికలో 'లిక్కర్ జోరు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన హాలియా ఎక్సైజ్ శాఖ సీఐ యమునాధర్‌రావు నేతృత్వంలో సోమవారం నిడమనూరు, తిరుమలగిరి మండలాల్లో దాడులు చేపట్టారు. నిడమనూరు మండలంలోని మారుతీవారిగూడెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ బెల్ట్ దుకాణంపై దాడులు చేసి రెండు కాటన్ల బీర్లు, రెండు కాటన్ల ఓసీ క్వార్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా తిరుమలగిరి మండలంలోని అల్వాల ఎక్స్‌రోడ్డు వద్ద ఓ మోటర్ బైక్‌పై అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ యమునాధర్‌రావు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ. 28వేలు ఉంటుందని తెలిపారు. ఈ దాడిలో పాల్గొన్న సిబ్బంది ప్రేమలత, శ్రీను తదితరులు ఉన్నారు.

**బెల్ట్‌షాపులకు మద్యం ఎక్కడిది?**

లాక్‌డౌన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వైన్స్‌లను మూసివేయించింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 15 వైన్‌షాపులను సీల్ చేశారు. షాపులు మూసివేసి 15 రోజులు కావస్తున్నప్పటికీ బెల్టు షాపుల్లో మద్యం నిల్వలు తగ్గకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నియోజకవర్గంలోని ఆయా వైన్స్‌లకు వేసిన సీల్ వేసినట్లుగానే ఉన్నా, అందులో ఉన్న మద్యం మాత్రం ఖాళీ అవుతున్నట్లు తెలుస్తోంది. మార్చి నెలల్లో ఆయా షాపులకు ఎంత స్టాక్ వచ్చింది, ఎంత నిల్వలు ఉన్నాయి, లాక్‌డౌన్ ముగిసిన తరువాత ఉన్న స్టాక్ వివరాలను ఉన్నతాధికారులు తేలిస్తే వీరి గుట్టు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



మద్యం పట్టుకున్న ఎక్సైజ్ సీఐ యమునాధర్‌రావు

# మహిళా సంఘాలతో మాస్కుల తయారీ, అమ్మకాలు

- ప్రతి గ్రామంలో ఇంటింటికీ తిరిగి అమ్మాలి
- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

నల్లగొండ : కరోనా వైరస్ నియంత్రణలో భాగంగా గ్రామాల్లో, పట్టణాల్లో మాస్కుల తయారీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ అన్నారు. సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, పంచాయతీ పీఆర్ ఇంజనీర్లు, మండల పంచాయతీ అధికారులు, ఏపీఓలు, ఏపీఎంలు, కార్యదర్శులతో మాస్కుల తయారీ, నర్సరీల నిర్వహణ, మొక్కల సంరక్షణ, ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు మాస్కుల తయారీకి చర్యలు తీసుకోవడంతోపాటు వాటి ఉపయోగంపై టాంటాం, ఇతర ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలు, మెప్మా సంఘాల ద్వారా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన టైలర్లను గుర్తించడం, మాస్కుల తయారీకి కాటన్ వస్త్రాన్ని ఉపయోగించాలని చెప్పారు. రేట్లు నిర్ణయించడం వంటి పనులు వెంటనే పూర్తి చేసి మంగళవారం నుంచి మాస్కుల తయారీ, అమ్మకం పనులు చేపట్టాలన్నారు. మాస్కుల తయారీకి కావాల్సిన వస్త్రాల కొనుగోలుకు సంబంధిత షాపులు తెరిచే విధంగా ఆయా తహసీల్దార్లు, పోలీసుల సాయం తీసుకొని కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు, సిబ్బంది కచ్చితంగా మాస్కులు ధరించాలని సూచించారు. మొక్కల సంరక్షణపై కూడా శ్రద్ధ చూపాలని, వేసవి కావడంతో నర్సరీల్లో షేడ్‌నెట్‌లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి వైకుంఠ ధామాలకు ఆన్‌లైన్ బిల్లులు చెల్లించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, సీఈఓ వీరబ్రహ్మాచారి, పీఆర్‌ఈఈ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు


epaper.sakshi.com

సాక్షి **బిజినెస్**
మంగళవారం
7-4-2020
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు** (శుక్రవారం ముగింపు)

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 674 ▼ | 170 ▼ |
| 27,591 | 8,084 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

| | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 7,779 | ▲ 406 |
| డోజోన్స్ | 22,232 | ▲ 1180 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 5,582 | ▲ 167 |
| డాక్స్ | 10,075 | ▲ 549 |
| షాంఘై (శుక్రవారం ముగింపు) | 2,764 | ▼ 16 |
| నికాయ్ | 18,576 | ▲ 756 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | 72.95 | 79.81 |
| £ | బ్రిటన్ పౌండ్ | 91.69 | 98.44 |
| € | యూరో | 80.03 | 86.45 |
| ¥ | జపాన్ ఎన్ (100) | 60.00 | 78.00 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | 44.52 | 49.04 |
| S$ | సింగపూర్ డాలర్ | 51.75 | 55.99 |
| SAR | సౌదీ రియాల్ | 19.28 | 21.15 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | 19.42 | 22.06 |
| ¥ | చైనా యువాన్ | 9.61 | 11.38 |

# కరోనా మరణాలకూ బీమా పరిహారం

**లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ స్పష్టీకరణ**



**న్యూఢిల్లీ:** జీవిత బీమా పరిహార ప్రయోజనాలను కరోనా బారిన పడిన పాలసీదారుల కుటుంబాలకు కూడా అందించనున్నట్లు లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ వెల్లడించింది. కరోనాతో మరణించిన పాలసీదారుల క్లెయిమ్స్‌కు సైతం బీమా సంస్థలు చెల్లింపులు జరుపుతాయని స్పష్టం చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బీమా సంస్థలు ఇందుకు కట్టుబడి ఉన్నాయని తెలిపింది. ఈ విషయాన్ని ఇప్పటికే కస్టమర్లకు తెలియజేశాయని లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ వివరించింది. కరోనా క్లెయిమ్స్‌కు ఫోర్స్ మెజూర్ నిబంధన వర్తింపచేయడం లేదని తెలిపింది. సాధారణంగా ఊహించని, నియంత్రించలేని కారణాలతో తలెత్తే క్లెయిమ్‌లను ఈ నిబంధన కింద బీమా సంస్థలు తిరస్కరించవచ్చు. కరోనా వ్యాధికి కూడా ఇది వర్తిస్తుందేమోనని పాలసీదారుల్లో సందేహాలు నెలకొన్న నేపథ్యంలో లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ ఈ మేరకు వివరణ ఇచ్చింది. 'కరోనా సంబంధిత క్లెయిమ్‌ల విషయంలో పాలసీదారుల కుటుంబాలు ఇబ్బందులు పడకుండా డిజిటల్ మాధ్యమం ద్వారా పూర్తి సహాయానికి జీవిత బీమా రంగ సంస్థలు అన్ని చర్యలు తీసుకుంటున్నాయి. వదంతులు.. తప్పుడు వార్తలతో కస్టమర్లు అపోహ పడొద్దు' అని అని లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ సెక్రటరీ జనరల్ ఎస్ఎన్ భట్టాచార్య స్పష్టం చేశారు.

# పీఎం కేర్స్‌కు కొనసాగుతున్న విరాళాల వెల్లువ

**పోర్టులు, షిప్పింగ్ కంపెనీల నుంచి రూ. 52 కోట్లు**




**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ నియంత్రణ, సహాయక చర్యల కోసం ప్రధాన మంత్రి కార్యాలయం జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన నిధి 'పీఎం కేర్స్'కు విరాళాలు వెల్లువలా వస్తున్నాయి. కేంద్ర షిప్పింగ్ శాఖ పరిధిలోని అన్ని ప్రధాన పోర్టులు, ప్రభుత్వరంగ సంస్థలు కలిసి పీఎం కేర్స్‌కు సంయుక్తంగా రూ.52 కోట్ల విరాళాన్ని ప్రకటించాయి. వీటిల్లో 12 ప్రధాన పోర్టులతో పాటు కొచ్చిన్ షిప్‌యార్డ్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ కూడా పాలుపంచుకున్నాయి.

**ఐడీబీఐ బ్యాంకు రూ.3.95 కోట్లు**

ఐడీబీఐ బ్యాంకు రూ.3,95,46,223ను పీఎం కేర్స్‌కు విరాళంగా అందించింది. తద్వారా కరోనా వైరస్‌పై ప్రభుత్వం చేస్తున్న చర్యలకు తమ మద్దతునిస్తున్నట్లు ఐడీబీఐ బ్యాంకు సీఈవో, ఎండీ రాకేశ్ శర్మ పేర్కొన్నారు.

**టెస్టింగ్ కిట్స్‌ను అందిస్తున్న పెప్సికో**

ప్రముఖ పానీయాల సంస్థ పెప్సికో సైతం కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షల కోసం 25 వేల కిట్లను అందించనున్నట్లు తాజాగా ప్రకటించింది. అలాగే 50 లక్షల మందికి ఆహారాన్ని అందించనున్నట్లు పేర్కొంది.

# కేంద్రం నుంచి మరో ఆర్థిక ప్యాకేజీ!

**పరిశ్రమలకు ఆర్థిక సాయంపై కసరత్తు**




**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ కారణంగా ఏర్పడిన ప్రతికూల పరిస్థితుల నుంచి పరిశ్రమలను బయట పడేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరో ఆర్థిక ప్యాకేజీని సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. గత నెలలో రూ.1.70 లక్షల కోట్ల మేర పేద ప్రజలకు సాయమందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ ప్యాకేజీని ప్రకటించిన విషయం గుర్తుండే ఉంటుంది. దేశవ్యాప్తంగా మూడు వారాల పాటు లౌక్‌డౌన్ (అన్ని కార్యకలాపాలను నిలిపివేసి, ఎక్కడివారక్కడే ఉండేలా చేయడం) విధించగా, అది ఈ నెల 14వ తేదీతో ముగియనుంది. లౌక్‌డౌన్ కారణంగా ఎక్కువ ప్రభావితమయ్యే రంగాలకు ఆర్థిక ప్రోత్సాహకాలను అందించే ఓ ప్యాకేజీని కేంద్ర ఆర్థిక శాఖ రూపొందించే పనిలో ఉన్నట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. దీనికితోడు పేదలు, బలహీన వర్గాల వారిపై ప్రభావాన్ని తగ్గించే మరిన్ని సహాయక చర్యలను కూడా ప్రకటించే అవకాశం ఉన్నట్టు ఆ వర్గాలు తెలిపాయి. కరోనా వైరస్ కారణంగా ఏర్పడిన పరిస్థితులను పర్యవేక్షించేందుకు గత వారం ప్రధాన మంత్రి కార్యాలయం ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అతాను చక్రవర్తి నేతృత్వంలో ఏడుగురు సభ్యుల సాధికార గ్రూపును ఏర్పాటు చేసింది. కాగా, ప్రభుత్వం నుంచి ప్రకటన లౌక్‌డౌన్ ముగిసేనాటికి వస్తుందని సమాచారం.

# అయ్యో.. ఆతిథ్యం!

- హోటళ్లకు కరోనా కష్టాలు...
- 67 శాతం పడిపోయిన ఆక్యుపెన్సీ
- 73 శాతం తగ్గిపోయిన ఆదాయం
- మూసివేత రిస్కుల్లో చిన్న హోటళ్లు



**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణకు సంబంధించి లాక్‌డౌన్ అమలవుతున్న నేపథ్యంలో హోటల్ పరిశ్రమ పెనుసవాళ్లు ఎదుర్కొంటోంది. ఆక్యుపెన్సీ పడిపోయి, ఆదాయాలు తగ్గిపోయి ఆందోళన చెందుతోంది. రీసెర్చ్ సంస్థ ఎస్‌టీఆర్ నివేదిక ప్రకారం మార్చి 7 నాటికి ఆక్యుపెన్సీ 12 శాతం తగ్గగా.. మార్చి 21 నాటికి (లాక్‌డౌన్ ప్రకటించడానికి మూడు రోజుల ముందు) ఏకంగా 67 శాతం పడిపోయింది. ఆదాయాలు అంతకన్నా ఎక్కువగా పడిపోయాయి. ఫుడ్, బేవరేజెస్ అమ్మకాలు, ఈవెంట్స్ నిర్వహణ దెబ్బతినడంతో మార్చి 7 నాటికి ఆదాయంలో 20 శాతమే తగ్గుదల ఉండగా.. ఆ తర్వాత మార్చి 21 నాటికి ఏకంగా 73 శాతం పడిపోయింది. ఇదే పరిస్థితి కొనసాగితే గతేడాది ఆదాయాల్లో కనీసం 20 శాతం కూడా రాబట్టుకోవడం కూడా కష్టం కాగలదని హాస్పిటాలిటీ కన్సల్టింగ్ సంస్థ హోటలివేట్ పేర్కొంది. గతేడాది రూ. 37,000 కోట్లుగా ఆదాయం ఉండగా.. 2020లో ఇందులో 15–20% మాత్రమే హోటల్ పరిశ్రమ ఆర్జించవచ్చని ఓ నివేదికలో తెలిపింది. సత్వరం ఒడ్డున పడేసే చర్యలు తీసుకోకపోతే దేశీయంగా బ్రాండెడ్.. సంఘటిత హోటల్ మార్కెట్ నెలల తరబడి మందగమనంలో పడిపోయే అవకాశం ఉందని పేర్కొంది. వర్కింగ్ క్యాపిటల్, స్వల్పకాలిక రుణ లభ్యత లేక చిన్న స్థాయి హోటళ్లు దివాలా తీసే రిస్కులు ఉన్నాయని హోటలివేట్ హెచ్చరించింది. దేశీయంగా సంఘటిత రంగంలో 1,000 బ్రాండ్లు.. 1,25,000 గదులు ఉన్నాయని అంచనా. ఇవి కాక అసంఘటిత రంగంలో 1,2,3 స్టార్ కేటగిరీకి చెందిన అన్‌బ్రాండెడ్ హోటళ్లు కూడా చాలానే ఉన్నాయి.

**లక్షల్లో ఉద్యోగాలకు ఎసరు..**

వ్యాపారం పూర్తిగా నిల్చిపోయిందని పేరొందిన ఓ హోటల్ చెయిన్ సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ తెలిపారు. పరిస్థితి చక్కదిద్దేందుకు వెంటనే చర్యలు తీసుకోకపోతే, లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. బ్రాండెడ్ హోటళ్ల రంగంలోనే ఏకంగా 2,00,000 మంది పైగా సిబ్బంది ఉండగా అన్‌బ్రాండెడ్, అసంఘటిత హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు మొదలైన వాటి ద్వారా ఎన్నో లక్షల మంది ఉపాధి పొందుతున్నారు, సాధారణంగా చాలామటుకు హోటళ్ల వ్యయాల్లో జీతభత్యాలు మొదలైన వాటి వాటా 17–22% దాకా ఉంటుందని హోటలివేట్ తెలిపింది. వ్యాపారం సజావుగా సాగినా సాగకున్నా ఈ వ్యయాలు తప్పవని పేర్కొంది. సిబ్బంది జీతభత్యాల కోసం హోటళ్లకు వర్కింగ్ క్యాపిటల్ అవసరం ఎంతగానో ఉందని వివరించింది.

**భారీ రుణభారం...**

వ్యాపార విస్తరణ కోసం, హోటళ్ల ఆధునీకీకరణ కోసం సంఘటిత రంగ హోటళ్లు భారీగా రుణాలు తీసుకున్నాయి. 2020 జనవరి నాటికి వీటి మొత్తం రుణభారం దాదాపు రూ. 45,000 కోట్ల పైగా ఉంది. రాబోయే రోజుల్లో హోటళ్లు నెలవారీగా కట్టాల్సిన అసలు, వడ్డీలే వేల కోట్ల రూపాయల్లో ఉంటుందని హోటలివేట్ మేనేజింగ్ పార్ట్‌నర్ అచిన్ ఖన్నా చెప్పారు. వీటి చెల్లింపులకు సంబంధించి కనీసం 6–9 నెలల పాటైనా ఉపశమనం దొరికేలా ప్రభుత్వం, రుణాలిచ్చిన సంస్థలు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఏప్రిల్ 14 తర్వాత లాక్‌డౌన్ కొనసాగించే యోచనేదీ లేదని ప్రభుత్వం చెబుతున్నా... వ్యాపారం మళ్లీ పట్టాలెక్కేందుకు చాలా నెలలు పట్టేస్తుందని హోటల్ పరిశ్రమ ఆందోళన చెందుతోంది. ప్రయాణాలపరమైన ఆంక్షలు సడలించినా హోటల్ వ్యాపారాలు అప్పుడే పుంజుకోవడం కష్టమని భావిస్తోంది. పర్యాటకం ద్వారా (హోటళ్లు, టూరిజం సంస్థలు, మధ్యవర్తులు) దాదాపు 5.5 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు. వీరిలో 70% మంది ఉపాధి కోల్పోయే ప్రమాదముందనేది పరిశ్రమ వర్గాల మాట. ఇప్పటికే ఉద్యోగాల్లో కోత మొదలైందని, ఇది మరింత తీవ్ర రూపు దాల్చే అవకాశం ఉందని పేర్కొన్నాయి.

# విమానానికి సెగ

**సెప్టెంబర్ వరకూ బలహీనంగానే డిమాండ్ ● కాపా ఇండియా నివేదిక**



**ముంబై:** కరోనా వైరస్ కల్లోలానికి దేశీయ విమానయాన రంగం తీవ్రంగా ప్రభావితం కానున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా ఎయిర్ ట్రాఫిక్ 8–9 కోట్ల ప్రయాణికులకే పరిమితం కానున్నదని విమానయాన కన్సల్టింగ్ సంస్థ, కాపా ఇండియా వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం (2019–20)లో 14 కోట్ల మంది విమానాల ద్వారా ప్రయాణించారని అంచనా. విమాన ప్రయాణికుల సంఖ్య భారీగానే తగ్గడమే కాకుండా భారత విమానయాన సంస్థలకు రెండేళ్లలో అందాల్సిన 200కు పైగా విమానాలు మరో రెండేళ్ల జాప్యం తర్వాతే అందుతాయని పేర్కొంది. ఈ సంస్థ ఇంకా ఏం చెప్పిందంటే...

- కరోనా వైరస్ కల్లోలంతో పర్యాటకంపై ఆంక్షలు, ఆర్థిక మందగమనం... ఈ రెండు అంశాల కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో భారత విమానయానంపై ప్రభావం తీవ్రంగా ఉండనున్నది.
- సాధారణంగా ప్రతి ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసిక కాలం(జూలై–సెప్టెంబర్)లో విమానయాన రంగంలో డిమాండ్ బలహీనంగా ఉంటుంది. ఈసారి ఇంకా బలహీనంగా ఉండొచ్చు.
- ఏతావాతా ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో అవసరానికి మించి విమానాలు అందుబాటులో ఉంటాయి.
- ఇక ఈ ఆర్థిక సంవత్సరం మూడు, నాలుగో త్రైమాసిక కాలాల నుంచి సాధారణ స్థాయికి రావచ్చు.
- ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాఫిక్ కూడా భారీగానే తగ్గనున్నది. గత ఆర్థిక సంవత్సరంలో 7 కోట్ల మంది విదేశాలకు విమానాల ద్వారా ప్రయాణించారని అంచనాలున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 3.5–4 కోట్లకే పరిమితం కానున్నది.

# టూరిజం కుదేలు...



- ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ వెల్లడి
- స్థిరీకరణ నిధితో ఆదుకోవాలని వినతి

**కోల్‌కతా:** కరోనా వైరస్ మహమ్మారి ధాటికి దేశీ పర్యాటక, ఆతిథ్య రంగాలు ఊహించనంత వేగంగా కుదేలవుతున్నాయని ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) ఆందోళన వ్యక్తం చేసింది. టూరిజం శాఖ గణాంకాల ప్రకారం జనవరి–మార్చి త్రైమాసికంలో విదేశీ టూరిస్టుల రాక (ఎఫ్‌టీఏ) 67 శాతం, దేశీయంగా టూరిస్టుల ప్రయాణాలు 40 శాతం పడిపోయాయని వెల్లడించింది. 'కరోనా వైరస్ ప్రతికూల ప్రభావంతో దేశవ్యాప్తంగా హాస్పిటాలిటీ రంగంలో ఆక్యుపెన్సీ 18–20 శాతం పడిపోయే అవకాశం ఉంది. మొత్తం 2020లో సగటు రోజువారీ రేట్లు 12–14 శాతం తగ్గిపోవచ్చు' అని ఐసీసీ డైరెక్టర్ జనరల్ రాజీవ్ సింగ్ చెప్పారు. సుమారు 2.67 కోట్ల ఉద్యోగాల కల్పనతో ట్రావెల్, టూరిజం రంగం 2018లో దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 9.2 శాతం వాటా దక్కించుకుందని ఆయన తెలిపారు.

కరోనా సంక్షోభంలో చిక్కుకున్న చాలామటుకు టూరిజం సంస్థలు కనీసం ఆరు నెలల పాటైనా ఈఎంఐలు, పన్నులు, ఉద్యోగులకు వేతనాల చెల్లింపుల నుంచి తాత్కాలిక ఊరట కోసం ఎదురుచూస్తున్నాయని సింగ్ వివరించారు. ఈ నేపథ్యంలో టూరిజం, ట్రావెల్, హాస్పిటాలిటీ సంస్థలకు టర్మ్ రుణాల రీపేమెంట్‌పై మారటోరియం వ్యవధిని ఆరు నెలలకు వర్తింపచేయాలని, తదుపరి 12 నెలలకు జీఎస్‌టీ హాలిడే ప్రకటించి తోడ్పాటునివ్వాలని కేంద్రాన్ని ఐసీసీ కోరింది. ఆయా సంస్థలు ఆర్థికంగా నష్టపోకుండా, ఉద్యోగాల్లో కోత పడకుండా తోడ్పాటు కోసం ట్రావెల్ అండ్ టూరిజం స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది.

**ఆ నిబంధనతో టూరిజం రంగానికి కష్టమే..**

కరోనా కారణంగా ప్రయాణాలు రద్దు చేసుకున్న కస్టమర్లకు రీఫండ్ చేయకుండా ఫోర్స్ మెజూర్ నిబంధన వాడుకునేలా విమానయాన సంస్థలకు అనుమతినిచ్చిన పక్షంలో టూరిజం, ట్రావెల్ రంగ సంస్థలపై భారీ ప్రతికూల ప్రభావం పడుతుందని ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఏఎంఏఐ) ఆందోళన వ్యక్తం చేసింది. సంక్షోభం నుంచి ఎయిర్‌లైన్స్ బైటపడేందుకు ఇది ఉపయోగపడవచ్చు గానీ వ్యవస్థలోని మిగతా రంగాలను దెబ్బ తీస్తుందని, లక్షల మంది ఉపాధికి గండి కొడుతుందని పేర్కొంది

## నాస్కామ్ చైర్మన్‌గా ప్రవీణ్‌రావు



**న్యూఢిల్లీ:** ఇన్ఫోసిస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీవోవో)గా ఉన్న యూబీ ప్రవీణ్‌రావు ఐటీ కంపెనీల సమాఖ్య 'నాస్కామ్'కు చైర్మన్‌గా నియమితులయ్యారు. ప్రస్తుత నాస్కామ్ వైస్ చైర్మన్ స్థానం నుంచి ఆయన ఉన్నత బాధ్యతల్లోకి వెళుతున్నారు. డబ్ల్యుఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ గ్రూపు సీఈవో కేశవ్ మురుగేశ్ ఇప్పటి వరకు నాస్కామ్ చైర్మన్‌గా వ్యవహరించారు. ఆయన స్థానంలో 2020–21 ఆర్థిక సంవత్సరానికి నాస్కామ్ చైర్మన్‌గా ప్రవీణ్‌రావు సేవలు అందించనున్నారు. అస్సెంచర్ ఇండియా చైర్‌పర్సన్, సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన రేఖ ఎం మీనన్ నాస్కామ్ వైస్ చైర్‌పర్సన్‌గా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి పని చేయనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ రూపంలో జరిగిన నాస్కామ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఈ మేరకు నియామక నిర్ణయాలు తీసుకుంది.

## పెట్రోల్ అమ్మకాలు 18% డౌన్



**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ వ్యాప్తి కట్టడికి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలవుతున్న నేపథ్యంలో ఇంధనాలకు డిమాండ్ గణనీయంగా పడిపోయింది. వాహనాలు రోడ్ల మీదికి రావడం తగ్గిపోవడంతో మార్చిలో పెట్రోల్ అమ్మకాలు 17.6 శాతం, డీజిల్ విక్రయాలు 26 శాతం క్షీణించాయి. పలు విమానాలు రద్దు కావడంతో విమాన ఇంధన (ఏటీఎఫ్) అమ్మకాలు ఏకంగా 31.6 శాతం పడిపోయాయి. పెట్రోల్ అమ్మకాలు పడిపోవడం దాదాపు రెండున్నరేళ్లలో ఇదే తొలిసారి. ఏటీఎఫ్ విక్రయాలు 31.6 శాతం క్షీణించగా.. ఎల్‌పీజీ అమ్మకాలు మాత్రం 1.9 శాతం పెరగడం విశేషం.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 7-4-2020

| | |
|---|---|
| విశాఖ | 345-00 |
| చిత్తూరు | 403-00 |
| వరంగల్ | 353-00 |
| గోదావరి | 345-00 |
| విజయవాడ | 345-00 |
| 6-4-2020 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 350-00 |

# భారీ లాభాల్లో ప్రపంచ మార్కెట్లు



**హాంకాంగ్/న్యూయార్క్:** కొన్ని దేశాల్లో 'కరోనా' మరణాలు తగ్గడంతో సోమవారం ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి. కరోనా హాట్‌స్పాట్ దేశాలైన ఇటలీ, స్పెయిన్‌ల్లో కొత్త కేసులు తగ్గడం సానుకూల ప్రభావం చూపించింది. ఆసియా మార్కెట్లు 2–4 శాతం, యూరప్ మార్కెట్లు 3–6 శాతం లాభపడగా, రాత్రి గం. 11.30 ని.లకు అమెరికా స్టాక్ సూచీలు 5–6 శాతం రేంజ్ లాభాల్లో ట్రేడవుతున్నాయి. మహావీర్ జయంతి సందర్భంగా సోమవారం మన మార్కెట్ పనిచేయలేదు. ఒకవేళ మన స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో ట్రేడింగ్ జరిగి ఉంటే, సెన్సెక్స్, నిఫ్టీలు చెరో 3 శాతం లాభపడి ఉండేవని నిపుణులంటున్నారు.

ప్రపంచవ్యాప్తంగా సోమవారం నాటికి కరోనా కేసులు 12 లక్షలకు, మరణాలు 70,000కు పెరిగాయి. అయితే కొన్ని యూరప్ దేశాల్లో మరణాలు అంతకు ముందటి రోజుల కంటే తగ్గడంతో ప్రపంచ మార్కెట్లు పరుగులు పెట్టాయి. ఇటలీలో రెండు వారాల్లో కనిష్ట మరణాలు ఆదివారమే నమోదయ్యాయి. మరోవైపు స్పెయిన్‌లో మరణాల సంఖ్య వరుసగా మూడో రోజూ తగ్గింది. దక్షిణ కొరియా, ఆస్ట్రేలియాల్లో కొత్త కేసుల సంఖ్య తగ్గింది. ఇక అమెరికాలో కేసుల సంఖ్య నిలకడ స్థాయికి చేరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ వ్యాఖ్యానించడం కలసి వచ్చింది. ఎన్ఎస్ఈ నిఫ్టీకి ప్రతిరూపమైన ఎస్‌జీఎక్స్ నిఫ్టీ సోమవారం మొదటి సెషన్‌లో 4 శాతం లాభపడగా, రెండో సెషన్‌లో 1 శాతం లాభంతో ట్రేడవుతోంది. ఈ ప్రభావంతో నేడు (మంగళవారం) సెన్సెక్స్, నిఫ్టీలు భారీ గ్యాప్ అప్‌తో మొదలవుతాయని అంచనా.

# బ్యాంక్‌లపై కరోనా పిడుగు

- వడ్డీ వ్యయాలు పెరుగుతాయ్
- మొండి బకాయిలు మరింత పైపైకి
- ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ నివేదిక




**ముంబై:** కరోనా వైరస్ కల్లోలంతో ఆర్థిక పరిస్థితులు అతలాకుతలం కావడం.... మన దేశపు బ్యాంక్‌లపై ఈ ఏడాది తీవ్రమైన ప్రభావమే చూపనున్నది. మొండి బకాయిలు 2 శాతం, వడ్డీ వ్యయాలు 1.3 శాతం మేర పెరుగుతాయని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ తాజా నివేదిక వెల్లడించింది. కరోనా వైరస్ మరింత వేగంగా విస్తరిస్తుందని, మరింత కాలమే ఈ వైరస్ కల్లోలం కొనసాగుతుందన్న ఆందోళనలు నెలకొన్నాయని ఈ సంస్థకు చెందిన క్రెడిట్ ఎనలిస్ట్ గావిన్ గన్నింగ్ పేర్కొన్నారు. ఆయన ఇంకా ఏం చెప్పారంటే...

- ఈ ఏడాది ఆర్థిక రంగ కష్టాలు అంచనాలను మించి ఉంటాయి. ఇన్వెస్టర్లు రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడరు. దీంతో ఆర్థిక స్థితిగతులు మరింత అస్తవ్యస్తమవుతాయి. ఇది బ్యాంక్ రుణాలపై తీవ్రంగానే ప్రభావం చూపుతుంది.
- ప్రపంచ వ్యాప్తంగా బ్యాంక్‌ల వడ్డీ వ్యయాలు అదనంగా 30,000 కోట్ల డాలర్లు, మొండి బకాయిలు 60,000 కోట్ల డాలర్ల మేర పెరుగుతాయి.
- కరోనా కల్లోలం కారణంగా మొదటి దశలో కార్పొరేట్ రంగమే అధికంగా కుదేలైంది. బ్యాంకింగ్ రంగానికి సెగ పెద్దగా తగల్లేదు. ఈ వైరస్ ఉధృతి నానాటికీ తీవ్రమవుతుండటంతో బ్యాంకింగ్ రంగంపై ప్రభావం తీవ్రంగానే ఉండనున్నది.
- ఈ ఏడాది చైనా బ్యాంక్‌ల మొండి బకాయిలు కూడా 2 శాతం మేర పెరుగుతాయి. వడ్డీ వ్యయాలు మాత్రం 1 శాతం మేర మాత్రమే పెరుగుతాయి.

# అంబానీ సంపదపై కరోనా పడగ

- రెండు నెలల్లో 28 శాతం ఆవిరి
- 48 బిలియన్ డాలర్లకు చేరిక



**ముంబై:** దేశంలోనే అత్యంత ధనవంతుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ సంపద, కరోనా వైరస్ కారణంగా స్టాక్ మార్కెట్ల పతనంతో గణనీయంగా పడిపోయింది. కేవలం రెండు నెలల వ్యవధిలో దేశీయ ఈక్విటీ మార్కెట్లు గరిష్టాల నుంచి 35 శాతం పడిపోగా, ముకేశ్ అంబానీ సంపద విలువ కూడా 28 శాతం తగ్గి మార్చి 31 నాటికి 48 బిలియన్ డాలర్లకు దిగొచ్చింది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ముకేశ్ నికర విలువ 19 బిలియన్ డాలర్లు తగ్గినట్టు హరూన్ గ్లోబల్ రిచ్ లిస్ట్ పేర్కొంది. ఫలితంగా అంతర్జాతీయంగా కుబేరుల జాబితాలో ముకేశ్ అంబానీ 8 స్థానాలు దిగజారి 17వ స్థానానికి వచ్చినట్టు హరూన్ తాజాగా వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం.. ఇదే కాలంలో (ఫిబ్రవరి–మార్చి) అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ నికర విలువ సైతం 37 శాతం (6 బిలియన్ డాలర్లు) తగ్గింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ శివ్‌నాడార్ సంపద 26 శాతం (5 బిలియన్ డాలర్లు), కోటక్ మహీంద్రా బ్యాంకు చీఫ్ ఉదయ్ కోటక్ సంపద 28 శాతం (4 బిలియన్ డాలర్లు) తగ్గినట్టు హరూన్ నివేదిక తెలియజేస్తోంది.

స్టాక్ మార్కెట్ల పతనంతోపాటు, రూపాయి విలువ క్షీణించడం భారత పారిశ్రామిక వేత్తల సంపదపై ప్రభావం చూపించినట్టు హరూన్ పేర్కొంది. ఓయో రూమ్స్ ప్లాట్‌ఫామ్ అధిపతి రితేష్ అగర్వాల్ బిలియనీర్ స్థానాన్ని కోల్పోయినట్టు తెలిపింది. ప్రపంచ కుబేరుల జాబితాలో అమెజాన్ జెఫ్ బెజోస్ స్థానం చెక్కు చెదరలేదు. 131 బిలియన్ డాలర్లతో మొదటి స్థానంలో ఉన్నారు. కాకపోతే, గడిచిన రెండు నెలల్లో బెజోస్ సంపద కేవలం 9 శాతమే తగ్గింది. బిల్‌గేట్స్ 91 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో ఉన్నారు.

## సేవల రంగం కుదేలు

**మార్చిలో క్షీణతలోకి జారిన సూచీ**



**న్యూఢిల్లీ:** కరోనా ప్రభావంతో భారత్‌లో సేవల రంగం మార్చిలో తీవ్రంగా నష్టపోయింది. ఐహెచ్ఎస్ మార్కిట్ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ 49.3గా నమోదైంది. ఈ సూచీ 50 పాయింట్ల పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ దిగువనకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. దీని ప్రకారం, మార్చిలో క్షీణతలోకి జారినట్లే. ఫిబ్రవరిలో ఈ సూచీ 85 నెలల గరిష్ట స్థాయి 57.5 వద్ద ఉంది.

## కెనరా బ్యాంక్ 0.75% రేటు కోత



**ముంబై:** ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ రెపో ఆధారిత రుణ రేటును 75 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు 1%) తగ్గిస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. ఏప్రిల్ 7 నుంచీ తాజా రేటు అమల్లోకి వస్తుందని తెలిపింది. అన్ని కాలపరిమితులకు సంబంధించి ఎంసీఎల్ఆర్‌ను 35 బేసిస్ పాయింట్ల వరకూ తగ్గిస్తున్నట్లు పేర్కొంది. తనలో విలీనమైన సిండికేట్ బ్యాంక్‌కూ తాజా రేట్లు వర్తిస్తాయని తెలిపింది.

# ఫార్మా ఎగుమతులకు వైరస్ దెబ్బ!

**ఈ ఏడాది 22 బిలియన్ డాలర్ల లక్ష్యాన్ని చేరుకోలేం: ఫార్మెక్సిల్**



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** దేశీయ ఫార్మా ఎగుమతుల మీద కరోనా గట్టి దెబ్బే వేసింది. కేంద్రం కొన్ని రకాల ఔషధాల ఎగుమతుల మీద నియంత్రణ పెట్టడం, దేశవ్యాప్త లాక్‌డౌన్ నేపథ్యంలో దేశీయ ఫార్మా పరిశ్రమ 22 బిలియన్ డాలర్ల ఎగుమతుల లక్ష్యాన్ని చేరుకోలేదని ఫార్మాసూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్(ఫార్మెక్సిల్) తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో ఫార్మా ఎగుమతులు 19.14 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని.. 2020 ఆర్థిక సంవత్సరంలో 22 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా వేశామని ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్ తెలిపారు. గతేడాది మార్చి ఒక్క నెలలోనే 2.1 బిలియన్ డాలర్ల ఫార్మా ఎగుమతులు జరిగాయన్నారు. 2017–18లో ఫార్మా ఎగుమతులు 17.28 బిలియన్ డాలర్లు. పారాసిటమల్, హైడ్రాక్సిక్లోరోక్విన్ వంటి కరోనా నియంత్రణలో వినియోగించే ఔషధాల ఎగుమతుల మీద కేంద్రం నియంత్రణ విధించిన సంగతి తెలిసిందే. ఫార్మా ఎగుమతుల్లో వీటి వాటా 600 మిలియన్ డాలర్లుంటుందని పరిశ్రమ వర్గాల సమాచారం. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 18.74 బిలియన్ డాలర్ల ఎగుమతులను సాధించామని తెలిపారు.

## అపోలో ఫీవర్ క్లినిక్స్ ప్రారంభం




**న్యూఢిల్లీ:** కరోనా వ్యాధి వ్యాప్తి నేపథ్యంలో ప్రత్యేకంగా ఫీవర్ క్లినిక్స్‌ను ప్రారంభించినట్లు అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టయిల్‌లో భాగమైన అపోలో క్లినిక్స్ వెల్లడించింది. జ్వరాలు, తత్సంబంధిత లక్షణాల గురించి సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఇవి ఉపయోగపడతాయని పేర్కొంది. తొలి దశలో హైదరాబాద్‌తో పాటు చెన్నై, బెంగళూరు నగరాల్లో 21 క్లినిక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ ప్రతాప్ సి. రెడ్డి తెలిపారు. తర్వాతి వారంలో వీటిని 50కి పెంచనున్నట్లు వివరించారు. ప్రత్యేక ఫీవర్ క్లినిక్స్‌లో ఐసీఎంఆర్ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉంటాయని తెలిపారు.

epaper.sakshi.com

## కరోనాపై వాట్సాప్ 'చాట్ బాట్'

### ప్రారంభించిన మంత్రి కేటీఆర్

**సాక్షి, హైదరాబాద్:** 'కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలను చేస్తోంది. అందులో భాగంగా వివిధ సామాజిక మాధ్యమ వేదికలను ఉపయోగించుకుంటోంది. కరోనాపై పౌరులకు ప్రామాణికమైన సమాచారం అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం వాట్సాప్ సౌజన్యంతో నిర్దిష్టమైన చాట్ బాట్ రూపొందించింది'అని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. లాక్‌డౌన్ ను గౌరవిస్తూ ప్రజలందరూ ఇంటి వద్దనే ఉండాలని, అధికారిక మాధ్యమాల ద్వారా విడుదల చేసిన సమాచారంపైనే ఆధారపడాలని సూచించారు. కరోనాపై సమాచారాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన వాట్సాప్ 'చాట్ బాట్'ను కేటీఆర్ సోమవారం ఆవిష్కరించారు. 9000658658 నంబరుపై '' TS Gov Covid Info'' పేరిట రూపొందించిన ఈ వాట్సాప్ చాట్ బాట్ ద్వారా కరోనా గురించిన సమాచారంతో పాటు కరోనా నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలకు తెలియచేస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఎస్.బి.టెక్నాలజీస్, మెసెంజర్ పీపుల్ సంస్థతో కలిసి రాష్ట్ర ఐటీ, వైద్య ఆరోగ్య శాఖలు ఈ చాట్ బాట్‌ను రూపొందించాయి. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు.




**ఇలా చేయాలి...**

చాట్ బాట్ సంభాషణ ప్రారంభించడానికి 9000658658 నంబరుకు 'Hi'లేదా 'Hello'లేదా 'Covid'అని వాట్సాప్‌లో సందేశం పంపించాలి. లేదా https://wa.me/919000658658?text=Hi లింకును మొబైల్ నుండి క్లిక్ చేయాలి. సూచనలు ఉంటే covid19info-itc@telangana.gov.inకి ఈ మెయిల్ చేయవచ్చు.

## ఉచితంగా కూరగాయల పంపిణీ

### కౌన్సిలర్ దంపతుల ఔదార్యం



ఎన్నికల వేళే నాయకులకు ప్రజలు గుర్తుకొస్తారనే అపవాదు ఉంది. కానీ జనగామ మున్సిపాలిటీలోని ఓ కౌన్సిలర్ దంపతులు అందుకు భిన్నం. 13వ వార్డు కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళ తన భర్త రాజు సాయంతో లాక్‌డౌన్ నాటి నుంచి తోపుడు బండిపై కూరగాయలు పెట్టుకుని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.2,500 విలువైన కూరగాయలు అందించారు.

– సాక్షి, జనగామ

## సామాజిక బాధ్యతగా కరోనాపై పోరాటం

### కాంగ్రెస్ కార్యకర్తలకు టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ పిలుపు



**సాక్షి, హైదరాబాద్:** కరోనాపై పోరాటాన్ని కాంగ్రెస్ పార్టీ సామాజిక బాధ్యతగా తీసుకుందని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బాధ్యత గల ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ప్రభుత్వానికి నిర్మాణాత్మక సలహాలు, సూచనలు ఇస్తూనే తమ వంతుగా పేదలకు సాయం చేసే ప్రయత్నం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. జడ్చర్ల నియోజకవర్గ కాంగ్రెస్ నేత అనిరుధ్ రెడ్డి నేతృత్వంలో ఆ నియోజకవర్గ ప్రజలకు 1.50 లక్షల శానిటైజర్ బాటిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన సోమవారం గాంధీభవన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. లాక్‌డౌన్ వేళ పేదలను ఆదుకునే కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని కార్యకర్తలకు సూచించారు. అన్ని జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని, దీనికి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని పిలుపునిచ్చారు. జిల్లా, మండల, బ్లాక్, గ్రామ కాంగ్రెస్ నేతలు తమ ప్రాంతాల పరిధిలో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి కరోనాపై ప్రజలను చైతన్యవంతులు చేయాలని కోరారు.

## కరోనాపై పోరుకు 'మేఘా' సాయం

### మహారాష్ట్రకు రూ.2 కోట్లు విరాళం



**సాక్షి, హైదరాబాద్:** కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నానికి ప్రముఖ పారిశ్రామిక సంస్థ 'మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఏఈఐఎల్) విరాళాల ద్వారా తోడ్పాటునందిస్తోంది. తాజాగా మహారాష్ట్రకు రూ.2 కోట్లు విరాళాన్ని ప్రకటించింది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు రూ.5 కోట్లు చొప్పున ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రి సహాయ నిధికి మేఘా విరాళం అందజేసింది. దీంతో పాటు కర్ణాటకకు రూ.2 కోట్లు, ఒడిషాకు రూ.కోటి చొప్పున విరాళం ఇచ్చి దాతృత్వాన్ని చాటుకుంది. లాక్‌డౌన్ మూలంగా పేదలు, కూలీలు, ఆకలితో అలమటిస్తున్న వారికి ప్రభుత్వాలు చేసే సాయానికి తమ వంతుగా చేయూతనిస్తామని మేఘా ప్రకటించింది.

## విద్యార్థులకు, టీచర్లకు పోటీ

### కరోనా నివారణకు గ్లోబల్ గ్రాడ్స్ షో



**సాక్షి, హైదరాబాద్:** కరోనా కట్టడికి వివిధ ప్రయత్నాలు జరుగుతున్న క్రమంలో గ్లోబల్ గ్రాడ్స్ షో ( https://www.gloabalgradshow.com) ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, విశ్వవిద్యాలయాల కోసం ఓ స్పర్ధను ఏర్పాటు చేసింది. హోం క్వారంటైన్ మొదలుకొని బహిరంగ ప్రదేశాల్లో వైరస్‌ను నాశనం చేయడం వరకు కారోనా కీలక సమస్యలకు పరిష్కారం కనుక్కోవడం ఈ పోటీ ప్రధాన ఉద్దేశం. విద్యార్థులు, అన్ని విశ్వవిద్యాలయాలు, సైన్సేతర రంగాల అధ్యాపకులు కూడా పోటీలో పాల్గొనవచ్చు. ఈ పోటీలో వెలుగులోకి వచ్చే వినూత్నమైన పరిష్కారాలు వినియోగంలోకి వస్తే ఆ విద్యార్థికి ఏడాది ఫీజును బహుమతిగా అందిస్తారు. ప్రపంచాన్ని వణికిస్తోన్న కరోనా నుంచి ప్రజలను, ఆర్థిక రంగాన్ని రక్షించుకునేందుకు ఈ గ్లోబల్ గ్రాడ్ షో పోటీ ఉపయోగపడుతుందని ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ దుబాయ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో మహమ్మద్ అల్ షైబానీ తెలిపారు. 16న విజేతలను ప్రకటిస్తారు.

## 10న ఆన్‌లైన్ హ్యాకథాన్



**సాక్షి, హైదరాబాద్:** కరోనా నేపథ్యంలో 'ద మోత్వానీ ఇన్‌స్టిట్యూట్ ఫర్ థాట్ లీడర్‌షిప్ ఇన్ ఇన్నొవేషన్' ఈ నెల 10న ఆన్‌లైన్ హ్యాకథాన్ నిర్వహించనుంది. దేశవ్యాప్తంగా 3,000 మంది 72 గంటలపాటు జరిగే ఈ హ్యాకథాన్‌లో పాల్గొంటారని అంచనా. విజేతకు రూ.7.5 లక్షలు (పదివేల డాలర్లు) బహుమతిగా ఇస్తారు. శుక్రవారం సాయంత్రం 6 గం. వరకు www.code19.in వెబ్‌సైట్ ద్వారా పోటీలో పాల్గొనవచ్చని మోత్వానీ జడేజా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఆషా జడేజా మోత్వానీ తెలిపారు. వైద్యం, పరీక్షలు, ట్రావెల్–టూరిజం, ఐసోలేషన్, రక్షణ/మాస్కులు, భౌతిక దూరాన్ని పాటించడం, ఉపశమన చర్యలపై పోటీ ఉంటుంది. 14న విజేతలను ప్రకటిస్తారు.

# ఎలా ఉన్నాయ్?.. ఏం చేస్తున్నాయ్?

### వన్యప్రాణులు, జూల్లోని జంతువులపై ప్రత్యేక దృష్టి

- ప్రత్యేకించి కెమెరా ట్రాప్‌ల ద్వారా పులుల పరిశీలన
- వైరస్ లక్షణాలు ఉంటే వెంటనే తెలపాలని ఆదేశాలు
- 'న్యూయార్క్ పులి' ఉదంతంతో అటవీశాఖ హైఅలర్ట్



**సాక్షి, హైదరాబాద్:** కరోనా నేపథ్యంలో రాష్ట్ర అటవీశాఖ హైఅలర్ట్ ప్రకటించింది. అభయారణ్యాల్లోని పులులు, జింకల పార్కుల్లోని జింకలు, జూలలోని జంతువుల్లో వైరస్ లక్షణాలను పరిశీలించడంతో పాటు, వైరస్ వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను పీసీసీఎఫ్ ఆర్.శోభ ఆదేశించారు. పులులు ముక్కు కారడం, దగ్గు, ప్రయాసపడి ఊపిరి తీసుకోవడం వంటి లక్షణాలతో బాధపడుతున్నాయా అనేది ప్రత్యక్షంగా లేదా కెమెరా ట్రాప్‌లతో పరిశీలించాలని సోమవారం తాజాగా జారీచేసిన ఆదేశాల్లో స్పష్టంచేశారు. సోమవారం నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ రాష్ట్రాలకు జారీచేసిన ఉత్తర్వులకు అనుగుణంగా ఈ ఆదేశాలిచ్చారు. న్యూయార్క్‌లోని బ్రాంక్స్ జూలోని పులికి కోవిడ్–19 వైరస్ సోకినట్టు, ఇది ఇతర జంతువులకు వ్యాప్తి చెందే ప్రమాదంపై ఆదివారం యూఎస్ నేషనల్ వెటర్నరీ సర్వీసెస్ ల్యాబొరేటరీస్ ప్రకటించిన దరిమిలా.. జాతీయ పార్కులు, అభయారణ్యాలు, టైగర్ రిజర్వు ల్లో జంతువుల నుంచి జంతువులకు, మనుషుల నుంచి జంతువులకు, జంతువుల నుంచి మనుషులకు వైరస్ వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాల చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్లు, పీసీసీఎఫ్‌లకు కేంద్ర అటవీ శాఖ వైల్డ్‌లైఫ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. గోపీనాథ్ ఆదేశాలు జారీచేశారు. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఫీల్డ్ మేనేజర్, వెటర్నరీ డాక్టర్లు, అటవీ సిబ్బందితో టాస్క్‌ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లను ఏర్పాటు చేయాలన్నారు.

**అడవుల్లో జంతు సంరక్షణ ఇలా..**

పులుల సంరక్షణ సిబ్బంది.. పోస్ట్‌మార్టమ్ నిర్వహించాల్సిన కేసుల్లో స్థలం, లింగం, వయసు వంటివి రికార్డ్ చేయడంతో పాటు వైరస్ నిర్ధారణకు సంబంధించి నమూనాలు తీసుకోవాలని, సిబ్బంది పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ ఉపయోగించాలని తాజా ఆదేశాల్లో సూచించారు. వైరస్ ధ్రువీకరణ కోసం పులులు, ఇతర జంతువుల నమూనాలను ఐసీఏఆర్ ధ్రువీకరించిన ల్యాబ్‌లకు పంపించాలని పేర్కొన్నారు. జంతువుల సహజ మరణాలను ఫీల్డ్‌స్టాఫ్ గుర్తించిన వెంటనే పై అధికారులకు తెలపడంతో పాటు వాటి శాంపిళ్లను మార్గదర్శకాలకు అనుగుణంగా సేకరించి పరీక్షల నిమిత్తం భోపాల్, హిస్సార్, బరేలిలోని సంబంధిత పరిశోధన సంస్థలకు పంపించాలని సూచించారు. అటవీప్రాంతాలు, గ్రామాల్లో సంచరించే కోతులు, లంగూర్లలో కారోనా లక్షణాలున్నాయా అనేది గమనించాలని, అడవుల్లో సాసర్‌పిట్లను నింపే సిబ్బంది శానిటైజ్ కావాలని, టైగర్‌జోన్లు, అడవుల్లోకి సందర్శకులను వెళ్లనివ్వరాదని, సిబ్బంది జంతువుల దగ్గరకు వెళ్లడం, కృత్రిమ ఆహారం పెటవద్దని ఆదేశించారు.



**24 గంటలూ..**

రాష్ట్రంలోని జూలు, జింకల పార్కుల్లో వైరస్ వ్యాప్తి చెందకుండా 24 గంటలూ సీసీటీవీల ద్వారా పరిశీలించి, జంతువుల ప్రవర్తన ఎలా ఉందో గమనించాలని పీసీసీఎఫ్ ఆదేశించారు. జూలలోని పులులు, ఇతర జంతువుల్లో అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే శాంపిళ్లను ఐసీఎంఆర్ సూచించిన పరిశోధన సంస్థలకు పంపించాలని సూచించారు. సిబ్బంది అనారోగ్యంతో ఉంటే జూ, జింకల పార్కుల్లోకి ఎట్టి పరిస్థితుల్లో వెళ్లొద్దని ఆదేశించారు.

**జంతువుల ప్రవర్తన మారిందా?**

లాక్‌డౌన్‌తో అడవుల మీదుగా రాకపోకలు (అత్యవసరమైనవి మినహా) ఆగిపోయాయి. కాలుష్యం తగ్గి పర్యావరణపరంగా మంచిమార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఫలితంగా అడవుల్లో వన్యప్రాణుల సంచారం పెరిగింది. జంతువులు అటవీ ప్రాంతాల్లోని రోడ్లపైకి వస్తున్నాయి. ఈ సందర్భంగా ఇవెలా ప్రవర్తిస్తున్నాయో పరిశీలన, అధ్యయనం చేయాలని కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, డీఎఫ్‌వోలు, ఎఫ్‌డీవోలను అటవీశాఖ ఆదేశించింది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కవ్వాల్ టైగర్ రిజర్వ్, ఏటూరు నాగారం ఇతర అభయారణ్యాల్లోని జంతువుల కదలికలను కెమెరా ట్రాప్‌ల ద్వారా సునిశితంగా పరిశీలించాలని, అవి ఆహారాన్ని తీసుకునే పద్ధతుల్లో మార్పు వచ్చిందా? సహజ ప్రవర్తనకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయా? అనే దానిపై దృష్టిపెట్టాలని ఆదేశించింది. అడవుల్లోని కెమెరా ట్రాప్‌లను నీటికుంటలు, వనరుల వద్దకు, జంతువులు ఎక్కువగా రోడ్లు దాటేచోట్లకు మార్చి వాటి ప్రవర్తనను పరిశీలించాలని సూచించింది.

**ఫొటో, ఆధారాలతో నివేదిక..**

ఏయే జంతువులు ఏయే సమయాల్లో రోడ్లు, నీటికుంటల వద్దకు వస్తున్నాయో కెమెరా ట్రాప్ ఫొటో ఆధారాలతో గుర్తించేలా అటవీశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఆయా జంతుజాతుల్లో ఏవేవి గుంపులుగా వస్తున్నాయి, ఏవి ఒంటరిగా వస్తున్నాయి, ప్రవర్తిస్తున్న తీరును రికార్డ్ చేసి, సదరు ఫొటోలు, సమాచారాన్ని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌కు పంపించాలని ఉన్నతాధికారులు సూచించారు. అటవీ రేంజ్‌లు, ప్రధాన అటవీ ప్రాంతాల వారీగా ఫొటో ఆధారాలతో సహా నివేదికను నెలాఖరుకు సమర్పించాలని ఆదేశించారు. అలాగే, లాక్‌డౌన్ నేపథ్యంలో అనుమతించిన కొన్ని వాహనాలు అడవుల్లోని రోడ్ల మీదుగా అతివేగంగా వెళుతున్నందున జంతువులు ప్రమాదాల బారినపడకుండా క్రాసింగ్‌ల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టడం, స్పీడ్‌బ్రేకర్లు, ఇతరత్రా ఏర్పాట్లు చేయాలని సూచించింది.

## ట్రైనీ పోలీసులకు ప్రత్యేక డైట్



- అందరికీ మాస్కులు, శానిటైజర్లు, సి–విటమిన్ ట్యాబ్లెట్లు
- శిక్షణ కేంద్రాల్లో కట్టుదిట్టంగా భౌతిక దూరం
- లీవుల్లేవు.. అత్యవసరమై వెళ్లినా 14 రోజుల క్వారంటైన్

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ కోరలు చాపుతున్న వేళ పోలీసు శిక్షణ కేంద్రాలు అప్రమత్తమయ్యాయి. శిక్షణలో ఉన్న పోలీసులకు అధికారులు ప్రత్యేకమైన డైట్ ఇస్తున్నారు. లీవులన్నీ రద్దు చేశారు. అకాడమీల్లో ఔటింగ్‌లను పూర్తిగా రద్దు చేశారు. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే.. అది కూడా ప్రాణాపాయం, మరణాలు వంటి అత్యవసర పరిస్థితుల్లోనే అనుమతిస్తున్నారు. కరోనా కేసులు పెరుగుతుండటం, దేశమంతా లాక్‌డౌన్ విధించడంతో జిల్లాల్లో శిక్షణ పొందుతున్న అన్ని పోలీస్ ట్రైనింగ్ కాలేజీల్లోనూ ట్రైనీల ఆరోగ్యరీత్యా పలు చర్యలు చేపట్టారు. ప్రతీ ఒక్కరికీ ప్రత్యేకంగా మాస్కులు, శానిటైజర్లు ఇస్తున్నారు. శిక్షణ సమయంలో కూడా భౌతిక దూరం తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే, ట్రైనీ పోలీసులకు రోగనిరోధకశక్తి పెంపొందించేందుకు స్పెషల్ డైట్ ఇస్తున్నారు. ప్రత్యేకంగా సి–విటమిన్ మాత్రలతోపాటు నారింజ, బత్తాయి, పైనాపిల్ పండ్లను కూడా ఇస్తున్నారు.

**సెలవు తీసుకుంటే క్వారంటైన్ తప్పనిసరి..**

లాక్‌డౌన్ నేపథ్యంలో పీటీసీల్లో సెలవులు ఎప్పుడో రద్దు చేశారు. మరీ అత్యవసరమైన వారికి మాత్రమే ఇస్తున్నారు. ఒకవేళ అలా వెళ్లొచ్చిన నేపథ్యంలో వారు 14 రోజులు తప్పకుండా క్వారంటైన్‌లో డాక్టర్ల పర్యవేక్షణలో ఉండాల్సిందే. కొత్త వ్యక్తులను లోపలికి రానీయడంలేదు. పోలీసు శిక్షణ పొందుతున్న ప్రతీ ట్రైనీ ఆరోగ్య పరిస్థితిని పరీక్షించేందుకు 24 గంటలు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ట్రైనీ క్యాడెట్ల ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధతో పకడ్బందీగా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు.

**డీజీపీ ఆదేశిస్తే కరోనా విధుల్లోకి..**

2018లో తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్ పీఆర్‌బీ) 18 వేలకుపైగా పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో 12 మంది ఎస్సైలు, 17 వేల మంది కానిస్టేబుల్ పోస్టులున్నాయి. ఎస్సైలకు ఇప్పటికే సగం శిక్షణ పూర్తయింది. ఈ జనవరిలో దాదాపు 12 వేలమందికిపైగా కానిస్టేబుళ్లకు కూడా తరగతులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మొత్తం 13 వేలమందికిపైగా శిక్షణ పొందుతున్నారు. ఇటీవల జరిగిన మేడారం జాతర విధులకు ట్రైనీ ఎస్సైలు హాజరయ్యారు. నాలుగైదు రోజులపాటు వీరంతా విధులు నిర్వహించారు. రాష్ట్రంలో కరోనా కేసులు పెరిగిపోతున్న నేపథ్యంలో అత్యవసరమైతే.. అందులోనూ డీజీపీ నుంచి ఆదేశాలు వస్తేనే.. శిక్షణ సిబ్బందిని వినియోగించే అవసరాన్ని పరిశీలిస్తామని ఓ అధికారి వ్యాఖ్యానించారు.

## రెడీ టు ఈట్!

- నూడుల్స్, పాస్తా లాంటి ఫుడ్‌పై ప్రజల ఆసక్తి
- లాక్‌డౌన్‌తో సరుకులను సమకూర్చుకుంటున్న జనం
- స్టోర్‌లలో ఇన్‌స్టెంట్ ఫుడ్ పదార్థాలు ఖాళీ



**సాక్షి, హైదరాబాద్:** వీకెండ్ వచ్చిందంటే చాలు.. నచ్చిన హోటల్‌కు వెళ్లి మెచ్చిన ఆహారాన్ని లాగించేవారు. హోటల్‌కు వెళ్లే స్థోమత లేనివారు స్ట్రీట్ ఫుడ్ తిని ఎంజాయ్ చేసేవారు. ఇప్పుడు లాక్‌డౌన్‌తో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లన్నీ మూతపడ్డాయి. కరోనా కారణంగా కాలు బయట పెట్టే పరిస్థితి లేదు. దీంతో అంతా ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. నూడుల్స్, ఫ్రైడ్‌రైస్, పిజ్జా, బర్గర్లు, మంచూరియా లాంటి జంక్‌ఫుడ్‌ను లాగించినవాళ్లు ఇప్పుడు నోళ్లు కట్టేసుకోవాల్సిన పరిస్థితి. దీన్ని అధిగమించేందుకు ఇంట్లోనే ఈ ఫుడ్‌ను సిద్ధం చేసుకుంటున్నారు. కరోనా రాకముందు షాపింగ్ మాల్స్, దుకాణాల్లో కుప్పలు తెప్పలుగా కనిపించిన నూడుల్స్, సేమియా, పాస్తా ఇప్పుడు ఖాళీ అయిపోయాయి. ఫింగర్ చిప్స్, బ్రెడ్, చీజ్, బట్టర్, కార్న్ ఫ్లేవర్లు, ఫాస్ట్‌ఫుడ్‌లో ఉపయోగించే చిల్లీ, సోయా, టమోటా సాస్‌ల ర్యాక్‌లు ఖాళీఅయ్యాయి.

**లాక్‌డౌన్‌తో ముందుచూపు...**

కరోనా కారణంగా విధించిన లాక్‌డౌన్ ఎప్పటి వరకు కొనసాగుతుందో తెలియని పరిస్థితి... ఒకవేళ కేసుల సంఖ్య పెరిగితే మరికొన్నాళ్లు ఇంటికే పరిమితం కావాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితిని అధిగమించేందుకు చాలా మంది ముందుచూపుతో వ్యవహరిస్తున్నారు. రెడీ టు ఈట్ లాంటి ఆహార పదార్థాలను సమకూర్చుకుంటున్నారు. నూడుల్స్, సాస్‌లు, జంక్‌ఫుడ్‌లో వినియోగించే ఆహార పదార్థాలను కొనుగోలు చేస్తున్నారు.

## నిత్యావసరాల పంపిణీపై నివేదికివ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ధర్మాసనం ఆదేశం
- వైద్య రక్షణ పరికరాలు, క్వారంటైన్ సౌకర్యాలపై కూడా నివేదిక కోరిన కోర్టు



**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ తీవ్రత దృష్ట్యా లాక్‌డౌన్ ప్రకటించడంతో వైద్యులు, సిబ్బందికి రక్షణ పరికరాలు–మందులు, ప్రజలకు ఆహారం–నిత్యావసర వస్తువులు, క్వారంటైన్‌లో ఉన్న వారికి కల్పిస్తున్న సౌకర్యాలు తదితరాలపై నివేదిక అందజేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. 9వ తేదీ గురువారం నాటికి మధ్యంతర నివేదిక ఇవ్వాలని, పూర్తి నివేదికను ఈ నెల 15లోగా అందజేయాలని ఆదేశించింది. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డితో కూడిన ధర్మాసనం సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, ఇంకా ఎంత మేరకు అవసరం ఉంటాయి, వాటికోసం తీసుకున్న చర్యల గురించి నివేదికలో వివరించాలని కోరింది. నిత్యావసర వస్తువుల పంపిణీ, ఇక ముందు అవసరమైన సరుకుల గురించి కూడా మధ్యంతర నివేదికను తమ ముందు ఉంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 9వ తేదీకి వాయిదా వేసింది.

**వీడియో కాన్ఫరెన్సు ద్వారా విచారణ..**

విదేశాల నుంచి వచ్చే వారికి క్వారంటైన్స్‌లో సౌకర్యాలు కల్పించాలని, వైద్యం అందిస్తున్న సిబ్బందికి వైద్య రక్షణ పరికరాలు అందజేసేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని ధర్మాసనం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. ప్రాణాలను పణంగా పెట్టి వైద్య సేవలు అందిస్తున్న వారికి వైద్య రక్షణ పరికరాలు అందజేసేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఎన్ 95 మాస్క్‌లు, గ్లౌజ్‌లు, శానిటైజర్లు, వ్యక్తిగత వైద్య రక్షణ పరికరాలు తగినంతగా లేవని, వీటి తయారీకి లేదా దిగుమతికి చర్యలు తీసుకునేలా ఆదేశించాలని సూచించారు. లాక్‌డౌన్ వల్ల ఇబ్బందులు పడుతున్న వీధి పిల్లలు, అనాథలు, వసతి గృహాల్లోని వారు, తెల్లరేషన్ కార్డు లేని వారు, వలస కార్మికులకు వారి వద్దకే నిత్యావసర వస్తువులు అందజేసేలా చర్యలు తీసుకోవాలని న్యాయవాది కోరారు. కాగా, కరోనా వైరస్ వ్యాప్తి కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలను కఠినంగా అమలు చేస్తోందని అడ్వొకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్ చెప్పారు. కరోనాకు సంబంధించిన ఇతర కేసులు, న్యాయమూర్తులు జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు, జస్టిస్ కె.లక్ష్మణ్‌లతో కూడిన ధర్మాసనం వద్ద ఉన్న కేసుల్ని కూడా ఒకే ధర్మాసనం విచారిస్తే బాగుంటుందని ఈ సందర్భంగా ఏజీ కోరారు. దీంతో అన్ని కేసుల్ని ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనమే విచారిస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో అన్ని కేసుల్ని తమ ముందు ఉంచాలని రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.

## ఎస్‌హెచ్‌జీలకు మాస్కుల తయారీ కాంట్రాక్టు

### బాధ్యతలు అప్పగించిన పురపాలక శాఖ



**సాక్షి, హైదరాబాద్:** కరోనా నేపథ్యంలో మున్సిపల్ ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బంది, పోలీసుల రక్షణకు పెద్ద ఎత్తున మాస్కుల తయారీ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక మహిళా సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) అప్పగించింది. మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావు ఆదేశాల మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ ఎన్.సత్యనారాయణ ఆదివారం, సోమవారం పలు దఫాలుగా మున్సిపల్ కమిషనర్లు, మెప్మా మిషన్ కో–ఆర్డినేటర్లతో మాస్కుల తయారీపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి సామాజిక దూరం పాటించడంలో భాగంగా కొత్త టెక్నాలజీని (జూమ్ యాప్) ఉపయోగించి అధికారులు వారి ఇంటి నుంచే మొబైల్ ఫోన్ లేదా కంప్యూటర్ వెబ్ కెమెరా ద్వారా దాదాపు 300 మంది అధికారులతో (కమిషనర్లు, మెప్మా అధికారులు) డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో ఉన్న స్వయం సహాయ సంఘాల మహిళలు ఇంటి వద్దే తమ వద్ద ఉన్న కుట్టు మెషీన్ల ద్వారా యుద్ధ ప్రాతిపదికన 3 లక్షల మాస్క్‌ల తయారీకి ఆదేశించారు. ఒక మాస్క్ తయారీకి అయ్యే ఖర్చును కనిష్టంగా రూ.10, గరిష్టంగా రూ.14 చొప్పున కొనుగోలు చేసేందుకు మున్సిపల్ డైరెక్టర్ సత్యనారాయణ పరిపాలన అనుమతులు ఇచ్చారు. అన్ని మున్సిపాలిటీల పరిధిలో విధులు నిర్వహించే మున్సిపల్, పోలీసు, వీధి విక్రయదారులు తప్పక మాస్క్ ధరించాలని ఆదేశించారు.

## మిస్సింగ్ కాదు.. వార్డు మారాడంతే!

### గాంధీలో కరోనా అనుమానితుడి మాయంపై కలకలం

### పొరపాటున మరో అంతస్తులోకి వెళ్లి పడుకున్న వైనం

**గాంధీ ఆస్పత్రి:** సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో కరోనా అనుమానితుడు కొద్దిసేపు కనిపించకుండాపోయిన ఘటన కలకలం సృష్టించింది. అతడి సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ రావడంతో వార్డు నుంచి పరారైనట్టు భావించారు. చివరకు ఆస్పత్రి ఐదో అంతస్తులోని ఐసోలేషన్ వార్డులో బెడ్‌పై ఆదమరచి నిద్రిస్తున్న అతడిని గుర్తించిన వైద్యాధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

**పొరపాటున ఐదో అంతస్తులోకి..**



ఢిల్లీ మర్కజ్ ప్రార్థనలకు వెళ్లొచ్చిన గద్వాలకు చెందిన వ్యక్తి (35)ని ఈనెల 2న గాంధీ ఆస్పత్రిలో చేర్చారు. కరోనా నిర్ధారణ పరీక్షల్లో నెగెటివ్ రావడంతో హోం క్వారంటైన్‌లో ఉండాలని సూచిస్తూ పంపించేశారు. కాగా, హోం క్వారంటైన్ పరిశీలనకు వెళ్లిన వైద్యసిబ్బంది, పోలీసులు.. అతడు కరోనా పాజిటివ్ వ్యక్తులతో కలిసి కొన్నిరోజులు గడిపినట్లు గుర్తించారు. ప్రస్తుతం నెగెటివ్ వచ్చినా తర్వాత పాజిటివ్ వచ్చే అవకాశం ఉందని భావించి, అతడిని గాంధీ ఆస్పత్రిలోనే క్వారంటైన్ చేయాలని భావించారు. దీంతో అతడిని ఈ నెల 5న తిరిగి ఆస్పత్రికి తీసుకొచ్చి, ఆరో అంతస్తులోని ఐసోలేషన్ వార్డులో బెడ్ కేటాయించారు. కొంతసేపటికి అతడు వార్డు నుంచి బయటికొచ్చి నమాజ్ చేసుకుని, ఆరో అంతస్తు అనుకుని ఐదో అంతస్తులోని ఐసోలేషన్ వార్డులోకి వెళ్లి ఖాళీగా ఉన్న బెడ్‌పై పడుకుని సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేసుకున్నాడు.

**ఆచూకీ కనిపెట్టారిలా..**

ఆదివారం రాత్రి పది గంటల సమయంలో ఆరో అంతస్తు వార్డులో సదరు వ్యక్తి లేకపోవడం గుర్తించిన సిబ్బంది వైద్యాధికారులకు, పోలీసులకు తెలిపారు. సెల్‌ఫోన్ కాల్‌డేటాలో చివరి కాల్ గాంధీ ఆస్పత్రి టవర్ లొకేషన్ చూపించడం, తర్వాత స్విచ్చాఫ్ కావడంతో పరారయ్యాడనే అంచనాకు వచ్చారు. ఒక పోలీస్ బృందం గద్వాల వెళ్లగా, మరి కొన్ని బృందాలు ఆస్పత్రి పరిసరాలను జల్లెడ పట్టాయి. సీసీ కెమెరాల ఫుటేజ్ పరిశీలించగా ఆస్పత్రి ప్రాంగణంలో అతడు తిరిగిన దాఖలాలు కనిపించలేదు. దీంతో ఆస్పత్రిలోనే ఎక్కడో ఉంటాడని భావించిన పోలీసులు, వైద్యసిబ్బంది అణువణువూ గాలించగా, ఐదో అంతస్తులోని ఐసోలేషన్ వార్డు బెడ్‌పై పడుకుని కనిపించాడు. అన్ని అంతస్తులు, బెడ్‌లు ఒకేలా ఉండడంతో పొరబడి ఇక్కడే పడుకున్నానని అతడు పోలీసులకు చెప్పినట్టు తెలిసింది. అనంతరం అతడిని ఆరో అంతస్తులోని ఐసోలేషన్ వార్డుకు తరలించారు. మరోమారు నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వైద్యాధికారుల ఆదేశాలతో నగరంలోని క్వారంటైన్ కేంద్రానికి తరలిస్తామని ఆస్పత్రి అధికారులు తెలిపారు. కాగా, ప్రస్తుతం గాంధీ ఆస్పత్రి ఐసీయూలో 138 మంది బాధితులకు, ఐసోలేషన్ వార్డుల్లో 350 మంది అనుమానితులకు వైద్య సేవలు అందిస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com